/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ | శుక్రవారం • 17-2-2022 • సంపుటి:7 • సంచిక:18 • పేజీలు:12 • వెల:రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

మాఘమాసం, శుక్రవారం, తిథి: ద్వాదశి, ఉ.2.49 నుంచి రా.11.36 వరకు, నక్షత్రం: పూర్వాషాఢ, రా.8.28 వరకు, వర్జ్యం: ఉ.3.33-4.58 వరకు, దుర్ముహూర్తం: మ.12.07 నుంచి 12.53 వరకు, రాహుకాలం: ఉ.11.04-మ.12.30 వరకు




## 2024 కల్లా 15 కోట్ల 5జీ యూజర్లు..

నోకియా అంచనా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: టెలికాం సంస్థలు భారత్‌లో క్రమంగా 5జీ సేవలు విస్తరిస్తున్నాయి. ఇప్పటికే ప్రధాన నగరాల్లో 5జీ నెట్వర్క్ ..మిగతా 2లో

## మూడో రోజూ బీబీసీపై ఐటీ సర్వే

50 గంటలుగా 10 మంది సిబ్బంది ఆఫీసుల్లోనే..

2






## త్రిపురలో ప్రశాంతంగా ఎన్నికలు..

81.1 శాతం పోలింగ్

అగర్తల, ఫిబ్రవరి 16: ఈశాన్య రాష్ట్రం త్రిపురలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యాయి. చెదురుమొదురు ఘటనలు మినహా పోలింగ్ సజావుగా సాగిందని ముఖ్య ఎన్నికల అధికారి కిరణ్ కుమార్ దినకర్‌రావు వెల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ నిర్వహించగా 81.1 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. పలు ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించాయని.. వెంటనే వాటిని మార్చేసినట్లు స్పష్టం చేశారు. దీనికి ..మిగతా 2లో

## కూల్చేద్దాం, పేల్చేద్దాం అన్నవారిని..

# పాతాళంలోకి తొక్కేస్తారు

అభివృద్ధి, సంక్షేమానికే ప్రజల మద్దతు

రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్న ఘనత కేసీఆర్‌దే

ఉద్యోగ నోటిఫికేషన్లతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్ళు

బీబీసీపై ఐటీ దాడులు దారుణం

దేశం పరువు తీస్తున్న బీజేపీ

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు



యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమానికే పెద్దపీట వేస్తారని, అభివృద్ధి చెందుతున్న రాష్ట్ర సంపదను కూల్చేద్దాం పేల్చేద్దాం అన్న వారిని భూపాతాళంలోకి ప్రజలు తొక్కుతారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ ఫంక్షన్‌హాల్‌లో ఆలేరు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల ..మిగతా 2లో

## నీటి భద్రత ఆందోళనకర అంశం

దేశానికి అదో పెద్ద సవాల్..

సమష్టి బాధ్యతతో కాపాడుకోవాలి

నీటి సంరక్షణ విలువల పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలి

నీరు ఉంటేనే.. రేపు అనేది ఉంటుంది

ప్రధాని నరేంద్ర మోదీ

'జల్ జన్ అభియాన్' జాతీయ స్థాయి క్యాంపెయిన్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని



జైపూర్, ఫిబ్రవరి 16: దేశానికి నీటి భద్రత అనేది తీవ్ర ఆందోళనకర అంశమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సహజ వనరుల్ని కాపాడుకొనేందుకు సమష్టి బాధ్యతతో కృషిచేయాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. రాజస్థాన్‌లోని ..మిగతా 2లో



## 10 కి.మీ.ల ప్రయాణానికి అరగంట

బెంగళూరులో అత్యంత నెమ్మదిగా ప్రయాణం

ప్రపంచ నగరాల్లో రెండో స్థానం

బెంగళూరు, ఫిబ్రవరి 16: భారత్ కొన్నేళ్లుగా పలు రంగాల్లో శరవేగంగా పురోగతి సాధిస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో మెట్రో నగరాలకు జనాభా తాకిడి పెరుగుతోంది. దీంతో పలు నగరాల్లో ప్రజారవాణా వ్యవస్థ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో భారత్‌లో ట్రాఫిక్ సమస్య ప్రస్తావనకు రాగానే మొదట బెంగళూరు పేరు వినిపిస్తుంది! అత్యంత నెమ్మదిగా ..మిగతా 2లో



## డేటా సెంటర్లకు హైదరాబాద్ అనుకూలం..

నిర్మలమ్మకు మంత్రి కేటీఆర్ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): డేటా సెంటర్ల నిర్వహణలో తెలంగాణ ఇప్పటికే తన సమర్థతను నిరూపించుకొందని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. డేటా సెంటర్లకు హైదరాబాద్ అనుకూల ప్రదేశంగా ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు అంతర్జాతీయ డేటా రాయబార కార్యాలయాల అంశంపై కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన లేఖ రాశారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో డేటా ఎంబసీలను ఏర్పాటు చేయాలనే బడ్జెట్ ప్రతిపాదన గురించి లేఖలో ప్రస్తావించారు. అంతర్జాతీయ డేటా రాయబార కార్యాలయాలను ఒకే ప్రదేశంలో ఏర్పాటు చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. భూకంపాలకు ఎక్కువ అవకాశమున్న ..మిగతా 2లో



## తెలంగాణ మాదిరి పంజాబ్‌లోనూ కొత్త జల విధానం

సీఎం భగవంత్ మాన్

సిద్దిపేట, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం మాదిరి నీటి సేకరణ కోసం కొత్త జల విధానం రూపొందిస్తామని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ తెలిపారు. సిద్దిపేట జిల్లా పర్యటనలో భాగంగా గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు, మల్లన్నసాగర్, కొండపోచమ్మ జలాశయాలను గురువారం సందర్శించారు.అనంతరం రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు ..మిగతా 2లో

## మే నెలాఖరు వరకు కంటి వెలుగు

సీఎస్ శాంతికుమారి



హైదరాబాద్, ఫిబ్రవరి16 (మనం న్యూస్): ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం మే నెలాఖరు వరకు జరుగుతుందని, కార్యక్రమంలో లబ్ధిదారులకు అందించే ప్రిస్క్రిప్షన్ ఆధారంగా ఇచ్చే కంటి అద్దాల పంపిణీలో జాగ్రత వహించా లని అధికారులను ఆదేశించారు. కంటి వెలుగు, ఇంటి స్థలాల ఎంపిక, పోడు భూముల ..మిగతా 2లో



## రష్యాకు పట్టిన గతే చైనాకు..

ఘాటు వ్యాఖ్యలు చేసిన నిక్కీ హేలీ..

న్యూయార్క్, ఫిబ్రవరి 16: వచ్చే అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్ల తరుపున భారతీయ సంతతికి చెందిన రిపబ్లికన్ నాయకురాలు నిక్కీ హేలీ బరిలో నిలవనున్నారు. చెప్పకనే చెబుతూ.. ఆమె అప్పుడే అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి ప్రచారం ప్రారంభించినట్లయింది. ఇదిలా ఉంటే ఇటీవల అమెరికా, చైనాల మధ్య ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆమె చైనాపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కమ్యూనిస్ట్ చైనా చరిత్ర బూడిద కుప్పగా ముగుస్తుందంటూ విమర్శించారు. పూర్వపు సోవియట్ యూనియన్ లాగే ..మిగతా 2లో



## మెడికల్ కాలేజీలు ఏ జిల్లాల్లో ఉన్నాయో కేసీఆర్‌కు తెలియదా?

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): తెలంగాణలో మెడికల్ కాలేజీలు ఏ జిల్లాల్లో ఉన్నాయో తెలియదా? అని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ విమర్శించారు. 'అమృతకాల బడ్జెట్' అంశంపై దూరదర్శన్ ..మిగతా 2లో

### మంచిమాట

మనకెప్పుడూ తగినంత కాలం ఉండనే ఉంటుంది. కానీ దానిని జాగ్రత్తగా వినియోగించుకోవడమే తెలుసుకోవాలి.

శుభోదయం



## మూడోరోజూ బీబీసీపై ఐటీ సర్వే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: 'బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్'పై ఆదాయపు పన్ను శాఖ సర్వే మూడో రోజూ కొనసాగుతోంది. పన్ను ఎగవేతకు పాల్పడుతోందన్న అనుమానంతో ఢిల్లీ, ముంబయిలోని సంస్థ కార్యాలయాల్లో ఈ సర్వే నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి బీబీసీకి చెందిన 10 మంది ఉన్నతస్థాయి సిబ్బంది తమ ఇళ్లకు వెళ్లలేదని తెలుస్తోంది. సర్వేలో భాగంగా వారు కార్యాలయాల్లోనే ఉన్నట్లు సమాచారం. మంగళవారం ఉదయం 11 గంటల తర్వాత ఈ సర్వే మొదలైన విషయం తెలిసిందే. ఇప్పటికే దాదాపు 50 గంటలు దాటింది. కార్యాలయాల్లో పత్రాల పరిశీలన కొనసాగుతోంది. బీబీసీలోని ఆర్థిక, మరికొన్ని విభాగాల సిబ్బందితో ఐటీ అధికారులు మాట్లాడుతున్నారు. ఇతర విభాగాల వారు, పాత్రికేయులు మాత్రం మంగళవారం రాత్రే ఇళ్లకు వెళ్లిపోయేందుకు అనుమతించారు. ఇదిలా ఉంటే.. భారతదేశంలోని వీక్షకులకు సేవలు ఎప్పటిలానే కొనసాగుతున్నట్లు బీబీసీ తెలిపింది. 2002 గుజరాత్ అల్లర్లపై 'ఇండియా.. ది మోదీ క్వశ్చన్' పేరిట బీబీసీ డాక్యుమెంటరీని రూపొందించింది. దానిని భారత్ తీవ్రంగా ఖండించింది. అదొక విద్వేషపూరిత చర్యగా అభివర్ణించింది. విదేశీ వ్యవహారాలశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి మాట్లాడుతూ.. 'ఇది ఒక ప్రచార కార్యక్రమం. వారు ఎంచుకున్న కోణాన్ని ప్రచారం చేయడానికి మాత్రమే దీనిని రూపొందించారు' అని వ్యాఖ్యానించారు. కాగా, డాక్యుమెంటరీ వివాదంపై అమెరికా, బ్రిటన్ దేశాలు దూరం పాటించాయి.

## 2024 కల్లా 15 కోట్ల 5జీ యూజర్లు..

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులోకి వచ్చింది. ఈ ఏడాది చివరకు దాదాపు దేశంలోని అన్ని ప్రాంతాల్లో 5జీ సేవల్ని అందుబాటులోకి తీసుకురావాలని జియో లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు 5జీ సేవలకు అనుగుణంగా యూజర్లు సైతం తమ హ్యాండ్ సెట్లను అప్‌గ్రేడ్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో 2024 నాటికి 15 కోట్ల 5జీ మొబైల్ సబ్‌స్క్రైబర్లు ఉంటారని నోకియా అంచనా వేసింది.

**2జీ సబ్‌స్క్రైబర్లు 35 కోట్ల నుంచి 25 కోట్లకు..**

అదే సమయంలో 2024 కల్లా దేశవ్యాప్తంగా 4జీ, 5జీ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 99 కోట్లకు చేరుతుందని నోకియా పేర్కొంది. అలాగే అప్పటికీ 2జీ వినియోగించే వారి సంఖ్య 15 కోట్లుగా ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్‌లో 35 కోట్ల 2జీ సబ్‌స్క్రైబర్లు ఉన్నట్లు తెలిపింది. మరోవైపు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 2 కోట్ల 5జీ కస్టమర్లు ఉన్నట్లు వెల్లడించింది. గత ఏడాది అక్టోబరులో దేశంలో 5జీ సేవలు ప్రారంభమైన విషయం తెలిసిందే. 2023-24 చివరికి 10 కోట్ల 5జీ కస్టమర్లను జత చేసుకోవాలని జియో లక్ష్యంగా పెట్టుకుంది.

**8.5 కోట్ల మంది దగ్గర 5జీ ఫోన్లు..**

నోకియా నివేదిక ప్రకారం.. 2022లో భారత్‌కు ఏడు కోట్ల 5జీ డివైజ్‌లు దిగుమతి అయ్యాయి. మరోవైపు 73 కోట్ల యాక్టివ్ 4జీ యూజర్లలో 8.5 కోట్ల మంది దగ్గర 5జీని సపోర్ట్ చేసే ఫోన్లు ఉన్నాయి. నెట్వర్క్ అందుబాటులోకి వస్తున్న కొద్దీ 5జీ స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరుగుతుందని నివేదిక అభిప్రాయపడింది.

**నెలకు 45 జీబీ డేటా వినియోగం..**

5జీ అమలు వల్ల దేశంలో డేటా వినియోగం గణనీయంగా పెరుగుతుందని నోకియా అంచనా వేసింది. 2027 నాటికి నెలకు ఒక్కో యూజర్ వినియోగించే సగటు డేటా 46 జీబీకి చేరుతుందని తెలిపింది. ప్రస్తుతం అది 19.5 జీబీగా ఉన్నట్లు పేర్కొంది. ప్రపంచంలోనే అత్యధికంగా డేటా వినియోగించే దేశంగా భారత్ నిలుస్తుందని తెలిపింది.

## త్రిపురలో ప్రశాంతంగా ఎన్నికలు..

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన ఓట్ల లెక్కింపు మార్చి 2న జరగనుంది. త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా తన ఓటు హక్కును అగర్తలాలో వినియోగించుకున్నారు. త్రిపురలో కచ్చితంగా బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల కోసం 31 వేల మంది పోలింగ్ సిబ్బంది, 25వేల మంది కేంద్ర భద్రతా బలగాలను మోహరించారు. 2024లో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనుండగా.. ఈ ఏడాది తొమ్మిది రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. తాజాగా జరిగిన త్రిపుర ఎన్నికలతో మినీ సార్వత్రికం ప్రారంభమైనట్లైంది. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా-ఐపీఎఫ్‌టీతో కలిసి పోటీ చేస్తుండగా సీపీఎం-కాంగ్రెస్‌తో జట్టు కట్టి బరిలో నిలిచింది. ప్రద్యోత్ బిక్రమ్ మానిక్య దేవ్ వర్మ నేతృత్వంలోని తిప్రా మోతా పార్టీ సొంతంగానే ఎన్నికల క్షేత్రంలో తలపడుతోంది. ఈ ఏడాది ఎన్నికలకు జరిగిన తొలి రాష్ట్రం త్రిపుర. నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీలకు ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనుండగా, 2024లో లోక్‌సభ ఎన్నికలకు ముందు మరో ఐదు రాష్ట్రాలు ఈ ఏడాది ఎన్నికలను ఎదుర్కోనున్నాయి.

## 10 కి.మీ.ల ప్రయాణానికి అరగంట

(మొదటిపేజీ తరువాయి)

డ్రైవింగ్ సాగే నగరాల్లో బెంగళూరు ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలిచినట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ జాబితాలో లండన్ తొలి స్థానంలో కొనసాగుతున్నట్లు తెలిపింది. డ్రైవింగ్‌కు సంబంధించి జియోలొకేషన్ సాంకేతికతలో ప్రముఖంగా ఉన్న టామ్‌టామ్.. ట్రాఫిక్ ఇండెక్స్ 2022 పేరుతో తాజా అధ్యయనం చేపట్టింది. ప్రపంచవ్యాప్తంగా 56 దేశాల్లోని 289 నగరాల్లో అధ్యయనం జరపగా.. అత్యంత నెమ్మదిగా ప్రయాణం సాగే నగరాల్లో బెంగళూరు ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నట్లు పేర్కొంది. నగర కేంద్రంలో రోడ్డు మార్గంలో 10 కి.మీలు ప్రయాణం చేసేందుకు దాదాపు అరగంట సమయం (29 నిమిషాల 9 సెకన్లు) పడుతుందని తెలిపింది. గరిష్ఠంగా లండన్ నగరంలో 36 నిమిషాల 20 సెకన్లు పడుతోందని.. తదుపరి స్థానాల్లో ఐర్లాండ్ రాజధాని డబ్లిన్, జపాన్‌లోని సప్పోరో, ఇటలీలోని మిలాన్ నగరాలు ఉన్నట్లు తాజా అధ్యయనంలో పేర్కొంది. అత్యంత మెల్లగా వాహనం నడిచే నగరాల జాబితాలో బెంగళూరు(2), పుణె(6), ఢిల్లీ(34), ముంబయి(47) స్థానాల్లో ఉన్నాయి. వాహనాలు నెమ్మదిగా ప్రయాణించడం వల్ల సమయం, ఖర్చుతోపాటు కర్బన ఉద్గారాల ప్రభావంపైనా టామ్‌టామ్ అధ్యయనం చేసింది. రద్దీ సమయంలో ట్రాఫిక్ వల్ల పని గంటలు వృథా కావడాన్ని తాజా నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. ఈ జాబితాలో బెంగళూరు నాలుగో స్థానంలో నిలవగా.. డ్రైవర్లు ఏడాదికి 129 గంటలు నష్టపోతున్నట్లు తెలిపింది. భారీ ట్రాఫిక్ కారణంగా డ్రైవర్ల జేబులకూ చిల్లు పడుతోందని.. రద్దీ సమయంలో ఎక్కువ సమయం ట్రాఫిక్‌లో నిలిచిపోవడం వల్ల కర్బన ఉద్గారాలు భారీగా పెరుగుతున్నాయని చెప్పింది. కర్బన ఉద్గారాలను ఎక్కువగా విడుదల చేసే జాబితాలో లండన్ తొలి స్థానంలో ఉండగా.. బెంగళూరు ఐదో స్థానంలో నిలిచింది.




# కూల్చేద్దాం, పేల్చేద్దాం అన్నవారిని..
# పాతాళంలోకి తొక్కేస్తారు



(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పుట్టినరోజు కానుకగా యాదగిరిగుట్టలో 45 కోట్ల రూపాయలతో వంద పడకల హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సిద్దించిన తరువాత ఒక్క సంవత్సరంలోనే 9 ప్రభుత్వ మెడికల్ కళాశాలల ఏర్పాటు చేయబోతున్నామని, అందులో భాగంగా యాదాద్రిలో త్వరలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామని అన్నారు. వచ్చేనెల మొదటి వారంలో ప్రభుత్వవిప్ గొంగిడి సునితా మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా న్యూట్రిషన్ కేసీఆర్ కిట్టును ప్రారంభించబోతున్నామని అన్నారు. విద్యుత్‌ను ఇతర రాష్ట్రాల నుండి యూనిట్‌కు 25నుండి 30రూపాయలు చెల్లించి సరఫరా చేసుకుని రైతులకు 24 గంటల విద్యుత్‌ను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మోటర్లకు మీటర్లు పెట్టాలని ఆదేశించిన పెట్టడంలేదని తెలంగాణకు రావాల్సిన రూ.33కోట్ల నిధులు నిలిపివేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తే బీజేపీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, బిజెపి, కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ పేరుతో సచివాలయాన్ని కూల్చేస్తాం పేల్చేస్తాం అనడం బాధాకరమని అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో స్థానిక ప్రజలకు, యాదాద్రి క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన వైద్యం కోసం వంద పడకల ఆసుపత్రిని నిర్మాణం చేస్తున్నామని, వైద్య రంగంలో తెలంగాణ దేశంలోనే మూడవ స్థానంలో ఉంటుందని, టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఆలేరు, భువనగిరి, మునుగోడు నియోజకవర్గాలకు డయాలసిస్ సెంటర్‌లు కేటాయించామని అన్నారు. నిరుద్యోగుల కోసం 81వేల ప్రభుత్వ నోటిఫికేషన్లు వేయడం జరిగిందని, నిరుద్యోగ కుటుంబాలను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయని అన్నారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నిర్మించడం జరిగిందని, ఒక్క డబుల్ బెడ్‌రూమ్‌ఇండ్లు మాత్రం ఇవ్వలేక పోయామని, స్థలం ఉన్నవారికి మూడులక్షల రూపాయలు ఇల్లు కట్టుకోవడానికి మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు.

**దేశం పరువు పోతున్నది**

బీబీసీపై ఐటీ రైడ్ చేయడం దారుణమని, ఇది చూసి జనం నవ్వుకుంటున్నారని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బీబీసీ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంస్థ అని, ఆ సంస్థపై దాడి చేసి దేశం పరువు తీసేలా కేంద్రం వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీబీసీలో ఒక వార్త వచ్చిందని తెల్లారి ఐటీ దాడులు చేయించారని, ప్రపంచం ముందు దేశం పరువు పోతున్నదని వాపోయారు. నాయకులకు ఓపిక, సమాధానం చెప్పే శక్తియుక్తులు ఉండాలని, ఇలా దాడులు సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఐటీ, ఈడీలను తోలుతా అంటే దేశం పరువు పోదా? అని ప్రశ్నించారు.

**ఒక గుంట ఎండొద్దనేది కేసీఆర్ ఆలోచన**

వెయ్యి కోట్ల రూపాయలు అదనంగా విద్యుత్ శాఖకు ఇవ్వాలని, ఎంత ఖర్చయినా విద్యుత్ కొని రైతులకు ఫుల్ కరంట్ ఇవ్వాలని సీఎం కేసీఆర్ చెప్పినట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రోజుకు 40-50 కోట్లు ఖర్చు చేసి కరంట్ కొంటున్నామని, యూనిట్‌కు 25 నుంచి 30 రూపాయలు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఒక రూపాయి కూడా తీసుకోకుండా బోరు కాడ, బాయి కాడ రైతులకు ఉచిత కరంట్ ఇస్తున్నామని చెప్పారు. ఎండకాలం ఒక గంట కూడా ఎండొద్దనేది సీఎం ఆలోచన అని తెలిపారు. అందుకోసం రాత్రీపగలు కష్టపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ దేశంలో బీజేపీ పరిపాలించే రాష్ట్రంలో గానీ, కాంగ్రెస్ పరిపాలించే రాష్ట్రంలో గానీ తెలంగాణ లెక కరెంట్ ఇస్తలేరని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు కింద రూ.65 వేల కోట్లు,



రైతు బీమా కోసం రూ.5,400 కోట్లు, ఉచిత విద్యుత్ కోసం రూ.50 వేల కోట్లు ఖర్చు పెట్టిందని వివరించారు.

ప్రభుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునితా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వర భగీరథుడు హరీష్ రావత్ అని ఆయన ఏ రంగంలో ఉన్న ఆ స్థానానికి వన్నె తెచ్చే విధంగా ఆయన మెప్పిస్తారని అన్నారు. వంద పడకల హాస్పిటల్ నిర్మాణానికి హరీష్‌రావు రావడం ఆనందం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బడుగు లింగయ్యయాదవ్, డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ ఎరుకల సుధ హేమేందర్‌గౌడ్, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీ, మండల కోఆప్షన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, చైర్మన్‌లు, పిఎసిఎస్ చైర్మన్‌లు, మదర్‌డైరీ చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, అనుబంధసంఘాల అధ్యక్ష,కార్యదర్శులు, సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, వార్డుమెంబర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీలు ఏ జిల్లాల్లో ఉన్నాయో కేసీఆర్‌కు తెలియదా?

(మొదటిపేజీ తరువాయి)

న్యూస్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన డీడీ డైలాగ్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. చేతులు జోడించి చెబుతున్నా.. భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్‌లకు చేరాలన్న లక్ష్యంపై జోకులు వద్దని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో చేసిన అప్పులపై కేంద్రమంత్రి మాట్లాడారు. కేసీఆర్ పాలనకు ముందు తెలంగాణ రాష్ట్రం అప్పులు ఎంత? ఇప్పుడు తెలంగాణ అప్పులు ఎంత? అని ప్రశ్నించారు. 2014లో తెలంగాణకి రూ.60వేల కోట్ల అప్పులు ఉండగా, ఇప్పుడు రూ.3లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రాలు చేసే అప్పులను నియంత్రించే బాధ్యత రాజ్యాంగం కేంద్రానికి ఇచ్చిందని, దానినే తాము అమలు చేస్తున్నామన్నారు. మెడికల్ కాలేజీలు లేని జిల్లాల పేర్లు అడిగినప్పుడు ఇవ్వకుండా ఇప్పుడు బాధపడితే ఏం లాభమని ప్రశ్నించారు. నో డేటా అవైలబుల్ గవర్నమెంట్ ఎవరిదో ఇప్పుడు ప్రజలకు అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. నంబర్లు, ప్రాజెక్టులు చూసుకొని భారాస నేతలు మాట్లాడాలన్నారు. కరీంనగర్, ఖమ్మంలో మెడికల్ కాలేజీలు ఉన్నా అవే జిల్లాల పేర్లు మళ్లీ మెడికల్ కాలేజీల కోసం పంపించారని.. అందుకే తిరస్కరించి పంపించినా కొత్త జిల్లాల పేర్లు ఇప్పటికీ పంపించలేదని నిర్మలా సీతారామన్ తెలిపారు.

## ఆడిట్ చేయించడం లేదు.. అవన్నీ అవాస్తవాలే

### అదానీ గ్రూప్ వివరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: హిండెన్ బర్గ్ రీసెర్చి ఇచ్చిన నివేదిక నేపథ్యంలో తమ సంస్థలను ఆడిట్ సంస్థతో ఆడిటింగ్ నిర్వహించేందుకు అదానీ గ్రూప్ నిర్ణయించిందంటూ వచ్చిన వార్తలను ఆ సంస్థ ఖండించింది. మీడియాలో వస్తున్న ఆ వార్తలన్నీ అవాస్తవమని పేర్కొంది. తాము ఎలాంటి ఆడిట్ సంస్థనూ నియమించుకోలేదని, అదంతా మర్కెట్ రూమర్ అని పేర్కొంది. ఈ మేరకు బీఎస్ఈకి ఇచ్చిన ఫైలింగ్‌లో పేర్కొంది. ఎప్పటిలానే సెబీతో పూర్తి వివరాలు పంచుకుంటామని తెలిపింది. అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలను దీటుగా ఎదుర్కొనేందుకు అదానీ గ్రూప్ ఆడిట్ మార్గాన్ని చేపట్టిందంటూ వార్తలు వచ్చాయి. గ్రూప్‌లోని కొన్ని కంపెనీలపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించేందుకు అకౌంటెన్సీ సంస్థ గ్రాంట్ థార్టన్‌ను నియమించిందన్నది ఆ వార్తల సారాంశం. గ్రూప్ అన్ని చట్టాలను పాటిస్తోందని, ఏ విషయాలనూ దాచిపెట్టలేదని ఆర్బీఐ వంటి నియంత్రణ సంస్థలకు నిరూపించడమే దీని ఉద్దేశమని వార్తలు వెలువడ్డాయి. ఈ వార్తలను అదానీ గ్రూప్ ఖండించింది. మరోవైపు అదానీ గ్రూప్ స్టాక్స్‌లో బుధవారం మిక్స్‌డ్ ట్రెండ్ కనిపిస్తోంది. అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్, అదానీ ట్రాన్స్‌మిషన్ నష్టాల్లో కొనసాగుతుండగా.. మిగిలిన షేర్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

# అల్ ఖైదా చీఫ్‌గా ఒసామా అనుచరుడు..

### యూఎన్ భద్రతా మండలి వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: అల్ ఖైదా చీఫ్‌గా సైఫ్ అల్ అదెల్ నియమితులయ్యారు. ప్రస్తుతం అదిల్ అల్ ఖైదాను ఇరాన్ నుంచి నడిపిస్తున్నట్లుగా తెలుస్తున్నది. ఈ విషయాన్ని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి విడుదల చేసిన ఒక నివేదికలో వెల్లడించింది. అమెరికా దాడుల్లో ఐమాన్ అల్ జవహరి మరణించిన తర్వాత సైఫ్ అల్ అదెల్ అల్ ఖైదా చీఫ్‌గా ఎన్నికైనట్లు తెలుస్తున్నది. తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆఫ్ఘనిస్థాన్ రాజకీయాలలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో అల్ ఖైదా ప్రస్తుతం సైఫ్ నియామకానికి సంబంధించి ఎలాంటి ప్రకటన చేయలేదు. సైఫ్ అల్ అదెల్ తలపై అమెరికా రూ.82 కోట్ల రివార్డ్ పెట్టినట్లుగా సమాచారం. ఆఫ్ఘనిస్తాన్‌లో 2021లో అధికారంలోకి వచ్చిన తర్వాత తాలిబన్లు అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని నివేదిక పేర్కొన్నది. దాని కారణంగా వారు అమెరికాతో ఒక ఒప్పందంపై సంతకం చేసారని, దానిలో ఏ ఉగ్రవాద సంస్థను వారి భూమి నుంచి కార్యకలాపాలు కొనసాగించేందుకు అనుమతించనని ఒప్పందంలో రాసుకున్నారు. ఈ పరిస్థితుల్లో అల్ ఖైదా కొత్త చీఫ్గా సైఫ్ అల్ అదెల్ను ప్రకటిస్తే అది తమకు కష్టాలను తీసుకొస్తుందని తాలిబాన్ భావించింది. సైఫ్ అల్ అదెల్ పేలుళ్ల నిపుణుడుగా పేరుపొందారు. అదెల్ చాలా కాలంగా ఇరాన్‌లో నివసిస్తున్నందున, దాని చీఫ్‌గా నియమితులవడం పట్ల అల్ ఖైదా చాలా రోజులపాటు మౌనంగా ఉన్నదని యూఎన్‌కు చెందిన చాలా మంది



సభ్యులు విశ్వసిస్తున్నారు. ఇరాన్ షియా మెజారిటీ దేశమని, ఆ దేశం అధికారం షియా మతాధికారుల చేతుల్లో ఉంటుండగా.. అల్ ఖైదా సున్నీ ఉగ్రవాద సంస్థ అని వారు గుర్తుచేస్తున్నారు. సైఫ్ అల్‌అదెల్ అసలు పేరు మొహమ్మద్ సలా అల్-దిన్ జైదాన్. 1960 ప్రారంభంలో ఈజిప్టులో జన్మించిన సైఫ్.. అల్ ఖైదాలో చేరిన తర్వాత తన పేరును అల్ అదెల్‌గా మార్చుకున్నాడు. సైఫ్ అల్ అదెల్ ఈజిప్టు సైన్యంలో కల్నల్‌గా పనిచేశారు. 1988లో ఈజిప్టు అధ్యక్షుడు అన్వర్ అల్-సదాత్ హత్య అనంతరం సోవియట్ దళాలను తరిమికొట్టేందుకు ఆఫ్ఘన్‌లోని ముజాహిదీన్‌లో చేరడానికి అతను ఈజిప్టును వదిలి లెబనాన్ వెళ్లినట్లు తెలుస్తున్నది. ఖార్టూమ్‌లోని ఖాళీ పొలాల్లో పేలుడు పదార్థాలను తయారు చేయడం, ఉపయోగించడం కోసం ఉగ్రవాదులకు శిక్షణ శిబిరాలను సైఫ్ నిర్వహించారని సమాచారం.

## ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు.. నిందితుల బెయిల్ పిటిషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ఢిల్లీ మద్యం కుంభకోణం మనీలాండరింగ్ వ్యవహారంలో నిందితుల బెయిల్ పిటిషన్లను రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న సమీర్ మహేంద్రు, శరత్ చంద్రారెడ్డి, అభిషేక్ బోయినపల్లి, బినోయ్ బాబు, విజయ్ నాయర్లు దాఖలు చేసిన బెయిల్ పిటిష్న న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతుందని, బెయిల్ ఇవ్వొద్దని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ వాదనలు వినిపించింది. తాజాగా సౌత్ గ్రూప్ నుంచి మాగుంట రాఘవ, గోరంట్ల బుచ్చిబాబును అరెస్టు చేశామని.. వీరిచ్చిన సమాచారం ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నామని ఈడీ వివరించింది. నిందితులకు బెయిల్ ఇస్తే ఇతర సాక్షులను, దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉందని బెయిల్ ఇవ్వొద్దని ఈడీ కోరింది. ఈడీ విజ్ఞప్తి మేరకు నిందితుల బెయిల్ పిటిన్లను కోర్టు తిరస్కరించింది.

## రష్యాకు పట్టిన గతే చైనాకు..

(మొదటిపేజీ తరువాయి)

చైనా పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. 51 ఏళ్ల నిక్కీ హెలీ సౌత్ కరోలినాకు రెండు సార్లు గవర్నర్ గా పనిచేశారు. ఇటీవల చైనా స్పై బెలూన్ వివాదంలో అమెరికా, చైనాల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న తరుణంలో నిక్కీ హెలీ చైనాను నేరుగా హెచ్చరించారు. సౌత్ కరోలినాలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో తన మద్దతుదారులను ఉద్దేశించి హేలీ చైనాను దుయ్యబట్టారు. అమెరికా సైన్యం గతంలో కన్నా చాలా బలంగా ఉందని.. మరింత సామర్థ్యాన్ని పెంచుకుందని ఆమె అన్నారు. బలమైన సైన్యం యుద్ధాలను ప్రారంభించదని.. యుద్ధాలను నిరోధిస్తోందని ఆమె వెల్లడించారు. మేము మా స్నేహితులు ఇజ్రాయిల్, ఉక్రెయిన్ తరుపున నిలబడటంతో పాటు శత్రువులు ఇరాన్, రష్యాలను నిలువరిస్తాం అని అన్నారు. సోవియట్ యూనియన్ లాగే చైనా చరిత్ర కూడా ముగుస్తుందని హెచ్చరించారు. ఇదిలా ఉంటే జో బైడెన్ లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు నిక్కీ హెలీ. 20వ శతాబ్ధపు నాయకులను నమ్మితే 21 శతాబ్ధపు పోరాటంలో అమెరికా గెలవదని అన్నారు.

## నీటి భద్రత ఆందోళనకర అంశం

(మొదటిపేజీ తరువాయి)

శిరోహి జిల్లాలో బ్రహ్మ కుమారీలు, కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ సంయుక్తగా చేపట్టిన 'జల్ జన్ అభియాన్' జాతీయ స్థాయి క్యాంపెయిన్‌ను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూగర్భ జలవనరులు క్షీణిస్తుండటం దేశానికి అతి పెద్ద సవాల్‌గా పేర్కొన్న మోదీ.. నీటి సంరక్షణ విలువల పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలన్నారు. నీటి కాలుష్య సమస్యను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. నీటి కొరత అనేది భవిష్యత్‌ను సంక్షోభంలోకి నెడుతుందన్న ఆందోళనల నేపథ్యంలో నీటి సంరక్షణ ప్రాధాన్యాన్ని గుర్తు చేసేలా 'జల్ జన్ అభియాన్' కార్యక్రమాన్ని బ్రహ్మకుమారీలు చేపట్టడంపై ప్రధాని హర్షం వ్యక్తంచేశారు. 21వ శతాబ్దంలో భూమిపై ఉన్న పరిమిత వనరుల తీవ్రతను ప్రపంచం గుర్తించిందని.. అధిక జనాభా కలిగిన మనలాంటి దేశానికి నీటి భద్రత అనేది అతిపెద్ద సవాల్‌గా మారుతోందన్నారు.

**నీరు ఉంటేనే.. రేపు అనేది ఉంటుంది**

ఈ అమృత్ కాల్‌లో మన దేశం నీటినే భవిష్యత్తుగా చూస్తోందని ప్రధాని అన్నారు. నీరు ఉంటేనే రేపు అనేది ఉంటుందన్నారు. అందువల్ల నీటి సంరక్షణకు నేటి నుంచే ఉమ్మడిగా కృషిచేయాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా గుర్తుచేశారు. నీటి సంరక్షణ కోసం ఇప్పటికే జరుగుతున్న ప్రయత్నాలపై సంతృప్తి వ్యక్తం చేసిన మోదీ.. తాజాగా బ్రహ్మకుమారీలు చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజల భాగస్వామ్యంతో ఈ ప్రయత్నానికి మరింత బలం చేకూరుతుందన్నారు. నీటి సంరక్షణ సామాజిక సంస్కృతి అని.. అదే మన సామాజిక ఆలోచనలకు కేంద్రంగా ఉందన్నారు. అందుకే, మనం నీటిని భగవంతుడిగా, నదులను తల్లిగా భావిస్తామని గుర్తు చేశారు. జలవనరులను కాపాడుకొనేందుకు గతంలోని చైతన్యాన్ని పునరుజ్జీవింపజేస్తూనే భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లకు పరిష్కారాలు వెతకాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. నీటి సంరక్షణ విలువ పట్ల దేశ ప్రజలకు విశ్వాసం కలిగించాలని.. అలాగే, నీటి కాలుష్యానికి కారణమయ్యే అడ్డంకులను తొలగించాలని సూచించారు. జల సంరక్షణలో బ్రహ్మకుమారీలు వంటి భారతదేశ ఆధ్యాత్మిక సంస్థల పాత్రను ప్రశంసించారు. నమామి గంగా క్యాంపెయిన్ అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని మోదీ గుర్తుచేశారు.

## తెలంగాణ మాదిరి పంజాబ్‌లోనూ కొత్త జల విధానం

(మొదటిపేజీ తరువాయి)

చేసిన మీడియా సమావేశంలో భగవంత్ మాన్ మాట్లాడుతూ.. ''రైతులతో మాట్లాడటం చాలా సంతోషంగా ఉంది. ఢిల్లీలో చూసి ఇక్కడ బస్తీ దవాఖానా ప్రారంభించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఢిల్లీ వెళ్లి విద్యా వ్యవస్థ గురించి తెలుసుకుని అదే తరహాలో తమ రాష్ట్రంలో రూపొందించారు. వినూత్నంగా ఆలోచించి మంచి వ్యవస్థను తీసుకురావడమే నాయకుడి పని. పంజాబ్లో వ్యవసాయ వ్యవస్థ 1947 కంటే ముందుదే ఉంది. దీనిలో మార్పులు చేసి కొత్త వ్యవస్థను తీసుకురావాలి. మా రాష్ట్రంలో చాలా పెద్ద డ్యాములు ఉన్నాయి. కానీ చెరువులు లేక సమస్యగా ఉంది. అక్కడ గ్రౌండ్ వాటర్ తక్కువ కాబట్టి నూతన ఒరవడి కోసం ప్రయత్నిస్తున్నాం. పంజాబ్లోని కొన్ని ప్రాంతాల్లో నీళ్ల లేక నాసా వాటిని రెడ్ జోన్గా ప్రకటించింది. రానున్న కాలానికి నీళ్ల అవసరం ఎక్కువ ఉన్నందున నీటి సేకరణ కోసం చర్యలు చేపడుతున్నాం. మంచి మనసున్న నాయకుడు ఉంటే ఆ ప్రాంతం ఎల్లప్పుడూ అభివృద్ధిలో దూసుకుపోతుంది. అరవింద్ కేజ్రీవాల్ సీఎం అయ్యాక దిల్లీ అన్ని విషయాల్లో అభివృద్ధి చెందింది. ఉచిత కరెంట్, విద్యా వ్యవస్థ, బస్తీ దవాఖానాలు ఏర్పాటయ్యాయి. రానున్న రోజుల్లో పంజాబ్ను రంగీలా పంజాబ్గా తిరిగి తీసుకొస్తాం'' అని భగవంత్ మాన్ అన్నారు.

## డేటా సెంటర్లకు హైదరాబాద్ అనుకూలం..

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో అంతర్జాతీయ డేటా రాయబార కార్యాలయాలను ఏర్పాటు చేయడం వల్ల భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. మరొక దేశంతో సరిహద్దు పంచుకొనే రాష్ట్రంలో నిర్మిస్తే భద్రతాపరంగానూ ముప్పు ఉంటుందని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. డేటా సెంటర్లకు హైదరాబాద్ ఆదర్శవంతమైన నగరమని, గ్లోబల్ డేటా సెంటర్ మేజర్లు తమ భారీ డేటా సెంటర్ల ఏర్పాటులో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారన్నారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ నుంచి మైక్రోసాఫ్ట్ అజూర్ వరకు రాష్ట్రం అనేక హైపర్ స్కేల్, ఎడ్జ్ డేటా సెంటర్లకు నిలయంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం 2016లో డేటా సెంటర్ పాలసీని తీసుకువచ్చిందని తెలిపారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు రాష్ట్రం అనువుగా ఉంటుందని తెలిపారు. ఈ మేరకు బడ్జెట్ ప్రతిపాదనలను సవరించాలని కేంద్రమంత్రిని కోరారు.

## మే నెలాఖరు వరకు కంటి వెలుగు

(మొదటిపేజీ తరువాయి)

కేటాయింపు, హరితహారం తదితర అంశాలపై గురువారం కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి, బీఆర్కే భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ వేసవి ఎండలు తీవ్రమవుతున్నాయని, కంటి వెలుగు శిబిరాల వద్ద మంచినీటి సరఫరా, నీడ కల్పించేందుకు టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పోడు భూములకు సంబంధించి యాజమాన్య పట్టాలను అందించేందుకు జిల్లాస్థాయి కమిటీలో ఆమోదం పొందిన వాటికి పాస్ పుస్తకాల తయారీ చేపట్టాలన్నారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా 2023 -24 సంవత్సరంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు వెంటనే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వులు 58 , 59 , 76 , 118 కింద లబ్ధిదారుల ఎంపిక పూర్తయిన వారికి రిజిస్ట్రేషన్లు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. జిల్లాలో పూర్తయిన సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల్లోకి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను తరలించే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. వీసీలో వీడియో కాన్ఫరెన్స్లో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వి, పీసీసీఎఫ్ డోబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

## వందేళ్ల భావితరానికి సరిపడేలా మానేరు రివర్ ఫ్రంట్

**- మంత్రి గంగుల కమలాకర్**

**- డైనమిక్ లైటింగ్ సిస్టమ్ ప్రారంభం**



కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): యావత్ ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించేలా అత్యాధునిక హంగులతో వందేళ్ల భావితరానికి సరిపడేలా మానేరు రివర్ ఫ్రంట్ నిలువనుందని రాష్ట్ర బిసి సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం మానకొండూర్ శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్, నగర మేయర్ ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి వంతెనపై 6.5 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న డైనమిక్ లైటింగ్ సిస్టం పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మానేరు వంతెన నిర్మాణ పనులు ఒకవైపు పూర్తిచేసుకోవడం జరిగిందని, మరోవైపు కూడా త్వరలోనే పూర్తిచేసుకొని రోడ్డుపనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మానేరు వంతెనను మరింత అందంగా తీర్చిదిద్దే క్రమంలో వంతెనపై డైనమిక్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయనున్నట్లు, వీటితో పాటుగా అల్గునూర్ బ్రిడ్జి పై నిలబడి చూసిన స్పష్టంగా కనిపించేలా జర్మన్ టెక్నాలజీతో 45 వేల పిక్సల్ తో 1030 సైజులో కనిపించేలా మానేరు వంతెనకు ఇరువైపుల రెండుచొప్పున 4 టివీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా అడ్వర్టైజ్ మెంట్ మొదలగు చిత్రాలను ప్రదర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే పలు పారిశ్రామిక రంగాల దృష్టిని సైతం ఆకర్షించడంతో హోటల్ మొదలగు వాటి ఏర్పాటు పలువురు ముందుకువస్తున్నారని తెలిపారు. వీటి పనుల పూర్తిని బట్టి జూన్ 2వ తేదీన గాని, ఆగష్టు 15 న గానిప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మానేరు వంతెన ఒకవైపు ఇప్పటికే పూర్తయిందని, మరో వైపు కూడా పూర్తి చేసుకొని వాహనాల రాకపోకలను ఉగాది నుండి ప్రారంభించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇదివరకే అనుకున్నట్లుగా అప్పర్ , లోయర్ ప్రామినెడ్ పనులను కూడా పూర్తిచేసుకొని ప్రపంచంలో 3వ అతిపెద్ద ఫౌంటెన్ పనులకు 60 కోట్ల రూపాయలు మంజూరై టెండర్లు పూర్తయినట్లు మరో నాలుగు రోజుల్లో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇలాంటి వాటర్ ఫౌంటెన్ లు యావత్ ప్రపంచంలోనే మూడు దేశాల్లో మాత్రమే ఉన్నాయని, చైనా, సౌత్ కొరియాలోని సియోల్ తరువాత కరీంనగర్ లోనే ఈ వాటర్ ఫౌంటెన్ ఉండనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్వి.కర్ణన్, మానకొండూర్ శాసన సభ్యులు రసమయి బాలకిషన్, మేయర్ వై.సునీల్ రావు, డిప్యూటి మేయర్ చల్ల స్వరూపరాణి, కరీంనగర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, ఆర్డిఓ ఆనంద్ కుమార్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, ఆర్అండ్ బి ఇఇ సాంబశివరావు, డిఈ రవీందర్, ఎఈ రాజశేఖర్, అశోక్, కాంట్రాక్టర్ కమాలుద్దీన్ ఇతర అధికారులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతోన్న పోలీసు అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు



కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): పోలీసు ఉద్యోగ అభ్యర్థులకు కొనసాగుతోన్న దేహదారుఢ్య పరీక్షల్లో భాగంగా రెండవవ రోజైన గురువారం మహిళా అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన పరీక్షలకు 1163 మందికి గాను 903 మంది హాజరు కాగా, 186 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా 493మంది అర్హతసాధించగా,410 మంది అర్హత సాధించలేకపోయారు. 74మంది అభ్యర్థులు అనారోగ్యం, ఇతర కారణాలను చూపుతూ ధృవీకరణపత్రాలు సమర్పించారు. ధృవ పత్రాల పరిశీలన అనంతరం సదరు అభ్యర్థులకు ఇతర తేదీల్లో హాజర య్యేందుకు అధికారులు అనుమతించారు. తొలుత అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన, బయోమెట్రిక్, రిజిస్ట్రేషన్, రిస్ట్ బ్యాండ్ టాగింగ్, ఆర్ఎఫ్ఐడీ బిబ్ జాకెట్లను ధరింపజేశారు. 800 మీటర్ల పరుగులో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలతో పాటు లాంగ్ జంప్, షాట్ పుట్ విభాగాల్లో పరీక్షలను నిర్వహించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి కన్నా ముందే పరీక్షలు జరుగుతున్న కేంద్రానికి వచ్చి క్యూలో ఉండాలని పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు సూచించారు. అడిషనల్ డిసిపి జి.చంద్రమోహన్, ఏసిపిలు వెంకటరెడ్డి, కాశయ్య, ప్రతాప్, ఎస్బిఐ జి.వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మునిరత్నం, సూపరింటెండెంట్ ఎవిఎన్.చారి, ఇన్స్పెక్టర్లు మాధవి, బి.సంతోష్ కుమార్, సృజన్ రెడ్డి, రవీందర్, ఆర్ఐలు జానిమియా, సురేష్, రమేష్, మురళి, మల్లేశం లతో పాటుగా మినిస్టీరియల్ విభాగం అధికారులు, సిబ్బంది, పలువురు పోలీసు అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**మావనతా హృదయంతో స్పందించిన ఎసిపి ప్రతాప్**

గురువారం జరిగిన శారీరక సామర్థ్య, దేహదారుఢ్య పరీక్షలకు హాజరైన హుజురాబాద్కు చెందిన దంపతులు కొండ్రా అనూష సంపత్ కుమార్తె 6నెలల చిన్నారిని సిటిసి ఆవరణలో చెట్లకింద కూర్చుని వారి బంధువులు పట్టుకున్నారు. విధినిర్వహణలో ఉన్న ఏసిపి ప్రతాప్ అక్కడికి వెళ్ళి ఆచిన్నారిని ఎత్తుకుని లాలించారు. ఖాకీ యూనిఫారం ధరించిన పోలీసులు కఠినంగా ఉండరని, తాముకూడా ఈ సమాజంలోని సభ్యులమేనంటూ మానవతా హృదయంతో ఆ చిన్నారిని తీసుకుని ఎత్తుకుని లాలించారు. ఈ 'దృష్యాన్ని చూసిన పలువురు పోలీసు అధికారులు ఏసిపి ప్రతాప్‌ను అభినందించారు.

## దక్షిణ కాశీగా మేళ్లచెర్వు శివలింగం ప్రసిద్ధి

- **18 నుంచి 22 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు**
- **శివరాత్రి జాతరకు హాజర్‌కానున్న మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి, సత్యవతిరాథోడ్**



మేళ్లచెర్వు, ఫిబ్రవరి 16, మనం న్యూస్: మండల కేంద్రంలోని శ్రీ స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి 22 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దక్షిణకాశీగా పేరుపొందిన శ్రీ ఇష్టకామే శ్వరీసమేత శ్రీ స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయం కాకతీయుల కాలం నుంచి నేటి వరకు కూడా అశేష భక్తుల పూజలందుకుంటూ భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పేరుపొందింది. ఇక్కడి శివలింగానికి ఎంతో ప్రత్యేకత ఉంది. దేవాలయం చుట్టూ పక్కల సుమారు 300 అడుగులకు పైగా తవ్విన నీరుపడని పరిస్థితుల్లో ఈ శివలింగంలో నీరు ఉండటం విశేషం. శాస్త్రవేత్తలకు అంతుచిక్కని విధంగా పంచభూత తత్వము గల ఈ శివలింగం తలభాగం వరకు జలముచే నిండి ఉంటుంది. ఈ శివలింగం నుంచి నీటిని ఎంత తీస్తే మళ్లీ అంతా జలం ఊరుతుంది. కానీ శివలింగం దాటి పైకి రాదు. ఇంకోక ప్రత్యేకత ఏమిటంటే ప్రతి పుష్కరానికి ఈ శివలింగం ఒక ఇంచు మందం పెరుగుతుందని పూజరులు చెపుతున్నారు. ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణ.. ఇక్కడి ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభూ శంభులింగేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు మహాశివరాత్రి జాతరలో ప్రధాన ఆకర్షణగా నిలిచేవి ఎత్తైన రంగురంగుల లైటింగ్ ప్రభలు, సాంస్కృతిక నృత్య కార్యక్రమాలే. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ పరిసరప్రాంతాల్లో రంగురంగుల విద్యుత్ లైట్లతో ప్రభలను పార్టీల వారీగా, కులాల వారీగా ఏర్పాటు చేసుకొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. అభివృద్ధి పనులకు శ్రీకారం.. మహా జాతర సందర్భంగా ఇటీవల మంత్రి కేటీఆర్ రూ.50 లక్షల నిధులు కేటాయించడంతో ఆలయంలో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. ఆలయ ముఖద్వారం వద్ద సిమెంట్ ఫ్లోరింగ్ పనులు, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసే విధంగా సీసీ రోడ్డు పనులు, ఆలయమంతటా రంగులు, దేవుని బొమ్మలు, భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా క్యూ లైన్ల ఏర్పాటు చేపట్టినట్లు ఆలయ ఈవో గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా జాతరకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందని సంబంధిత అధికా రులు అంచనాలు వేస్తున్నారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవా దాయ శాఖ, ఆలయ అభివృద్ధి కమిటీ, గ్రామ పంచాయ తీ, పోలీస్ అధికారులు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారిపై వాహనాల నిలుపుదల లేకుండా చర్యలు, పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు, దేవాలయ ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులు క్యూ పద్ధతిలో స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు, డ్యాన్స్ పోటీలు... జాతర సందర్భంగా మేళ్లచెర్వులో ఎడ్లపందేలు, కబడ్డి వంటి ఇతరత్రా క్రీడా పోటీలు నిర్వహిం చడం, సాంఘీక, పౌరాణిక, జానపద నాటికలు, డ్రామాలు వేయడం ఆనవాయితీ. మూడేళ్లుగా నామ మాత్రంగా వీటిని ఏర్పాటు చేశారు. ఈసారి మాత్రం స్థానికుల కోరిక నెరవేరుతుండటంతో ఇప్పటి వరకు స్తబ్ధంగా ఉన్న నిర్వాహకులు హుషారయ్యారు. వివిధ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రత్యేక ఆర్టీసీ బస్సు సౌకర్యాలు. మేళ్లచెర్వుజాతరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం కోదాడ,మిర్యాలగూడ,నల్లగొండ, జగ్గయ్యపేట డిపోల నుంచి కోదాడ, హుజూర్‌నగర్ మీదుగా మేళ్లచెర్వు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాట్లు చేస్తున్నారు.దీనికోసం ఇప్పటికే సంబంధిత డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

### ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను అధికారులు సకాలంలో

## పూర్తిచేసే దిశగా చర్యలు చేపట్టాలి

- **జిల్లాలో కంటి వెలుగు శిబిరాల నిర్వహణ పట్ల శ్రద్ధ వహించాలి**
- **జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి**





ఖమ్మం, ఫిబ్రవరి 16 (మనం బ్యూరో): ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను అధికారులు సకాలంలో పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి కంటి వెలుగు,రెండు పడక గదుల నిర్మాణాలు, పోడు భూములు, 58, 59, 76, 118 ప్రభుత్వ జి.ఓ. ల ప్రకారం చేయవలసిన క్రమబద్ధీకరణపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, జిల్లాలో కంటి వెలుగు శిబిరాల నిర్వహణ పట్ల శ్రద్ధ వహించాలని, రానున్న వేసవి దృష్టిలో ఉంచుకొని శిబిరాల వద్ద అవసరమైన చల్లని నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం వంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలకు కంటి వెలుగు ప్రిస్కిప్షన్ కళ్ళద్దాల పంపిణీ జరుగు తుందని, వాటిని సదరు లబ్దిదారులకు అందించిన తరువాత లబ్దిదారుని ఫోటో వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయాలని సూచించారు. రాష్ట్రంలో జీహెచ్ఎంసీ మినహాయించి పట్టణ ప్రాంతాలలో నిర్మించిన 42 వేల 430 రెండు పడక గదుల ఇండ్ల లబ్ధిదారుల కేటాయింపు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 6620 మాత్రమే జరిగిందని, ఫిబ్రవరి 26 నాటికి పెండింగ్ లో ఉన్న ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి చేసి వివరాలు ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలని సీఎస్ అన్నారు. ప్రభుత్వం అందించిన ఫ్రోఫార్మా 1 ప్రకారం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమాచారం త్వరితగతిన అందించాలని, అధికారులు వారి దగ్గర ఉన్న సమాచారం మేరకు నివేదిక తయారు చేయాలని సీఎస్ తెలిపారు. పోడు భూముల పట్టాల పంపిణీ ఫిబ్రవరి నెలాఖరు నుంచి చేపట్టాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని, ఆ మేరకు జిల్లా స్థాయి కమిటీ వద్ద పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు త్వరగా ఆమోదించాలని సీఎస్ సూచించారు. జిల్లాలో ఆమోదించిన దరఖాస్తుల్లో పట్టాదారు ఫోటో, ఇతర వివరాలు పోలిగాన్ చెక్ చేసి సరిగ్గా ఉన్న దరఖాస్తులు వెంటనే పట్టా పాస్ పుస్తకాల ముద్రణ పంపాలని సీఎస్ అన్నారు. తెలంగాణ కు హరితహారం క్రింద వచ్చే సంవత్సరం లో అవసరమైన మొక్కల పెంపకం నర్సరీలో పూర్తి చేయాలని సీఎస్ అన్నారు. జిల్లాలో మొక్కలు నాటే స్థలాల గుర్తింపు, రిజిస్ట్రేషన్ వంటి అంశాలు పక్కాగా జరిగేలా ప్రణాళిక సిద్ధం చేయాలని, వేసవి దృష్టిలో మొక్కల సంరక్షణ అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా జీఓ 58 ప్రకారం ఆమోదించిన దరఖాస్తుదారులు పట్టాలను స్థానిక మంత్రి, ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో పంపిణీ పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల ధృవీకరణ పూర్తి చేయాలని, ఫీల్ వెరిఫికేషన్ వంద శాతం పూర్తి కావాలని అన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, కంటి వెలుగు ప్రిస్కిప్షన్ కళ్ళద్దాల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. జీవో 59 క్రింద 301 మంది దరఖాస్తుదారులకు డిమాండ్ నోటీస్ ఇచ్చినట్లు, మిగిలిన వారికి వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నట్లు ఆయనఅన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు స్నేహాలత మొగిలి, ఎన్. మధుసూదన్, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, డిఆర్వో శిరీష, ఆర్డీవో లు రవీంద్ర నాథ్, సూర్యనారాయణ, డిఆర్డిఓ విద్యాచందన, డిఎం అండ్ హెచ్ఓ డా. బి. మాలతి, డిటిడబ్ల్యుఓ కృష్ణ నాయక్, ఎఫ్డీవోలు ప్రకాష్ రావు, మంజుల, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతర అభివృద్ధి పనులు పటిష్టంగా ఉండాలి...

**- జిల్లా కలెక్టర్ శశాంక**





కురవి, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): మహాశివరాత్రి జాతర ను పురస్కరించుకుని కురవి వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి చేపడుతున్న పనులు పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టర్ మహాశివరాత్రి పండుగ సందర్భంగా కురవి మండలకేంద్రంలో పర్యటించి వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధి జాతర పనులను సంబంధిత అధికారులతో సందర్శించి పరిశీలించారు. ముందుగా కలెక్టర్ రాక సందర్భంగా ఆలయ అధికారులు సంప్రదాయ సిద్ధంగా అర్చకులతో వేదమంత్రాలతో పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతూ స్వామివారి దర్శనం చేయించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అనించారు.అనంతరం ఆలయ అభివృద్ధికి చేపట్టినపనులను అధికారులను ఆడిగితెలుసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకూడదన్నారు. భక్తులు కు కావల్సిన టెంట్, త్రాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ దీపాలంకరణ ఆలయ ప్రాకారం అంతా నిపుణులు రప్పించి అలంకరించాలని, దేదీప్యమానంగా అలంకరించి ఆకర్షణీయమైన లైట్స్ తో ముస్తాబు చేయాలన్నారు.ఆలయం ప్రక్కనే ఉన్న కల్యాణ మండపం సందర్శించి పనులు పరిశీలించారు.జాతరలో మహిళలకు, చిన్నారులకు తోపులాటలు జరుగకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. మైక్ ఏర్పాట్లు అంతటా ఉండాలన్నారు.భక్తులు శివకళ్యాణం తోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించే ఎల్.ఈ.డి. స్క్రీన్స్ ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయ పరిసరాలలో ఏర్పాటు చేసిన పూజా సామాగ్రి విక్రయాల వర్తకులు సమన్వయంతో వ్యాపారాలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు వద్ద భక్తులకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు.కలెక్టర్ వెంట ఎంపిపి రవి నాయక్, ఎంపిటిసి చిన్నం భాస్కర్, ఆలయ చైర్మన్ రాము నాయక్, ఆర్డీఓ కొమరయ్య, ఆలయ కార్యనిర్వహనాధికారి సత్యనారాయణ, 9 వార్డు సభ్యులు నూతక్కి నరసింహారావు, సి.పి.ఓ. సుబ్బారావు, ఆర్.అండ్.బి.ఈఈ తానేశ్వర్, విద్యుత్ శాఖ ఎస్.ఈ. నరేష్, డి.ఆర్.డి.ఓ. సన్యాసయ్య, బి.సి.వెల్ఫేర్ స్వామి, తహసీల్దార్ ఇమ్మానియేల్ డి.ఎస్.పి.రమణ బాబు, సి.ఐ.రవికుమార్, ఎస్.ఐ. బానోతు రాము మరియు సెకండ్ ఎస్ఐ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

## మతాలకు అనుగుణంగా ప్రభుత్వమే పండుగలు నిర్వహిస్తుంది

**- ఆధ్యాత్మికతకు మించిన మంచి ఔషధం మరోటి లేదు**

**- ప్రతి ఒక్కరూ దైవ చింతనను కలిగి ఉండాలి**

**- దైవ భూమిగా మారుతున్న తెలంగాణ**

**- రూరల్ పరిధిలోని యండ్లపల్లి రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మంత్రి**



సూర్యాపేట, ఫిబ్రవరి 16, మనం ప్రతినిధి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసిఆర్ పాలనలో మతాలకు అనుగుణంగా పండుగలను ప్రభుత్వమే నిర్వహిస్తుండటం దేశంలో తెలంగాణ మినహ మరెక్కడ లేదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట మండలంలోని యండ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయ సమేత కొదండ రామాలయంలో అత్యంత వైభవోపేతంగా, శాస్త్రోత్కంగా, వేద మంత్రాలతో విగ్రహ ప్రతిష్టను చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... మనుసులోని భావాలను అభివ్యక్తికరించేందుకు ఆధ్యాత్మికతకి మించిందిలేదని అన్నారు. పూర్వం మన మనస్సుని మన ఆధీనంలో ఉంచుకునేందుకు, ఏకాగ్రతని పెంచుకునేందుకు దైవ ప్రార్ధనని ఒక సాధనంగా వాడేవారని పేర్కొన్నారు. దైవ చింతనతో ఉన్నప్పుడు మనకు తెలియకుండానే మనలోని భావాలు బయటకి వస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరు దైవ చింతనను కలిగి ఉండాలని కోరారు. ఎవరి మతాచారాలకు అనుగుణంగా వారు ఆధ్యాత్మిక చింతనతో ఉండాలన్నారు. సిఎం కేసిఆర్ ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్రం దైవ భూమిగా మారుతుందని, అన్ని మతాలకు సమన్యాయం ఒక్క తెలంగాణలోనే లభిస్తుందని కొనియాడారు. యండ్లపెల్లి గ్రామానికి వేలాదిగా ప్రజలు ఇక్కడికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టను చేసిన మంత్రి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వయంగా మంత్రి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రవీందర్రెడ్డి, జడ్పీటిసి జీడి బిక్షం, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గోన్నారు.

## కంటి వెలుగు అద్దాలు ఎవరివి వారికే అందే విధంగా చర్యలు తీసుకోవాలి

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి**



నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: కంటివెలుగు కార్యక్రమంలో గుర్తించిన ప్రెస్క్రిప్షన్ కంటి అద్దాలు ఎవరి అద్దాలు వారికే అందే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి సూచించారు. గురువారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కంటివెలుగు, డబుల్ బెడ్‌రూమ్, పోడు పట్టాలు, ఫ్రోఫార్మా-1, కంటి వెలుగుపోడు 58,59,76,118 జీవోల క్రింద క్రమబద్ధీకరణలు, తెలంగాణాకు హరితహారం పై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 2వ విడత కంటివేలుగు కార్యక్రమం విజయవంతంగా జరుగుతు న్నాయని, అన్ని జిల్లాలో బాగా జరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రెస్క్రిప్షన్ కంటి అద్దాలు ఆన్లైన్‌లో నమోదు చేసిన విధంగా తయారు చేసి ఆయా జిల్లాలకు పంపించే ప్రక్రియ ప్రారంభమైం దన్నారు. వచ్చిన కంటి అద్దాలు ఎవరి అద్దాలు వారికే ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ టీమ్ లు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ మౌళిక సదుపాయాల విషయంలో రాజీపడకుండా చూసుకోవాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి వారి వివరాలు కేంద్ర ప్రభుత్వ ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసి పోర్టల్ లో నమోదు చేసే ప్రక్రియ ఈ నెల 26 లోపు పూర్తి కావాలని సూచించారు. పోడు పట్టాల జారీ విషయంలో మాట్లాడుతూ అర్హులైన వారి పట్టా పాస్ బుక్ కొరకు అన్ని పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి పాస్ పుస్తకాల ముద్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే హరితహారం లో ఏ గ్రామ పంచాయతికి సంబంధించి ఆ గ్రామ పంచాయతీ నర్సరీల నుండి మొక్కలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో మొక్కలు బాగా పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు పొడవైనవి ఉండేవిధంగా చూడాలని ఈ సారి కడియం నుండి మొక్కలు కొనే పరిస్థితి ఉండకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కంటివేలుగు కార్యక్రమం విజయవంతంగానడుస్తున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 1,51,0 33 మందికి పరీక్షించడం జరిగిందని,17,957 మందికి దగ్గర చూపు అద్దాలనుఅందజేయడంజరిగిందని, ప్రెస్క్రిప్షన్ అద్దాలు జిల్లా కు 14,050 రావడంకంటే జరిగిందని ఇప్పటి వరకు మందికి ఎవరి దూరపు చూపు అద్దాలు వారికి ఇవ్వడం జరిగిందన్నారు. ప్రాఫార్మ-1 ప్రకారం మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లోని నాన్ అగ్రికల్చర్ ప్రాపర్టీ వివరాలు సేకరిం చడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆదనపు కలెక్టర్లు మను చౌదరి, మోతిలాల్, అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి, వైద్య అధికారి సుధాకర్‌లాల్, డిఆర్డిఓ నర్సింగరావు, జిల్లాగిరిజన సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, అసిస్టెంట్ డిటి డబ్ల్యూ కమలాకర్‌రెడ్డి, ఆర్డీవోలు నాగలక్ష్మి, రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు తమ ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయిలో మంచి ఫలితాలు తేవాలి

**- మహిళల జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభించిన జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్**



ఖమ్మం, ఫిబ్రవరి 16 (మనం బ్యూరో) : రాష్ట్ర క్రీడా సాధికారిక సంస్థ వారి ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల జిల్లా స్థాయి చెస్ పోటీలను గురువారం సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, నగర మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి ప్రారంభించారు. ఈ చెస్ పోటీలలో 150 మంది మహిళా చెస్ క్రీడా కారులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా కలెక్టర్, నగర మేయర్‌లు క్రీడాకారుల తో చెస్ ఆడి ప్రారంభించుట జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ ద్వారా క్రీడాకారులు తమ ప్రతిభను చాటి, రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ఫలితాలను తేవాలని తెలిపారు. భవిష్యత్తు లో మరిన్ని చెస్ టోర్నమెంట్లను నిర్వహించి పాఠశాల, కళాశాలల విద్యార్థులలో ప్రతిభ కలవారిని ప్రోత్సహించాలని ఆయన అన్నారు. మొదటి, రెండవ స్థానంలో గెలుపొందిన వారు నేడు (శుక్రవారం) రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపించటం జరుగుచున్నదని ఆయన తెలిపారు. కొత్తగా మునిసిపల్ కార్పోరేషన్ లో ఏర్పాటు చేసిన చెస్ పార్క్ ను క్రీడాకారులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్జిఎఫ్ కార్యదర్శి కె. నరసింహ రెడ్డి వారి వనిజ రెడ్డి జ్ఞాపకార్థం 60 టీ షర్టులను ప్రభుత్వ పాఠశాలల క్రీడాకారులకు జిల్లా కలెక్టర్, నగర మేయర్ లతో ఉచితంగా పంపిణీ చేశారు. స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ విద్యార్థులకు ఈ సందర్భంగా సర్టిఫికెట్ ల ప్రదానం చేశారు. ఈ చెస్ పోటీలలో మొదటి విన్నర్ గా జి. చరిష్మా, ఖమ్మం రూరల్, రెండవ విన్నర్ గా డి. దివ్య మధిర, మూడవ విన్నర్ గా పి. సేతు శ్రీవల్లి ఖమ్మం, నాలుగవ విన్నర్ గా కె. కీర్తన ఖమ్మం లు నిలిచారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జిల్లా విద్యాధికారి సోమ శేఖర్ శర్మ, డివైఎస్ఓ పరంధామ రెడ్డి, ఖమ్మం అర్బన్ ఎంఇఓ శ్రీనివాస్, చెస్ కోచ్ గోపి కృష్ణ , పిడి రఘునందన్ రావు, వాలీబాల్ కోచ్ ఎండి. అక్బర్ అలీ, బాస్కెట్ బాల్ కోచ్ కె. సైదులు, టెన్నిస్ కోచ్ కైలాష్, స్కెటింగ్ కోచ్ సురేష్, షటిల్ కోచ్ పవన్, టేబుల్ టెన్నిస్ కోచ్ మూర్తి, ప్రభుత్వ పాఠశాలల పిఇటిలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమం

బచ్చన్నపేట, ఫిబ్రవరి 16, మనం న్యూస్ : మండలంలోని ఇటుకాలపల్లి గ్రామంలో ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు బీజేపీ శ్రేణులు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు మాట్లాడుతూ స్థానికేతరుడైన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చేతిలో జనగామ జిల్లా ప్రజలు మోసపోయరన్నారు. రాబోయే ఎలక్షన్లలో జనగామ ఎమ్మెల్యేగా జనగామ బిడ్డని ఎన్నుకోవాలన్నారు. మద్యం మత్తులో విద్యకు ఉపాధికి ఉద్యోగాలకు దూరమవుతున్నారు తెలంగాణ యువకులు అని అన్నారు. బంగారు తెలంగాణలో బాగుపడ్డది ఐదుగురు కల్వకుంట్ల కుటుంబ సభ్యులు మాత్రమే అని అన్నారు. స్థానికేతరుడైన ఎమ్మెల్యే జనగామ భూములను దోచుకుంటున్నాడన్నారు. భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వంలో రైతులకు ప్రతి సంవత్సరం పిఎం కిసాన్ యోజన కింద 6 వేల రూపాయలతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలలో పంట నష్ట బీమాను అమలు పరుస్తుంటే తెలంగాణ రాష్ట్రంలో పంట నష్ట బీమా లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మద్దతు ధర ఇచ్చి ప్రతి గింజాను కొనుగోలు



చేస్తున్నది మోడీ ప్రభుత్వం అన్నారు. రాష్ట్రం మొత్తం మీద రెండు లక్షల ఇండ్ల నిర్మాణం కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం నిధులు ఇస్తే కెసిఆర్ దారి మళ్లించి ప్రజాదనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడు అన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఆయుష్మాన్ భారత్ కార్డు నుంచి ప్రతి పేద వ్యక్తికి ఐదు లక్షల రూపాయల ఆరోగ్య ఖర్చులకోసం తీసుకువచ్చిన సంక్షేమ పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా పేద ప్రజల ఉసురు పోసుకుంటున్నది బిఆర్ఎస్ అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, శక్తి కేంద్ర ఇంచార్జ్ ముక్కెర కరుణాకర్ రెడ్డి,



బూత్ అధ్యక్షులు రమేష్, మేక వెంకటేష్, మాజీ గ్రామ సర్పంచ్ కనకయ్య, కిషన్ మోర్చా మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు బంగారు మహేష్, బీజవరం ప్రధాన కార్యదర్శి గద్దరాజు, సీనియర్ నాయకులు చంద్ర రెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్ నాగయ్య, కార్యకర్తలు నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ



మల్హర్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: మండల కేంద్రం తాడిచర్ల గ్రామంలో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ మెగా జాబ్ మేళా పోస్టర్లను మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం నాడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.... పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, మంథని నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పుట్ట మధుకర్, భూపాలపల్లి జడ్పీ చైర్పర్సన్ జక్కు శ్రీ హర్షిని రాకేష్ ఆదేశాలతో మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించినట్లు తెలిపారు. మండలంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు వారి అర్హతల ప్రకారం అనేక ప్రముఖ కంపెనీలు నిర్వహించే జాబ్ మేళాలో పాల్గొని జీవితంలో స్థిరపడాలని కోరారు. అభ్యర్థుల అర్హతల ప్రకారం పది వేల నుండి లక్ష రూపాయల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీ ఆదివారం మంథని పట్టణంలోని గంగా రోడ్డులో ఉన్న ఎస్ఎల్బి ఫంక్షన్ హాల్ లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిరుద్యోగ యువతీ యువకులు తమ సర్టిఫికెట్లతో మెగా జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కుంభం రాఘవరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు గోనె శ్రీనివాస్ రావు, పిఎసిఎస్ చైర్మన్ మల్క ప్రకాష్ రావు, నాయకులు కోట రవి గౌడ్, వాల యాదగిరి రావు, బండి రాజయ్య, మధుసూదన్ రావు గారు, దేవర్నేని రాజేశ్వరరావు, మల్క రాజేశ్వర రావు, గుమ్మడి రవి తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తకు అండగా బీఆర్ఎస్



మల్హర్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: బీఆర్ఎస్ పార్టీ ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ సతీమణి, మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ అన్నారు. పార్టీ కార్యకర్త చనిపోతే రెండు లక్షల రూపాయల బీమా అందిస్తున్న ఏకైక పార్టీ దేశంలో బీఆర్ఎస్ ఒక్కటే అన్నారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని ఎడ్లపల్లి గ్రామ పరిధిలోని శభాష్ నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త తాళ్ల శ్రీమతి ప్రమాదవశాత్తు పాముకాటుతో మృతి చెందింది. టిఆర్ఎస్ పార్టీ సభ్యత ప్రమాద బీమా ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును తాళ్ల శ్రీమతి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు పుట్ట శైలజ అందించారు. ఈ సందర్భంగా పుట్ట శైలజ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, టిఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్చార్జి పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు కార్యకర్త కుటుంబానికి ప్రమాద బీమా చెక్కును అందించడం జరిగిందన్నారు. ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని పుట్ట శైలజ అన్నారు. చనిపోయిన కార్యకర్త కుటుంబానికి పార్టీ ఇన్సూరెన్స్ చెక్కు కొండంత భరోసా అన్నారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కుంభం రాఘవ రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షులు గోనె శ్రీనివాస రావు, మండల నాయకులు వాల యాదగిరిరావు, కోట రవి గౌడ్, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ అక్కినవేని సుమన్, ఎడ్లపల్లి ఉప సర్పంచ్ తోట రాజేశ్వర్ రావు, గ్రామ కమిటీ అధ్యక్షులు పంతకాని వెంకట్ రాజు, మధుసూదన్ రావు, నాయకులు అక్కినవేని సమ్మయ్య, రౌతు గంగమ్మ, మంథని పోచమ్మ, పంతకాని స్రవంతి, శివ సారయ్య, కుక్కల రాజబాబు, పుట్ట మధు యువసేన మండల అధ్యక్షులు పిల్లమరి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## చండికా అమ్మవారి ప్రతిష్ట మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే





శివనగర్, ఫిబ్రవరి 16, మనం న్యూస్ : మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆహ్వానం మేరకు పాలకుర్తిలో చండికా అమ్మవారి ప్రతిష్ట మెత్సవంకు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ గురువారం హజరై పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే తోపాటు అమ్మవారి ప్రతిష్ట మెత్సవంలో పాల్గొన్న వారిలో బీఆర్ఎస్ నాయకులు గందె నవీన్, పలువురు కార్యకర్తలు ఉన్నారు.

## మచ్చలేని చంద్రుడు మంత్రి ఎర్రబెల్లి దయన్నపై నిందలా?



- భు కబ్జా చేసినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తాం
- భూ కబ్జాలకు పాల్పడింది ఎవరో ప్రజలందరికీ తెలుసు
- మహబూబ్ నగర్ గ్రామస్తులు

రాయపర్తి, ఫిబ్రవరి 16, మనం న్యూస్: నియోజకవర్గ అభివద్దే లక్ష్యంగా పనిచేస్తున్న పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి, గ్రామీణ నీటి పారుదల శాఖ మాత్యులు ఎర్రబెల్లి దయాకర్ రావుపై నిందలు వేస్తే సహించేది లేదని రాయపర్తి మండలంలోని మహబూబ్ నగర్ గ్రామస్తులు పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి ని హెచ్చరించారు. మండలంలోని మహబూబ్ నగర్ గ్రామంలో గురువారం గ్రామస్తులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బుధవారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి హాత్ సే హాత్ జొడో పాదయాత్రలో భాగంగా ఎర్రబెల్లి దయన్న పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మాట్లాడారని మహబూబ్ నగర్ గ్రామంలో 80 ఎకరాల భూమిని మంత్రి ఎర్రబెల్లి కబ్జా చేసుకున్నాడని ఆరోపించారని ఆ ఆరోపణ నిజం కాదని అసలు తమ గ్రామంలో ఇలాంటి భూమి కబ్జాకు గురి కాలేదని, కబ్జా చేసినట్లు నిరూపిస్తే బహిరంగ విచారణ సిద్ధమని వారన్నారు నిరూపించకుంటే బహిరంగ చర్చకు వస్తారా అని ప్రశ్నించారు. ఓటమి ఎరుగని మంత్రి ఎర్రబెల్లి పై నిందలు వేస్తే సహించేది లేదని వారు అన్నారు. కబ్జాలకు ఆయన పాల్పడినట్టు నిరూపిస్తే మేము ముక్కు నేలకు రాస్తామని వారు సిద్ధమాని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు లక్కం సురేష్, గాదే రవీందర్ రెడ్డి, చిక్ కొండ వీరస్వామి, పెండ్లి కొమురెల్లి, పెళ్లి మల్లారెడ్డి, చేనబోయిన వెంకన్న, ఎర్ర యాకయ్య, చేనబోయిన రవి, ఎసి రెడ్డి రాజు, యార మల్లయ్య, గూడ రాజు, ఎలుక పెళ్లి బిరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన మహిళల దేహదారుఢ్య పరీక్షలు

వరంగల్, ఫిబ్రవరి 16, మనం న్యూస్ : స్టయిఫండరి పోలీస్ కానిస్టేబుల్ సబ్ ఇన్స్పెక్టర్ల నియామకంలో భాగంగా గురువారం నుండి మహిళా అభ్యర్థునులకు దేహ దారుడ్య పరీక్షలు ప్రారంభమయినాయి. కాకతీయ విశ్వ విద్యాలయం మైదానంలో గురువారం మహిళలకు నిర్వహించిన హేదారుడ్య పరీక్షలకు 1159 అభ్యర్థునులకుగాను 839 మంది అభ్యర్థునులు హాజరుకాగా ఇందులో 491 మంది మహిళ అభ్యర్థునులు తుది పరీక్షకు అర్హత సాధించారు. ఈ దేహాదారుద్య పరీక్షలను వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవి రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసారు. ఈ సందర్భంగా పోలీస్



కమిషనర్ మాట్లాడుతూ ఈ దేహదారుడ్య పరీక్షలు పూర్తిగా పారదర్శకంగా నిర్వహించ బడుతున్నాయని దళారీల మాట నమ్మవద్దని



తెలియజేసారు. ఈ కార్యక్రమంలో క్రైమ్స్ డిసిపిడి మురళీధర్, అదనపు డిసిపి సురేష్, సంజీవ్ తో పాటు ఏసిపి లు, ఇన్స్పెక్టర్ లు, కమ్యూనికేషన్, ఐటీ, మెడికల్ విభాగం కు చెందిన అధికారులు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మెట్టుగుట్టపై వైభవంగా 'మహాశివరాత్రి' ఉత్సవాల ప్రారంభోత్సవం



కాజీపేట, ఫిబ్రవరి 16, మనం న్యూస్ : దక్షిన కాశీగా ప్రసిద్ది గాంచిన మెట్టుగుట్టపై మెట్టు రామలింగేశ్వర స్వామి, సీతారామచంద్ర స్వామి దేవస్థానములలో 16 వ తేదీ నుండి 24 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు మొదటి రోజైన గురువారం దేవాలయ కార్యనిర్వాహణాధికారి శేషు భారతి, చైర్మన్ దువ్వ నవీన్ ఆధ్వర్యంలో అంత్యంత వైభవంగా ప్రారంభమైనవి. ఉదయం 6 గంటల నుండి స్వామి వారి మేల్కొలుపు, సుప్రభాతం, స్వామివారికి ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం అనంతరం 9 గంటలకు ఉత్సవ ఆరంభం, గణపతి పూజ, శైవ శుద్ధి, మహా పున్యాహవచనం, పంచగవ్యం, అఖండ దీపారాధన, ఋత్విక్ వరునము, దీక్షా ధారణ, అస్త్ర రాజర్చన, త్రిశూల పూజ, ప్రధాన కలశ స్థాపన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణ, గణపతి మెం, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు బుర్ర సంధ్యారాణి, నార్లగిరి కుమారస్వామి, చింతకుంట్ల భూపాల్ రెడ్డి, ఓర్సు రాజు, పెద్ది ప్రభాకర్, సిబ్బంది, మడికొండ గీత కార్మిక సహకార సంఘం అధ్యక్షులు బుర్ర రాజన్ బాబు, అల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు.....

17వ తేది శుక్రవారం ఉదయం 9 గంటలకు గవ్యాంత పూజలు, మంటపార్చనలు, వాస్తు పూజ, వాస్తు మెం, వాస్తు బలి, నిత్య బలిహరణ కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటలకి రుద్రెమం, మూలమంత్ర మెం, ప్రదోషకాల పూజ, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరుగునని కార్యనిర్రాణాధికారి శేషు భారతి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని భక్తులను ఆమె కోరారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సభ



మహదేవపూర్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: మహదేవపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాణిబాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరై పలు సమస్యలపై సభలో పలు శాఖలకు సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా అన్నారం ఎంపీటీసీ మంచినీళ్ళ దుర్గయ్య మాట్లాడుతూ అన్నారం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేనందున ప్రజల అవసరాలకు మండలానికి రావాలంటే చాలా ఇబ్బంది ఏర్పడుతుందని, అంబటిపల్లి నుండి వయా మహదేవ పూర్ మీదుగా అన్నారంకు బస్సు సౌకర్యం కల్పించాలని అలాగే భూపాల్ పల్లి నుండి వయా కాటారం గుండ్రాత్ పల్లి అన్నారం నుండి మద్దులపల్లి పలుగుల కాళేశ్వరం వరకు మరొక బస్సు సౌకర్యం కల్పించాలని మండల సభలో తెలిపినారు .అనంతరం రాబోయే సీనరేజీ నిధులలో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని మండల సభలో తీర్మానం చేసినట్లు తెలిపినారు .ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణి భాయి ఎంపీడీవో శంకర్. సింగిల్ విండో చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి .జడ్పీటీసీ గుడాల అరుణ. సిడిపిఓ అయితరాధిక. వ్యవసాయ అధికారి ప్రభావతి పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్ సాయిలు. ఏఈ రవీందర్. ఎంపీ ఓ ప్రసాద్. ఎంపీటీసీలు మంచినీళ్లు దుర్గయ్య. ఆకుతోట సుధాకర్ . ఎంపీటీసీ చల్ల రమాదేవి. వైస్ ఎంపీపీ బండం పుష్పలత .రేవెల్లి మమత . ఎంపీటీసీలు. సర్పంచులు. పలు శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు కాలువలో పడి యువకుడి మృతి



స్టేషన్ఘన్పూర్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం ఒడ్డెగూడెం గ్రామానికి చెందిన బానోతు శ్రీను తన గ్రామస్తులతో కలిసి చాగల్లు గ్రామానికి వ్యవసాయ పనుల నిమిత్తం వచ్చినారు. బుధవారం సాయంత్రం బానోతు శ్రీను చాగల్లు గ్రామ సమీపంలోని దేవాదుల కెనాల్ వైపు కాలకత్యాలకు వెళ్ళగా ప్రమాదవ శాత్తు కెనాల్ లో జారీ పడిపోయినాడు. చుట్టుపక్కల వారు చూసి వెతికినా కూడా దొరకలేదు. ఈరోజు ఉదయం గ్రామస్తుల సహాయంతో వెతకగా మతదేహం కెనాల్లో దొరికింది. మతుడి బావ కుర్ర అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు స్టేషన్ఘన్పూర్ ఇన్స్పెక్టర్ ఏ.రాఘవేందర్ తెలిపారు.

## కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అరూరి



హాసన్పర్తి, ఫిబ్రవరి 16, మనం న్యూస్ : రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా హసనపర్తి పట్టణ కేంద్రంలో కంటి వెలుగు కేంద్రాన్ని బిఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ గురువారం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే కంటి సమస్యలతో వచ్చిన వద్దులను ఆప్యాయంగా పలకరించి, ఆసుపత్రి సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లా

## ఆర్టీసీ బస్సు, బొగ్గు టిప్పర్ ఢీ పలుగురికి గాయాలు

- తప్పిన పెను ప్రమాదం



కాటారం, ఫిబ్రవరి 16, మనం న్యూస్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలోని గారేపల్లి టౌన్లో గురువారం ఆర్టిసి బస్సు, టిప్పర్ ఢీకొని పలువురికి గాయాలయ్యాయి.ప్రమాదం తీవ్రంగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చర్చించుకున్నారు.కాటారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థుల ఆకలి తీర్చేందుకే ఉచిత భోజనం

- మంథని మున్సిపల్ చైర్పర్సన్ పుట్ట శైలజ



కాటారం, ఫిబ్రవరి 16, మనం న్యూస్: పేద కుటుంబాలకు చెందిన విద్యార్థిని,విద్యార్థుల ఆకలి తీర్చేందుకే పుట్ట లింగమ్మ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలలో ఉచిత భోజన సౌకర్యం కల్పించినట్లు మంథని మున్సిపల్ చైర్పర్సన్ పుట్టే శైలజ పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలోని ప్రభుత్వ ఐటిఐ,జూనియర్ కళాశాలల్లో పుట్ట లింగమ్మ ట్రస్టు ద్వారా పెడుతున్న ఉచిత మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమంలో గురువారం మంథని మాజీ ఎమ్మెల్యే,పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు భార్య, మంథని మున్సిపల్ చైర్పర్సన్ పుట్ట శైలజ పాల్గొని విద్యార్థులతో మాట్లాడి భోజనం వడ్డించారు. అనంతరం విద్యార్థులతో భోజనం చేసిన్ శైలజ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నతంగా,ఆర్థికంగా ఎదగాలంటే విద్య ఒక్కటే మార్గమని,కష్టపడి ఇష్టంతో చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి కుటుంబానికి, సమాజానికి తోడ్పాటు అందించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజిక వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పుట్ట లింగమ్మ చారి ట్రబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత భోజనం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాలను వినియోగించుకుని ఉద్యోగులు సాధించే కుటుంబానికి భరోసా మీద నిలవాలని తోట శైలిగా విద్యార్థిని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు, ఎంపీటీసీ తోట జనార్ధన్, కాటారం సబ్ డివిజన్ యూత్ అధ్యక్షుడు,కాటారం ఉపసర్పంచి నాయిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జోడు శ్రీనివాస్,యూత్ అధ్యక్షుడు రామిల్ల కిరణ్,సోషల్ మీడియా ఇంఛార్జి వంగల రాజేంద్రచారి, నియోజక వర్గ మహిళ ప్రధాన కార్యదర్శి రత్న సౌజన్య రెడ్డి, సీనియర్ నాయకురాలు శ్రీలక్ష్మి చౌదరి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పంతకాని సడవలి,మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండగొర్ల వెంకటస్వామి, పార్టీ ఉపాధ్యక్షులు గాలి సడవలి నాయకులు ధుర్కి కుమార్, బాలరాజు, మంథని పట్టణ మహిళ అధ్యక్షురాలు బుద్ధర్తి రాణి పాల్గొన్నారు.

## పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షణ



మహాముత్తారం, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): మహాముత్తారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి , జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆదేశాల మేరకు పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నాడు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస శిక్షకులు బోయిని శ్రావణ్ కుమార్ విద్యార్థులకు పరీక్షలకు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యేందుకు మెలుకువలు నేర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి భయం లేకుండా పరీక్షలకు హాజరు కావాలంటూ అవగాహన కల్పించారు. ఇంటర్, డిగ్రీ తర్వాత తీసుకోవాల్సిన భవిష్యత్తు కార్యచరణ పై భరోసా కల్పించే రీతిలో శిక్షణ ఇచ్చారు. కళాశాలలో నిరుపేద విద్యార్థులకు జడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆధ్వర్యంలో భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా మోటివేషన్ అండ్ పర్సనాలిటీ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కల్వచర్ల రాజు,రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మార్క రాము గౌడ్,యూత్ అధ్యక్షుడు జాటోత్ జైపాల్ నాయక్, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు బొబ్బిలి వెంకటయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గం పావని, ఉపాధ్యాయులు ధీరావత్ రాము, అబ్బోజు రాజేంద్రప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీ జెండా గద్దె కూల్చిన వారిని శిక్షించాలి

- బీజేపీ నాయకులు

మహాముత్తారం, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): గురువారం నాడు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా పార్టీ అధ్యక్షతన మాజీ ఎమ్మెల్యే చందుపట్ల రాంరెడ్డి, రాష్ట్ర నాయకులు చందుపట్ల సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో మహాముత్తారం మండల బూత్ కమిటీ రివ్యూ మీటింగ్ నిర్వహించారు.ఈ మీటింగ్ లో ఇటీవలే మినాజీపేట గ్రామంలో భారతీయ జనతా పార్టీ జెండా గద్దె కూల్చివేత పై మండిపడ్డారు.జిల్లా పార్టీ అధ్యక్షుడు నిందితులను వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని లేనిపక్షంలో జిల్లా పార్టీ నాయకత్వంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాముత్తారం మండల పార్టీ అధ్యక్షుడు పిలుమరి సంపత్, ప్రధాన కార్యదర్శి పూర్ణచందర్, నాయకులు శ్రీహర్ష, శ్రీకాంత్ పటేల్,సందీప్,లడ్డు,యువరాజు,ప్రశాంత్ భూత అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## రెండవ రోజు విజయవంతంగా పూర్తి అయిన మహిళా కానిస్టేబుల్, ఎస్ఐ దేహదారుఢ్య పరీక్షలు

- జిల్లా ఎస్పీ అపూర్వరావు
- 1012 మంది అభ్యర్థులకు 327 మంది అభ్యర్థులు అర్హత



నల్లగొండ, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి): నేడు జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియం నందు పోలీస్ కానిస్టేబుల్/యస్.ఐ దేహదారుఢ్య పరీక్షలను జిల్లా యస్.పి ఆద్వర్యంలో ప్రత్యేక అధికారి డాక్టర్ పి. శబరీష్ పర్యవేక్షణలో మొత్తం 1012 మంది అభ్యర్థులకు గాను, 797 అభ్యర్థులు హాజరు అయినారు, వీరిలో 327 మంది అభ్యర్థులు (ఫిజికల్ టెస్టు) దేహదారుఢ్య పరీక్షలలో ఉత్తీర్ణత సాధించారు. 215 మంది అభ్యర్థులు గైరాజరైనారని అన్నారు.

## చదరంగ పోటీలు మేధో సంపత్తిని పెంపొందించడానికి దోహదపడతాయి

- అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా



నల్లగొండ, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): చదరంగ పోటీలు మేధో సంపత్తిని పెంపొందించడానికి దోహదపడతాయని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ పుట్టినరోజు ను పురస్కరించుకొని జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఇండోర్ స్టేడియం లో నిర్వహించిన చదరంగం పోటీలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ క్రీడల్లో గెలుపొంది రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొని గెలుపొంది జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి ఎండి మక్బూల్ అహ్మద్, కరుణాకర్ రెడ్డి, జిల్లా సెస్ అసోసియేషన్ సెక్రటరీ కిరణ్ కుమార్, సూపర్డెంట్ తదితరులు పాల్గొన్నారు.

## మంథని బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా రాజు నియామకం

- నియామక పత్రాన్ని అందజేసిన శ్రీధర్‌బాబు



మంథని, ఫిబ్రవరి 16, మనం న్యూస్: మంథని మండలంలోని గుమ్మనూరు గ్రామానికి చెందిన వేల్పుల రాజును బ్లాక్ కాంగ్రెస్ మంథని అధికార ప్రతినిధిగా మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు నియమించినట్లు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాగోసపై ప్రజలకు బీజేపీ భరోసా



మునుగోడు, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): మునుగోడు పరిధిలోని లక్ష్మీదేవి గూడెంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బిజెపి పార్టీ నిర్వహిస్తున్న ప్రజా గోస పై ప్రజలకు బిజెపి పార్టీ భరోసా కార్యక్రమం గురువారం శక్తి కేంద్రం ఇంచార్జ్ పందుల భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా నాయకులు బూడిద లింగయ్య యాదవ్ విచ్చేసి ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రజా వ్యతిరేక పాలన తీవ్రంగా ఖండిస్తూ పేదలకు అవసరమైన రేషన్ కార్డులు గానీ పెన్షన్లు, ధరణి సమస్యలు, మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు జూనియర్,డిగ్రీ ప్రభుత్వ కళాశాలల, 100 పడకల ఆసుపత్రి, రెవిన్యూ డివిజన్ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన వంటి విషయాలన్నింటన్న స్మరించారని మరొకసారి మునుగోడు ప్రజలను మోసం చేశారని అన్నారు అలాగే కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి అట్టడుగు వర్గాల ప్రజల సంక్షేమం కొరకు నరేంద్ర మోడీ గారు చేస్తున్న విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భూత్ అధ్యక్షులు బీసం గంగరాజు బీసం శ్రీశైలం, జిట్టాగోని యాదగిరి,నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం,ముఖ్య నాయకులు పాలకూరి యాదయ్య,సాగర్ల లింగస్వామి, పందుల నరసింహ, విజయ్ కుమార్వే,దాంతం గోపీనాథ్ బొడిగ అశోక్ గౌడ్,భవనం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల అభివృద్ధి

- ఫార్మేషన్ రోడ్డు పనులను ప్రారంభిచిన
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్



పెద్దేముల్, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): ఎమ్మెల్యే సహకారంతో గ్రామాలు అభివృద్ధి ఫార్మేషన్ రోడ్డు పనులను ప్రారంభించిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలో పెద్ద కెనాల్ సమీపంలో గల పానాది. సిహెచ్ విట్టల్ పొలం నుండి హనుమాన్ గుడి వరకు ఎమ్మెల్యే సహకారంతో సిడిపి నిధులు ద్వారా 5 లక్షల తో మంజూరు అయిన ఫార్మేషన్ రొడ్డు పనులను ప్రారంభించామానరు అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతులు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున విషయం తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి వివరించగా వెంటనే 5 లక్షల ఫార్మేషన్ రోడ్ మంజూరు చేయడం జరిగింది గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఎనలేని కృషిచేస్తున్నారని అన్నారు. రైతుల పక్షాన ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్ రంగయ్య. గ్రామ కమిటీ అధ్యక్షుడు డివై ప్రసాద్. గ్రామ ప్రధాన కార్యదర్శి మామిళ్ళ వెంకట్.బి.రఘు రెడ్డి. శ్రీనివాస్ గౌడ్. తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే విద్యార్థులచే ఫైబర్ నేరాలపై అవగాహన



తాండూర్ టౌన్, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, పాఠశాల సమీపంలో ఉన్న హరిహర టౌన్షిప్ కాలనీలో కాలనీవాసులకు, సైబర్ క్రైమ్ నేరాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది మాట్లాడుతూ ఎవరైనా తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మన యొక్క బ్యాంక్ వివరాలు అడిగినట్లయితే, ఎటువంటి సమాచారం ఇవ్వద్దని, బ్యాంకు సిబ్బంది ఎవరు కూడా ఫోన్ చేసి మన యొక్క బ్యాంకు వివరాలు అడగరని, ఎవరు ఫోన్ చేసినా బ్యాంకు వివరాలు గానీ, యూపీఐ నంబర్ కానీ, ఏటీఎం నెంబర్ గాని, ఎటువంటి సమాచారం కూడా బయటి వ్యక్తులకు వెల్లడి చేయవద్దని తదితర విషయాలపై విద్యార్థులచే కాలనీవాసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జీవన్గి 37వ శ్రీ మహాదేవ లింగేశ్వర జాతర ఉత్సవాలు

- కలర్ఫుల్ రంగులతో లైటింగ్ తో ముస్తాబైన దేవాలయం
- భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసిన దేవాలయ కమిటీ



బషీరాబాద్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: కాగ్న నది ఒడ్డున వెలసిన కోరుకున్న కోరికలు తీర్చే కొంగు బంగారమైనటువంటి శ్రీ మహాదేవ లింగేశ్వర జాతర ఉత్సవాలు వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామంలో 37వ సంవత్సరం శ్రీ మహాదేవ లింగేశ్వర జాతర ఉత్సవాలు దేవాలయ కమిటీ వారు రంగులతో కలర్ఫుల్ తో లైటింగ్ తో దేవాలయాన్ని ముస్తాబ్ చేయడం జరిగింది కర్ణాటక మహారాష్ట్ర తెలంగాణ ప్రాంతంలో వివిధ గ్రామాల నుండి వచ్చే భక్తులకు నాలుగు రోజులు జరిగే ఉత్సవాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ ప్రాంతంలో ఎక్కడ జరిగినటువంటిది ఈ జాతరలో ప్రత్యేకంగా కుస్తీపట్ల- ఆట ఆకర్షణీయంగా ఉంటుందని ఈ ప్రాంత వాసులు అనుకుంటున్నారు.

**జాతర ఉత్సవాల కార్యక్రమాలు**

17వ తారీకు శుక్రవారం రోజు నవగ్రహ పూజ, నవగ్రహ హోమం, మంటప దేవత పూజ, వెండి పల్లకి సేవ

18 వ తారీకు శనివారం రోజు ఏకాదశి రుద్రాభిషేకం శివపురాణ కథ కాలక్షేపం తెల్లవారుజామున 5 గంటలకు శివ భక్తులచే శివచార్యులచే అగ్నిగుండం మహోత్సవం

19 తారీకు ఆదివారం రోజు మధ్యాహ్నం3:15 నిమిషాలకు శ్రీ పార్వతీ పరమేశ్వర కళ్యాణోత్సవం తదుపరి స్వామి వర్ల రథోత్సవం (తేరు) ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమం

20వ తారీకు సోమవారం రోజు కుస్తీపట్ల- ఆట, ప్రసాద వితరణ అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ వారు తెలిపారు మరియు తాండూర్ ఆర్టీసీ డిపో నుండి జీవన్గి జాతరకు నాలుగు రోజులు జరిగే ఉత్సవాల సందర్భంగా ప్రతి గంటకు స్పెషల్ బస్సులు కలవు.

## విద్యుత్ హై టెన్షన్ లైన్‌ల కింద మంటలు పెట్టవద్దు

- సర్పంచ్ పల్లె ప్రతిమ,చీప్ మేనేజర్ పవన్‌కుమార్




రామగిరి, ఫిబ్రవరి 16, మనం న్యూస్: రామగుండం పరిధిలో 400 కేవి అధిక విద్యుత్ లైన్(హై టెన్సన్ లైన్) ల కింద మండలు పెట్టవద్దని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు,చీఫ్ మేనేజర్ పవన్‌కుమార్ అన్నారు. గురువారం రత్నాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో రామగుండం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పవర్ గ్రిడ్ వారి 400 కెవి అధిక విద్యుత్తు లై (పెద్ద లైన్) ల కింద రైతులు తమ పత్తి,కంది,మిరప,జొన్న,చెరుకు మొదలగు పంటల నుండి ఏర్పడిన,మిగిలిపోయినటువంటి ఎండిపోయిన గడ్డి,చెత్త,పుల్లలను తగుల పెట్టకూడదని కోరారు. ఇలా చేయడం వలన లైన్‌లలో అంతరాయం కలుగుతుందని,దీనివలన కరెంటు సరాఫరకు అంతరాయం కలుగుతూ, విద్యుత్ ప్రమాదాలకు దారి తీస్తున్నాయని, మిగతా ప్రాంతములకు తగిన రీతిలో కరెంట్ సరఫరా చేయలేక పోతున్నామని తెలిపారు. కావున రైతులందరూ గమనించి వారి పొలాల్లోని ఎండు గడ్డి, చెత్త, పుల్లలను పెద్ద కరెంటు లైన్‌ల నుంచి దూరంగా తీసుకపోగలరని తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇంజనీర్ మహేందర్, పంచాయతీ సెక్రెటరీ పెండ్లి రమ్య,రైతులు జక్కుల రాజయ్య, ఉడుత మల్లయ్య, సందవేనా కుమార్,మేకల రాంచందర్,కారోబార్ కొండపర్తి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## మంథని ప్రజలకి సునీల్‌రెడ్డి ఒక ఆశా కిరణంగా ఉన్నారు

- బీజేపీ జెండా ఎగరవేసే వరకు పోరాడుతాం
- పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ రావుల రామనాథ్



మంథని, ఫిబ్రవరి 16, మనం న్యూస్: మంథని పట్టణంలో బిజెపి పార్టీ పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ రావుల రామనాథ్ ఆధ్వర్యంలో గురువారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర నాయకులు చందుపట్ల సునీల్‌రెడ్డి చేపట్టిన మంథని ప్రజాగోస బిజెపి భరోసా అని గడపగడప కి సునీల్‌రెడ్డి నివాదంతో మొదటి విడతగా ఐదు మండలాల్లో పాదయాత్ర,ప్రజా చైతన్య యాత్ర పేరుతో చేయడం జరుగుతుందని దీనికి ప్రజలు నీరాజనాలు పడుతూ వారి సమస్యలను తెలియపరుస్తున్నారని ఆయన తెలిపారు. గత కొన్ని ఏళ్లుగా మంథని శాసన సభ్యులుగా పరిపాలించిన శ్రీధర్‌బాబు,పుట్ట మధుకర్ గానీ మంథని పట్ల ఎటువంటి చిత్తశుద్ధి లేకుండా అన్ని రకాలుగా మోసం చేశారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మంథని నియోజక వర్గాన్ని నీట ముంచినా కూడా ఎటువంటి నష్టపరిహారం అందించకుండా రైతులను,ప్రజలను మోసం చేసి యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనాలలో కూడా నిర్లక్ష్యం చూపెట్టారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంథని ప్రజలకి సునీల్‌రెడ్డి ఒక ఆశా కిరణంగా ఉన్నారని మంథని నియోజకవర్గంలో బిజెపి జెండా ఎగరవేసే వరకు వెనుకంజ వేయకుండా పోరాడి తీరుతామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎడ్ల సదాశివ,పార్లమెంట్ పెద్దపల్లి కన్వీనర్ మల్లికార్జున్,సీనియర్ నాయకులు మహావాది రామన్న,మామిడి రాజేశం,ప్రధాన కార్యదర్శులు,సభ్యులు సంతోష్,తోట మధుకర్‌లు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి 50 కిలోల బియ్యం పంపిణీ

- మంథని మండల యూత్ కాంగ్రెస్ నాయకులు

మంథని, ఫిబ్రవరి 16, మనం న్యూస్: మంథని మండలంలోని బిట్టుపల్లి గ్రామానికి నాంపల్లి వెంకటేష్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా గురువారం మంథని ఎమ్మెల్యే దుద్దిల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు వారి చిత్రపటానికి మంథని మండల యూత్ కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మృతిని కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మంథని మండల అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్,యూత్ కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ల నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బూడిద శంకర్, మాజీ సర్పంచ్ దొర గొర్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సోషల మీడియా పెద్దపల్లి జిల్లా ఇన్చార్జ్ ఆరేళ్ల కిరణ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పోగుల మహేందర్, గ్రామశాఖ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్, అధ్యక్షులు గువ్వల రాయమల్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పోగుల సాగర్, గొల్లపల్లి శ్రీనివాస్, చల్ల సమ్మయ్య, చల్లా సంజీవ్, కాసు రాజు, పోచంపల్లి ఓదెలు, చెరుకుతోట నరేష్, మాధవరావు అశోక్, తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్ | రంగారెడ్డి వికారాబాద్

## జీవన్గి శివాలయాన్ని సందర్శించిన తాండూర్ సీఐ రాంబాబు, ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి





బషీరాబాద్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: బషీరాబాద్ మండలంలో జీవన్గి గ్రామంలో గురువారం రోజు తాండూర్ సిఐ రాంబాబు ఎస్సై విద్యాచరణ్ రెడ్డి శ్రీ మహాదేవ లింగేశ్వర దేవాలయాన్ని సందర్శించి ఈనెల 17 నుంచి 20 వరకు జాతర ఏర్పాట్లను పరిశీలించారు మరియు నాలుగు రోజులు జరిగే జాతర ఉత్సవాల కు సంబంధించిన విషయాలు ఆలయ కమిటీ వారికి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొర్వి చేడ్ గని గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ కు హాజరయ్యారు మరియు ఫైనల్ మ్యాచ్ లో గెలుపొందిన మొదటి విజేతకు, రెండో విజేత సీఐ, ఎస్సైవారికి బహుమతులు ప్రధానోత్సవం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వాలీబాల్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

## మేడిచెట్టు తండాలో సేవాలాల్ జయంతి వేడుకలు



కోడంగల్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: కోడంగల్ నియోజకవర్గ పరిధిలోని బొంరాస్ పేట్ మండలం మేడిచెట్టు తండా గ్రామ పంచాయితీ లో శ్రీశ్రీశ్రీ సద్గురు సంత్ సేవాలాల్ 284 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా మేడి చెట్టు తండా నుండి బాపల్లి తండావరకు పెద్ద ఎత్తున డిజె సౌండ్ తో నృత్యాలు చేస్తు, ర్యాలీగా వెళ్ళారు.గిరిజన మహిళలు సాంప్రదాయ దుస్తులు, వేషాధారణ పలువురిని ఆకట్టుకుంది.ఈకార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సూర్య నాయక్, వివేకానంద యూత్ తండా ప్రసిడెంట్ వినోద్ నాయక్, మాజీ ఎంపీటీసీ రవి నాయక్, రమేష్ నాయక్,తుల్జ నాయక్, రవి నాయక్,విఠల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులు



కోడంగల్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: కోడంగల్ మండలం లోని కస్తూరి పల్లి గ్రామంలో జరిగిన గ్రేస్ వెంకట్ ల వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వధూవరులను ఇంటినుండి అంబేడ్కర్ విగ్రహం వరకూ డప్పులు, బాజభజంత్రీలతో ఊరేగింపుగా తీసుకెళ్ళి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం, వధూవరుల దండలు మార్చుకున్నారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించి,అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేడ్కర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ బహదూర్, సుధాకర్, అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యు.రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి గౌరగళ్ళ కృష్ణ మౌర్య,బిఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చెట్టుకింది ఇస్సప్ప,కుల్కచర్ల అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వెంకట్రాములు, లక్ష్మయ్య, బొర్రా బాల్ రాజ్, చిన్ని కృష్ణ, ధర్మపురి అశోక్, కుప్పగిరి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విస్తృత ప్రచారం



కోడంగల్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: కోడంగల్ నియోజకవర్గ పరిధిలోని బొంరాస్ పేట్, దుద్యాల, దౌల్తాబాద్, కోడంగల్ మండలాల్లో టియస్ యూటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విస్తృత స్థాయి ప్రచారం కొనసాగించారు. ఈసందర్భంగా టియస్ యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు లు మాట్లాడుతూ, విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పై అలుపెరుగని పోరాటం చేస్తున్న పాపన్న గారి మాణిక్ రెడ్డి కి ఉపాధ్యాయులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో టియస్ యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, కార్యదర్శి నడిమింటి మల్లేష్, బొంరాస్ పేట్ మండల అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి గౌరారం గోపాల్, కోడంగల్ నాయకులు బసప్ప, ముత్యప్ప, అశోక్, అంజా నాయక్, దౌల్తాబాద్ నాయకులు భీమిరెడ్డి, శ్రీనివాస్, నర్సింగ్, మరియు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నల్గొండ సూర్యాపేట-యాదాద్రి

## వార్డులో సమస్యలపై వినతి పత్రం



సూర్యాపేట టౌన్ ఫిబ్రవరి 16 మనం న్యూస్: పట్టణంలోని 16వ వార్డులో బంజార భవన్‌లో సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనటంతో ఆ వార్డు కౌన్సిలర్ సలిగంటి సరిత, బిజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేందర్ మంత్రికి వార్డులోని ప్రధాన సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...... వార్డులలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు 2017లోనే శంకుస్థాపన చేసి ఇప్పటి వరకు ఆ పనులను చేపట్టలేదని, డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో పాటు రహదారులు, వార్డు ప్రజలు సాయాంకాలం బయటికి వచ్చి సేదతీరటానికి పార్కులు కూడాలేవని పేర్కొన్నారు. పార్టీలను పక్కకు పెట్టి ప్రజల సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

## నాగమ్మ మృతదేహానికి నివాళి



నడిగుడెం ఫిబ్రవరి 16 మనం న్యూస్: మండల పరిధిలోని కర్విరాల గ్రామానికి చెందిన గుమ్మడిదల సత్యం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాతృమూర్తి అయిన నాగమ్మ ఆకాల మరణం చెందటంతో గురువారం కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హనుమంతరెడ్డి శశిధర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ రాంరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు గుండు విజయరామారావు, వెంకట్ రెడ్డి, ప్రవీణ్‌కూమార్, తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు ఉచిత షూలు పంపిణి



తుంగతుర్తి ఫిబ్రవరి 16 మనం న్యూస్: మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రూ. 15వేల విలువ గల క్రీడా షూస్‌లను అదే గ్రామ వాసి ప్రధానోపాధ్యాయులు మోత శ్రీనివాస్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... క్రీడా శిక్షణకు క్రమం తప్పకుండా విద్యార్థులు హజరై, క్రీడలలో పాల్గోనాలని, శిక్షణను పొంది బాగా రాణించాలని అన్నారు. విద్యార్థులు పాఠశాల గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృంధం పాలకుర్తి ఎల్లయ్య, బినపెల్లి శ్రీనివాస్, జ్యోతి, రవీందర్, నందకూమార్, ఆంజ నేయులు, రమాదేవి, స్వాతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రలకు నిదర్శనం దేవాలయాలు



నడిగుడెం ఫిబ్రవరి 16 మనం న్యూస్: చరిత్రకు నిలువెత్తు నిదర్శనం దేవాలయాలని కోదాడ శాసన సభ్యుడు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని శ్రీ బాలా కోటేశ్వరీ స్వామి దేవాలయం కొండ మీదకి రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.... ఆలయాల అభివృద్ధికి బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి ఆలయాన్ని అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు. భారాసా ప్రభుత్వం అన్ని కులమాతాల విశ్వసాలకు సముచిత స్థానం ఇస్తుందని, ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, రాబోయే శివరాత్రికి ఈ ఆలయ జాతరకు విచ్చేసే భక్తులకు వసతులలో ఏలాంటి లోటుపాట్లు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి జాతరను విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లంని ఆలయ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటీసి బాణాల కవిత, సోసైటి చైర్మన్ పుట్టరమేష్, అనంతరగిరి ఎంపిపి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు శ్రీనివాసరావు, చంద్రయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు నూకపంగు వీరయ్య, ప్రమీల, వెంకన్న, పుల్లరెడ్డి, రమేష్, ధన్వంతరెడ్డి, జానీమీయా, బిక్షం, ఖాసీం, శ్రీను, సయ్యద్, హుస్సేన్, ఉపేందర్, భాస్కర్, ప్రసాద్, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

### జనచైతన్య ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు చేయూత



హుజూర్‌నగర్,ఫిబ్రవరి16,మనంన్యూస్: మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులో రెండు నిరుపేద కుటుంబాని జనచైతన్య ట్రస్ట్ ఆద్వర్యంలో గురువారం 25కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను, కారంగుల కాశీవిశ్వనాథ్ (శివసాయి కిరాణం) పుట్టినరోజు సందర్భంగా జనచైతన్య ట్రస్ట్‌ను సంప్రదించి 50కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వహకులు వంశీ, సాయి, శివశంకర్‌లు మాట్లాడుతూ... జనచైతన్య ట్రస్ట్ ద్వారా రక్తదాన కార్యక్రమాలు చేపడుతూ ఆపదలో ఉన్నవారికి, నిరుపేదలకు సేవలందిస్తున్నామని, 2వ వార్డు మల్లన్ననగర్‌కు చెందిన యర్ర అచ్చమ్మ, వేముల సైదులు సతీమణి లక్ష్మమ్మ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుకుని జనచైతన్య ట్రస్ట్ ద్వారా బియ్యం, నిత్యవసర సరుకులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య ట్రస్ట్ ఫౌండర్ పినరాళ్ల వంశీ, అధ్యక్షులు పారా సాయి, పిల్లి శివశంకర్, ఉపేందర్, శివ, నవీన్ పాల్గొన్నారు.

# చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు ఆలయాలు

### కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

### ప్రజల విశ్వాసాలకు ప్రభుత్వం సముచిత స్థానం ఇస్తుంది

నడిగూడెం, ఫిబ్రవరి 16 (మనం న్యూస్) : చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు ఆలయాలని కోదాడ శాసనసభ్యులు మల్లయ్య యాదవ్ అన్నారు. గురువారం నడిగూడెం మండల పరిధిలోని వల్లాపురం గ్రామంలో గల శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవాలయం కొండమీదికి 20 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఆలయ చరిత్ర భవిష్యత్ తరాలకు అందించాలి. ఆలయాన్ని అభివృద్ధి చేసి రాష్ట్ర స్థాయిలో పేరు తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని కులాల మతాల వారి విశ్వాసాలకు సముచిత స్థానం ఇస్తుందన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు.శివరాత్రికి శ్రీ బాల కోటేశ్వరస్వామి జాతరకు విచ్చేసే భక్తులకు వసతులలో ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా అందరూ తగిన జాగ్రత్త తీసుకోవాలి అన్నారు.అధికారులు ప్రజా ప్రతినిధులు నాయకులు సమన్వయంతో పని చేసి ఈ జాతర విజయవంతం చేయాలి అన్నారు. భక్తులు కుటుంబంతో వచ్చి ఆ పరమశివుని దర్శించుకుని స్వామివారి కృపకి పాత్రులు కాగలరని ఆయన అన్నారు.వేలాది గా తరలి వచ్చే భక్తుల వాహనాల కోసం కావల్సినంత పార్కింగ్ వసతి కల్పించినట్లు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. దేవాలయం వరకు రవాణా సదుపాయం ఏర్పాటు చేయాలి అన్నారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో



ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బాణాల కవిత నాగరాజు నడిగూడెం సొసైటీ చైర్మన్ పుట్టా రమేష్ అనంతగిరి ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు శ్రీనివాసరావు వల్లాపురం సర్పంచ్ చంద్రయ్య బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు నూకపంగు ఈదయ్య ఉప సర్పంచ్ తీగూరి ప్రమీల సంజీవరెడ్డి సొసైటీ డైరెక్టర్ వట్టికూటి వెంకన్న అనంతగిరి మండల పార్టీ అధ్యక్షులు గింజుపల్లి రమేష్ టిఆర్ఎస్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి ధన్వంత్ రెడ్డి బిక్షం జాన్మియా రాములు శ్రీను ఖాసిం సయ్యద్ హుస్సేన్ సంపెట ఉపేందర్ తుమ్మలపల్లి భాస్కర్ ప్రసాద్ రెడ్డి,సర్పంచులు ఎంపిటిసిలు బిఆర్ఎస్ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లక్షల ఎకరాలకు సాగు నీరందించా

### మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



హాలియా, ఫిబ్రవరి 16 (మనం న్యూస్) : ఈరోజు హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా అనుముల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి జానారెడ్డి హాజరయ్యారు. గ్రామ ప్రజలు ఆయనకు పూలతో బ్రహ్మరథం పట్టారు అనంతరం వారు మాట్లాడుతూ లక్షల ఎకరాలకు సాగు నీరు అందించింది నేను. కేంద్రంలో మోదీ తెలంగాణా లో కేసీఆరే పోలీసుల ద్వారా బెదిరిస్తున్నారు. మాయ మాటలు ఎలక్షన్ టైంలో ముటల సంచులతో వొచ్చి గెలుస్తున్నడు కేసీఆర్.దళితుల మూడెకరాల భూమి హామీ ఏమైంది. నిరుద్యోగు బృతి రైతు రుణమాఫి ఏమైంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అరాచకాలు మోసాలను ప్రజలకు వివరించేందుకు ఈ యాత్ర ఉద్దేశ్యం. అధికారం లేకున్నా మీకు అండగా తోడుగా నిలుస్తున్న. అనుముల గ్రామంలో ప్రజాశక్తి తో నేను చెక్ డ్యాం నిర్మిస్తాను.అనుముల గ్రామ ప్రజల దివెనతో రాష్ట్రనికి సేవ చేసే భాగ్యం నాకు దక్కింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, స్థానిక కౌన్సిలర్స్, యువజన నాయకులు, విద్యార్థి నాయకులు, మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### జడ్పీటీసీ ఆధ్వర్యంలో నూతన వధూవరులకు ఆర్థిక సహాయం అందజేత



బీబీనగర్, ఫిబ్రవరి 16 (మనం న్యూస్) : మండలంలోని రహీంఖాన్ గూడెం గ్రామానికి చెందిన కూనోజి కలమ్మబిక్షపతి దంపతుల కుమార్తె వివాహానికి జడ్పీటీసీ గోలి ప్రణీతాపింగల్ రెడ్డి తనవంతు సహాయంగా నూతనవదూవరులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మంచాల రవి కుమార్, ఉప సర్పంచ్ రాపాక జంగయ్య యాదవ్, మాజీ సర్పంచ్ ఆల్వ శ్యామలసత్తిరెడ్డి, నాయకులు మంచాల నరహరి, నోముల రాంరెడ్డి, స్వామి యాదవ్, నరసింహచారి, పంజాల నవీన్ గౌడ్, మంచాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డులలో తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే నోముల భగత్



హాలియా, ఫిబ్రవరి 16 (మనం న్యూస్) : నల్గొండ జిల్లా...హాలియా మున్సిపాలిటీ పరిధి లోని అనుములలో ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్న నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గౌరవ సలహాదారుడు వెంపటి శంకరయ్య, మార్కెట్ చైర్మన్ జవాజి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కురాకుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, ప్రధాన కార్యదర్శి దొరేపల్లి వెంకన్న, స్థానిక కౌన్సిలర్ ప్రసాద్ నాయక్, కో ఆప్షన్ నెంబర్ రావుల లింగయ్య, మార్కెట్ డైరెక్టర్ సురభి రాంబాబు, నాయకులు జింకల ప్రసాద్, దుర్గారావు,బొడ్డు పల్లి మురళి, యూత్ అధ్యక్షుడు సైదాచారి, రావిళ్ళ చేన్నయ్య, బందిలి చిన సైదులు, అల్లి కిషన్, సపావత్ హనుమంతు, సపావత్ మోతిలాల్,దుర్గయ్య, ఎర్రయ్య, శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు..

### బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్న శివరాత్రి వేడుకలు



బీబీనగర్, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): మండలంలోని మహదేవపూర్ గ్రామంలో గల బ్రహ్మకుమారీస్ ఆశ్రమ ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకురాలు సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ జీవితంలో ఉన్న సమస్యలు, రోగాల విముక్తి పొందడం కోసం ప్రత్యేకంగా దు:ఖ వినాశక రుద్ర ధ్యాన యజ్ఞం నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల్గొన్న భక్తులకు ధ్యాన శివలింగం అందజేయడంతో పాటు సామూహిక మహాశివ ద్యానం, ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శనం, పరమశివుడి అవతరణ సినిమా ప్రదర్శనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## మన ఊరు - మన బడి పనులు పర్యవేక్షించిన ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): హాలియా మున్సిపాలిటీ లోని 7 వ వార్డులో ప్రాథమిక పాఠశాలలో మన ఊరు- మనబడి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పనులను పర్యవేక్షించిన నాగార్జునసాగర్ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గౌరవ సలహాదారుడు వెంపటి శంకరయ్య, మార్కెట్ చైర్మన్ జవాజి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కురాకుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, ప్రధాన కార్యదర్శి దొరేపల్లి వెంకన్న, స్థానిక కౌన్సిలర్ ప్రసాద్ నాయక్, కో ఆప్షన్ నెంబర్ రావుల లింగయ్య, మార్కెట్ డైరెక్టర్ సురభి రాంబాబు, నాయకులు జింకల ప్రసాద్, దుర్గారావు,బొడ్డు పల్లి మురళి, యూత్ అధ్యక్షుడు సైదాచారి, రావిళ్ళ చేన్నయ్య, బందిలి చిన సైదులు, అల్లి కిషన్, సపావత్ హనుమంతు, సపావత్ మోతిలాల్,దుర్గయ్య, ఎర్రయ్య, శ్రీను, గొర్ల సతీష్, జూపల్లి



సైదులు, బొడ్డుపల్లి ఈదయ్య, జూపల్లి కృష్ణా, గంపల సత్యనారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన శ్రీ లింగబస్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



బీబీనగర్, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): మండలంలోని పడమటి సోమారం గ్రామంలో గల శ్రీ లింగబస్వేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాలో ఎంపీపీ యర్కల సుధాకర్ గౌడ్ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముగింపు ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో ఎంపీపీ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అగ్నిగుండాల కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీవాణి, ఎస్సై సైదులు, ఆలయ చైర్మన్ వాకిటి బస్వారెడ్డి, సర్పంచ్ తలబోయిన గణేష్ యాదవ్, ధర్మకర్తలు, మాజీ జడ్పీటీసీ సందిగారి బస్వయ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆల్వ మోహన్ రెడ్డి, ఆలయ ఈవో నరేందర్ రెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బీమా పాలసీ అందజేత

సూర్యాపేట టౌన్ ఫిబ్రవరి 16 మనం న్యూస్: పట్టణంలోని పోచంపల్లి బ్యాంకులోని ఖాతాదారుడైన దాసరి వీరయ్య ప్రమాదవశాత్తు మరణించడంతో అతని భార్య నాగలక్ష్మీకి రూ. లక్ష ప్రమాద బీమా చెక్కును గురువారం బ్యాంకు చైర్మన్ సుబ్రహ్మణ్యం, సీఈఓ సీత శ్రీనివాస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... తమ బ్యాంకులోని ఖాతాదారులు ఆకాల మరణం చెందితే గ్రూప్ జనతా వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ ద్వారా రూ. లక్షను కుటుంబ సభ్యులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శ్రీకిషన్, సిబ్బంది సాయికుమార్, మల్లికార్జున్, శృతి, సైదులు, కవిత, తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ స్పోర్ట్స్ పాఠశాలలో శిక్షణ

సూర్యాపేట టౌన్ ఫిబ్రవరి 16 మనం న్యూస్: 2023-24 విద్యా సంవత్సరానికి గాను బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, బోయినపల్లి యందు వాటర్ స్పోర్ట్స్ అకాడమి ప్రారంభించడంతో కాయాకింగ్, కేనోయింగ్, సెయింగ్ మొదలైన వాటర్ స్పోర్ట్స్ నందు బాలబాలికలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని జిల్లా గిరిజన శాఖ కె శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 2023 ఆగస్టు 31 నాటికి 9 నుండి 11 సంవత్సరాలు గల గిరిజన విద్యార్థులు బోనోఫైడ్, ఆధార్ కార్డు జీరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను ఈ నెల 24 తేదిలోగా కార్యలయంలో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ధరఖాస్తు చేసుకున్న 10 మంది బాలికలు, 10 మంది బాలురులను ప్రతిభ ఆధారంగా ప్రవేశం కల్పించబడునని తెలిపారు.

### ఓ ఎమ్మెల్యే సారు.. మా గోడు పట్టించుకోండి..



బీబీనగర్, ఫి బ్రవరి 16 (మ నం న్యూస్) : మేము కడు నిరుపేద కుటిం బీకులం.. రెక్కా డితే కనీ డొక్కా డని దయనీ యమైన పరిస్థితి మాది. మా కు అన్యాయం చేస్తారా అంటూ.. డబుల్ బెడ్ రూమ్‌లకు అర్హులైన బాధిత మహిళలు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి కాన్వాయిని ఆపి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. బీబీనగర్ మండల కేంద్రంలో కేవలం 11 ఇండ్లను కేటాయించి చేతులు దులుపుకోవడం సరికాదని, అర్హులైన నిరుపేదలకు కనీసం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత మహిళలు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో అధికారులు గుర్తించిన నిరుపేద కుటుంబాలు 157 ఉన్నాయని, అందరికీ న్యాయం జరిగేలా చూడాలని, లేని పక్షంలో కనీసం ఇళ్లు కట్టుకోవడానికి స్థలం కేటాయించాలని కోరారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత, విజయలక్ష్మి, కోటేశ్వరమ్మ, విద్య, ఈరమ్మ, బాలమణి, పుష్ప, గీత, రిజ్వాన, మైమూద, పద్మ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

బీబీనగర్, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): గిరిజనుల అభ్యున్నతికి కృషి ఎనలేని కృషి చేసిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు సురకంటి సతిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సందిగారి బస్వయ్య, బీబీనగర్ పట్టణ ఎంపీటీసీలు గోలి నరేందర్ రెడ్డి, టంటం భార్గవ్, వార్డు సభ్యులు పంజాల పెంటయ్య గౌడ్, బెండ ప్రవీణ్, సామల వేణు, టంటం రఘు, కొండమడుగు మాజీ సర్పంచ్ సుర్వి వేణు గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు బండారు ఆగమయ్య గౌడ్, చెరుకు అచ్చయ్య గౌడ్, నాయకులు రాజేందర్ నాయక్, జిట్ట అమరెందర్ రెడ్డి, జంగయ్య యాదవ్, తాళ్ల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల రూపురేఖలు మార్పు

### - కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

### - పెద్ద ఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీతో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కు స్వాగతం

### - బిఆర్ఎస్ పార్టీ ప్రవేశ పెట్టిన పథకాలు దేశానికి ఆదర్శం

అనంతగిరి, ఫిబ్రవరి 16 (మనం న్యూస్) : బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల రూపు రేఖలే మారాయని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు.మండల పరిధిలోని చనుపల్లి పాలవరం, పాలవరం తండా గ్రామాలలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అనంతగిరి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గింజుపల్లి రమేష్ ఆధ్వర్యంలో పార్టీ లో చేరికల కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోదాడ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. పాలవరం పాలవరం తండా చనుపల్లి గ్రామాలకు



చెందిన కాంగ్రెస్ పార్టీ సుమారు 100 కుటుంబాలు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి బిఆర్ఎస్ పార్టీ లోకి ఆహ్వానించారు. చనుపల్లి ఉపసర్పంచి గరిడేపల్లి సైదులు ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు చేరినారు సుమారు 200 మోటార్ సైకిల్ తో ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు అనంతరం ఆయా గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేదని ఆ పార్టీకి నాయకత్వం వహించే నాయకుడు లేడని పార్టీ రోజురోజుకు దిగజారి పోతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం లేని సమస్యతో సతమతమవుతుందని ఆయన తెలిపారు. పేదల అభ్యున్నతికి బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుంది అని ఆయన అన్నారు.రైతులకు అండగా బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఉంటుందని.ప్రతీ కార్యకర్త కుటుంబానికి గులాబీ పార్టీ అండగా నిలుస్తున్నదని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు శ్రీనివాసరావు ఎంపీటీసీ సంధ్య సైదులు కల్వకుంట్ల బిక్షమయ్య బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మద్ది ధన్వంత రెడ్డి వెంకట్ రెడ్డి శ్రీరామ్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి వెంపటి వెంకటేశ్వర్లు ఈదుల కృష్ణయ్య మట్టపల్లి శ్రీనివాస్ కంటు నాగార్జున సంపెట ఉపేందర్ భాస్కర్ ప్రసాద్ రెడ్డి, సర్పంచులు ఎంపిటిసిలు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ ప్రాంత ప్రజల అభివృద్ధి, సంక్షేమమే పోలీసుల లక్ష్యం

- 150 మందికి దుప్పట్లు, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ
- ఎస్పీ కె.సురేష్ కుమార్ ఐపీఎస్

కొమ్రంభీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత ప్రజల అభివృద్ధి,సంక్షేమమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం అని ఎస్పీ కె సురేష్ కుమార్ అన్నారు. గురువారం సిర్పూర్ యు పోలీస్ స్టేషన్ పరిధిలోని కోహినూరు (కే) గ్రామం లో నిర్వహించిన పోలీసులు మీకోసం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్ సుమారు 150 మంది ఆదివాసి ప్రజలకు దుప్పట్లు, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్య ద్వార అభివృద్ధి సాధ్యపడుతుందని, విద్యార్థులు, యువత జీవిత లక్ష్యాలను ఏర్పరచుకొని, చక్కగా చదువుతూ ఉన్నత స్థాయికి ఎద గాలని ఆకాంక్షించారు. యువతీ, యువకులు మావోయిస్టు, తీవ్రవాద కార్యకలాపాలకు దోహదపడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని పేర్కొన్నారు. నీటి సౌకర్యం లేని మారుమూల ప్రాంతాల్లో నీటి వసతిని కల్పించే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఎస్పీతెలిపారు. ఈ ప్రాంతంలో మావోయిస్టు దళ సభ్యులు కదలికలు ఉన్నట్లు దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు, ఆదివాసి ప్రజల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, మావోయిస్టుల ఆగడాలకు ఉనికికి అడ్డుకట్ట వేయాలని సూచించారు. ప్రజలకు ఏ సమస్యలు ఉన్న ప్రభుత్వం, పోలీసుల ద్వారా పరిష్కరించుకోవాలని, పోలీసులు మీకోసం కార్యక్రమం ద్వారా జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో ఎన్నో సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అపరిచిత వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో తెలియ జేయాలి లేదా డయల్ 100 కీ కాల్ చేసి తెలియజేయాలని కోరారు. తెలిపిన వారి వివరాలు రహస్యంగా ఉంచబడుతాయని అన్నారు.ఇతర శాఖల అధికారులతో మాట్లాడి వెంటనే అట్టి సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. గ్రామంలోకి లేదా పరిసర ప్రాంతాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే



వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వర రావు, జైనూర్ సి.ఐ రామకృష్ణ , వసుధ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ ఉమ, సిర్పూర్ యు ఎస్ఐ రాజు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రసమయి తొలిపొద్దు పర్యటన

- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



తిమ్మాపూర్, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ గురువారం తొలిపొద్దు పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ మండలంలోని అలుగునూర్, మహాత్మా నగర్, తిమ్మాపూర్, రామకృష్ణ కాలనీ, ఇందిరానగర్, నుస్తులాపూర్, మక్తపల్లె, నల్లగొండ, పోలంపల్లి, మల్లాపూర్, మన్నెంపల్లి, పోరండ్ల గ్రామాల్లో పర్యటించిన ఆయన ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కార మార్గాలను సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా, డంపింగ్‌లపై చర్యలు చేపట్టాలి



వీణవంక, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): మండలంలోని చల్లూరు, ఇప్పలపల్లి గ్రామాల్లో ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా, డంపింగ్‌లు చేస్తున్నారని వాటిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ రైతు ముదిగంటి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆయా గ్రామాలలోని రైతులు మానేరువాగు వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేశారు.ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గత మూడు రోజులుగా ఇసుక అక్రమ తవ్వకాలు,డంపింగ్‌లపై వ్యతిరేకంగా తాము దీక్ష కొనసాగిస్తున్నామని, అక్రమ ఇసుక రవాణా, డంపింగ్‌లపై చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ అధికారి, ఎస్సై కు ఫిర్యాదు చేసినప్పటికి కూడా ఎటువంటి చర్యలకు ఉపక్రమించలేదని ,ఇది ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో ఆమరణ దీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. రైతుల దీక్ష శిభిరం వద్దకు భూమి పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు మారువాడి సుదర్శన్ వచ్చి సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు గొడుగు వినోద్‌కుమార్‌యాదవ్, ఎనుగంటి రవీందర్, వేల్పుల సాగర్, మెతుకు కోమల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కర్నాల రాజేందర్, కొలిపాక తిరుపతి ,ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## శ్రీరాములపేటలో ప్రజా గోస ...బీజేపీ భరోసా



వీణవంక, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): మండలంలోని శ్రీరాములపేట గ్రామంలోని బూత్ నంబర్ 99 లో ప్రజా గోస..బిజెపి భరోసాలో భాగంగా మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించి గ్రామస్తులకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు.ఈ కార్యక్రమంలో భాజాపా నాయకులు రంగు భాస్కరాచార్యులు,బత్తిని నరేష్‌గౌడ్,బొంగోని సదానందం, గ్రామ సర్పంచ్ కొల్లూరి సంధ్యాబాపురావు, ఉపసర్పంచ్ బొబ్బల దామోదర్‌రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షులు బొబ్బల శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కంటి అద్దాల పంపిణీ

చిగురుమామిడి, ఫిబ్రవరి 16, (మనం న్యూస్) : మండల కేంద్రంలోని కంటి వెలుగు శిబిరంలో అర్హులైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు ఎంపీపీ కొత్త శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మణ్ తెలిపారు. 1409 మందికి స్ర్కీనింగ్ చేయగా 386 మందికి రీడింగ్ అద్దాలను అందజేయగా, 166 మందికి ఆర్డర్ పెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నర్సయ్య, పంచాయతీ సెక్రటరి వెంకటరమణ, సూపర్‌వైజర్ హజిబాబు, ఏఎన్‌ఎంలు స్వరూపరాణి, మమత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.




# జర్నలిస్టులకు కంటి వెలుగు నిర్వహించాలి

- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేశ్

కొమ్రంభీం అసిఫాబాద్, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): జిల్లాలోని జర్నలిస్టులకు ప్రత్యేకంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించాలని టీడబ్ల్యూజేఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) నాయకులు కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్ట్‌గా నిత్యం విధి నిర్వహణలో తీరికలేని పనులతో ఉండే విలేఖరులు అనేక కంటి సమస్యలతో బాధ పడుతున్నారని అన్నారు. దీనితో ప్రభుత్వం నిర్వహించే కంటి వెలుగును సద్వినియోగం చేసుకోలేక పోతున్నారని తెలిపారు. అసిఫాబాద్ నియోజకవర్గ జర్నలిస్టుల కోసం అసిఫాబాద్ లో, సిర్పూర్ టి నియోజకవర్గ జర్నలిస్ట్‌ల కోసం కాగజ్ నగర్ లో ఒక రోజు ప్రత్యేకంగా కంటి వెలుగును నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో



టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు జి. మహేష్ ప్రధాన కార్యదర్శి పి. రాజశేఖర్, జాతీయ కౌన్సిల్ సభ్యులు టి. సురేందర్ రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్. సతీష్, కోశాధికారి కృష్ణ మోహన్ గౌడ్, రవి, జలీల్ బెగ్ పాల్గొన్నారు.

## హమ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ పెస్ట



చిగురుమామిడి, ఫిబ్రవరి 15, (మనం న్యూస్): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ధనపురి బాలరాజు వర్ధంతిని పురస్కరించుకొని స్పోర్ట్స్ పెస్ట్ పేరిట విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ధనపురి సాగర్ తెలిపారు. ఆరు రోజుల నుంచి విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, షాట్‌పుట్, వాలీబాల్, 100 మీటర్స్ రన్నింగ్, క్యారం, చెస్, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్ వివిధ రకాల ఆటలను ఆడించినట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు.

## తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



చిగురుమామిడి,ఫిబ్రవరి 16, (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని జిల్లా రైతు బంధు సమితి సభ్యులు సాంబారి కొమురయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత బంధు పథకాలు కేవలం కాగితాలపైన మాత్రమే ఉందని.. కానీ సీఎం కేసీఆర్ వాటిని అమలు చేసి దళితుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతుల నీటి కష్టాలు తీరాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నాయా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న ప్రతి పనిని అడ్డుకోవడమే ప్రతిపక్షాలు పనిగా పెట్టుకున్నాయని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలు ఎన్ని చిల్లర రాజకీయాలు చేసిన బీఆర్ఎస్ పార్టీ వైపే తెలంగాణ ప్రజలు ఉన్నారన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తొగరు బిక్షపతి తండ్రి తొగరు మల్లయ్య గుండెపోటుతో మృతి చెందగా, చెల్పూర్ గ్రామానికి చెందిన మొలుగురి సాంబయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను గురువారం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ గెల్లు శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్, జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ టంగుటూరి రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జన్మదినశుభాకాంక్షలు



వీణవంక, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా జిల్లా ఎంపిటీసీల ఫోరం అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక సంక్షేమపథకాలు అందించిన ఘనత సీఎం కెసీఆర్ ది అన్నారు. అలాగే ప్రజాక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం కెసీఆర్ కేంద్రంలో కూడా అధికారం చేపట్టి దేశ ప్రజలకు సుపరిపాలన అందించాలని కోరారు.

## పాడి కౌశిక్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన పాడి కౌశిక్‌రెడ్డిని గురువారం బీఆర్ఎస్ నాయకులు ఆయన నివాస గృహంలో మార్యద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు నందగిరి మహేందర్‌రెడ్డి, పంజాల సతీష్, టేకుల శ్రావన్, బండ నవీన్, చౌడమల్ల రోహిత్ తదితరులు ఉన్నారు.

## అవార్డు అందుకోనున్న సందమల్ల నరేష్



హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 16,(మనం న్యూస్): మున్సిపాలీటీ పరిధిలోని ఇందిరా నగర్ గ్రామానికి చెందిన సందమల్ల నరేష్‌ను కళా రంగంలో అందిస్తున్న సేవలను గుర్తించి కన్నతల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న గోవా ఇంటర్నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 26న గోవాలో ఈ అవార్డును అందుకోనున్నారు. వివిధమైన రంగాల్లో పనిచేస్తున్న కళాకారులను గుర్తించినందుకు గాను డాక్టర్ లయన్ మాదం పద్మజాదేవిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా జక్కని సంజయ్ కుమార్



శంకరపట్నం, ఫిబ్రవరి16 (మనం న్యూస్)బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా శంకరపట్నం మండలం, మొలంగూర్ గ్రామానికి చెందిన జక్కని సంజయ్ కుమార్ ను నియమిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జక్కని సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో శక్తి వంచన లేకుండా పనిచేస్తానని, తప్పక తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారాన్ని సాధిస్తామని తెలిపారు, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్ రాష్ట్ర కోఆర్డినేటర్లకు మిగతా రాష్ట్ర కమిటీ సభ్యులకు, అన్ని జిల్లాల అధ్యక్షులకు, ఇన్చార్జ్ లకు ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలి



చిగురుమామిడి, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ గీకురు రవీందర్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలలోని వందమంది విద్యార్థులకు 1997–98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పరీక్ష ప్యాడ్‌లను, పెన్నులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శోభారాణి, పూర్వ విద్యార్థులు పొగాలకు రమేష్, సందబోయిన వెంకటమల్లు, బుర్ర సతీష్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, లోక తిరుపతిరెడ్డి, చామకూర మహేందర్‌రెడ్డి, సంది శ్రీనివాస్‌రెడ్డి, గంగుల లింగం కుమార్ యాదవ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణరెడ్డి, మ్యాక కుమారస్వామి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# కరీంనగర్ పెద్దపల్లి

## ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 16,(మనం న్యూస్) : రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళబ్లులని ఎస్సీమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడిబాల్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ, దళితులకు మూడెకరాల భూమి, 57 సంవత్సరాలకు పెన్షన్ మంజూరు చేస్తా అని ఇలా అనేక హామీలు ఇచ్చి విస్మరించారన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాభివృద్దే ధ్యేయంగా బృహత్తర పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు గంగిశెట్టి రాజు, తూర్పాటి సాంబయ్య, నాగరాజు, దేవేందర్‌రావు, అంకటి వాసు, సంజీవరెడ్డి, పోతుల సంజీవ్, రమేష్, తుమ్మల శ్రీనివాస్, గంగిశెట్టి ప్రభాకర్, యాంసాని శశిదర్, బత్తిని రవీందర్‌గౌడ్, మాడ సదీప్, గంట సంపత్, బొరగాల సారయ్య తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న ప్రయోగ పరీక్షలు

- డీఐఈఓ.శ్రీధర్ సుమన్



కుమ్రంభీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రెండవ రోజు ప్రయోగ పరీక్షలు సజావుగా కొనసాగుతున్నట్లు జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ అన్నారు. మంగళవారం నాడు జిల్లా వ్యాప్తంగా 12 కేంద్రాల్లో రెండు పూటలా నిర్వహించిన ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించబడ్డాయని తెలిపారు. కాగజ్ నగర్, ఆసిఫాబాద్ లోని పలు పరీక్షా కేంద్రాలను డీఈసీ బృందం సందర్శించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. విద్యార్థులు ప్రయోగ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేట్లు పరీక్షా నిర్వాహకులు పై దృష్టి సారించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం మొత్తం 973 మంది విద్యార్థులకు గాను 904 మంది హాజరయ్యారు. 38 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం మొత్తం 901 మంది విద్యార్థులకు గాను 863 మంది హాజరయ్యారు. 38 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల పర్యవేక్షణలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు నైతం శంకర్, తిరుపతి మరియు నిర్వాహక సిబ్బంది పాల్గొన్నారు. ఇంటర్ బోర్డు నియమావళికి లోబడి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించి సంబంధిత నివేదికలు బోర్డుకు పంపించారు.

## వైభవంగా సామూహిక వివాహాలు

- దేశానికి కేసీఆర్ పరిపాలించేలా శ్రీనివాసుడు ఆశీర్వదించాలి
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): తెలంగాణ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విజయమ్మ పౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలను గురువారం జరిపించారు. గోదావరిఖనిలోని శ్రీకోదండ రామాలయంలో శ్రీనివాస్ కల్యాణం మహోత్సవంతో పాటు ఆరుజంటలకు సామూహిక వివాహాలను కన్నుల పండువగా, అంగరంగా వైభవంగా ఎమ్మెల్యే జరిపించారు. విజయమ్మ పౌండేషన్ ద్వారా పేద జంటలకు పుస్తే,మట్టెలు, బట్టలు, వివాహ సామాగ్రిని అందజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం పోలీస్ కమీషనర్ రాజేశ్వరీ హాజరై శ్రీశ్రీనివాసుని కల్యాణంలో పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు అంటే రాష్ట్ర మంతా పండుగ రోజు అని అన్నారు. ఆకలిచావులు, ఆత్మహత్యలు లేని తెలంగాణ రాష్ట్రం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్థిల్లేలా చూస్తున్నారన్నారు. కలియుగ ప్రత్యక దైవం శ్రీనివాసుని ఆశీస్సులతో కేసీఆర్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని ఆయన కోరుకున్నారు. కేసీఆర్‌కు రామగుండం ప్రజలు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రామగుండం నగరమేయర్ డా. బంగి అనిల్‌కుమార్, నాయకురాలు మూల విజయారెడ్డి, డిప్యూటి మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు,జడ్పిటీసీ ఆముల నారాయణ, మాజీ మేయర్ కొంకటి లక్ష్మినారాయణ, కార్పొరేటర్లు అడ్డాల స్వరూప రామస్వామిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎస్ఎంసీ చైర్మన్‌కు ఘన సన్మానం

చిగురుమామిడి,ఫిబ్రవరి 15,(మనంన్యూస్) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాజీ ఎస్ఎంసీ చైర్మన్ చెరుకు రాజయ్యను గురువారం ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ గీకురు రవీందర్‌లు శాలువాతో ఘనంగా సత్కారించారు. విద్యా కమిటీ చైర్మన్‌గా నాలుగు ంసవత్సరాల పదవి కాలంలో పాఠశాల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. దాతల సహాయంతో స్కూల్ గోడలకు పెయింట్ వేయించాన్నారు. ప్యాన్స్, కుర్చీలను సమకూర్చరన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శోభారాణి, పూర్వ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## మహబూబ్‌నగర్
### నారాయణపేట-వనపర్తి

## విలేకరులకు ఇల్లు, ప్లాట్లు కేటాయించాలని కలెక్టర్‌కు వినతిపత్రం
### వనపర్తి జిల్లా అఖిలపక్ష ఐక్యవేదిక



వనపర్తి, ఫిబ్రవరి 16, మనం ప్రతినిధి: వనపర్తి పట్టణ విలేకరులతో వారి జీవితాలతో రాజకీయం చేయకూడదని పరోక్షంగా అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు. గత కొంతకాలంగా విలేకరులకు కోరినచోట ప్లాట్లు, మరియు ఇల్ల స్థలాలు కేటాయించాలని జరుగుతున్న చర్చల్లో వారికి పూర్తి అవగాహనతో ప్రభుత్వంతో చర్చలు జరుపుతూ ముందుకు సాగుతున్న తరుణంలో నాలుగు సంవత్సరాలు ప్రజల కష్టాలు పట్టించుకో కుండా, ఇప్పుడు ఎలక్షన్ వస్తున్నాయని ఇప్పటివరకు ఎలాంటి పోరాటం కానీ ప్రభుత్వానికి సూచనలు చేయకుండా, విలేకరులకు ఇల్లు కేటాయించే సమయంలో రాజకీయం చేయడం తగదని,వారి అసోసియేషన్ లు, ప్రభుత్వాధికారులు, మరియు మంత్రి, మేధావులు కూర్చొని మాట్లాడుకుని ప్లాట్లు వెంటనే ఇవ్వాలని, అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేస్తున్నాడని గత నాలుగు సంవత్సరాల నుండి వనపర్తిలో ప్రజల తరపున పోరాడుతున్నది అఖిలపక్ష ఐక్యవేదికని, గతంలో విలేకరులకు ఇల్లు కావాలని పోరాడింది కూడా ఐక్య వేదికని ఇంతకాలం విలేకరులను చిన్నచూపు చూసినవారు ఇప్పుడే వారిపై ప్రాణం లేచి వచ్చినట్లుగా వారిపై రాజకీయం చేయడం తగదని,పత్రికా విలేకరులకు వారితో మాట్లాడి వారికి తగిన చోట వెంటనే ఇండ్లు కేటాయించాలని, పీర్లగుట్ట లో అనువైన స్థలంతో పాటు, నమ్మ చెరువు కట్ట, మరియు 86 సర్వే నంబర్లలో లో కూడా ఇవ్వాలని, త్రాగునీరు, రోడ్లు సకల సౌకర్యాలు కలిగించి త్వరగా ఇవ్వాలని అఖిలపక్ష ఐక్యవేదిక తరపున కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఏ.వో రాజేందర్ గౌడ్ కు వినతి పత్రం అందచేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సతీష్ యాదవ్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జానంపేట రాములు, రమేష్, పొట్టి నేనీ గోపాలకృష్ణ నాయుడు, కొత్తకోట మండల అధ్యక్షుడు డేవిడ్ రాజు, వనపర్తి మండల నక్క వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యన్నదానానికి 1లక్ష 50వేలు ఆర్థిక సహాయం అందజేసిన ఎంపీపీ తూడి మేఘారెడ్డి



వనపర్తి, ఫిబ్రవరి 16, మనం ప్రతినిధి: వనపర్తి జిల్లా కేంద్రంలోని చింతల హనుమాన్ దేవాలయం శివ దీక్ష సేవా సమితి శివ స్వాముల నిత్య అన్నదానం కోసం పెద్దమందడి ఎంపిపి తూడి మేఘారెడ్డి రూ.1లక్ష 50వేల రూపాయల ఆర్థిక సహాయంను శివ దీక్ష సేవా సమితి అధ్యక్షులు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి పరుశురాంలకు అందజేశారు. ఈ సందర్భంగా చింతల హనుమాన్ దేవాలయ శివ దీక్ష సేవా సమితి శివ స్వాముల నిత్యఅన్నదానం కోసం ఆర్థిక సహాయం అందజేసిన పెద్ద మందడి ఎంపిపి. తూడి మేఘారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి, బుచ్చన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ జయంతి




జడ్చర్ల, ఫిబ్రవరి 16, మనం న్యూస్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రెండవ సర్ సంఘ్ చాలక్ మాధవరావ్ సదాశివ్ గోల్వాల్కర్ జన్మదినాన్ని గురువారం కేశవ మాధవ ప్రేరణ సమితి ఆధ్వర్యంలో జడ్చర్ల ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. యజ్ఞంతో ప్రారంభమైన గోల్వాల్కర్ జన్మదిన వేడుకల సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచానికి జ్ఞాన బిక్ష పెట్టిన భారతదేశం అని ఎన్నో వేల సంవత్సరాలుగా దేశ ఆచార వ్యవహారాలను పాటిస్తూ సుఖంగా సంతోషంగా జీవించడానికి ఆనాదిగా వస్తున్న మన సంస్కృతి సంప్రదాయాలను మనం కాపాడుకొని భవిష్యత్ తరాలకు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో విభాగ సంఘ ఛాలక్ శ్రీనివాస్ రెడ్డి, ప్రచారక్, శివశంకర్, స్థలదాత గుండె రావు, ట్రస్ట్ కార్యదర్శి జగ్ పాల్ రెడ్డి, కోశాధికారి బాబు నాయుడు, సభ్యులు సురేష్, మహేశ్వర్ రెడ్డి, విట్టలయ్య, కృష్ణయ్య, కౌన్సిలర్ కుమ్మరి రాజు, కృష్ణారెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి... ప్రాణదాతలు అవ్వండి
### - ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ లయన్ నటరాజ్



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: రక్తదానం ద్వారా ఎంతో మందికి ప్రాణదానం చేయడానికి సాధ్యమవుతుందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ నటరాజ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తిరుమల హిల్స్‌లో ఉన్న ధన్వంతరి మెడికల్ కళాశాలలో నేడు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయానికి రక్తం దొరకక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి నెలకొని ఉన్నదని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం మూలంగా ఎంతో మంది కాపాడటానికి పరోక్షంగా సహాయం అందించిన వారమవుతామని అన్నారు. ఈ రక్తదాన కార్యక్రమంలో మొత్తంగా 45 యూనిట్ల రక్తం సేకరించినట్టు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ట్రెజరర్ జగపతిరావు, డైరెక్టర్ యాదయ్య గుప్తా, ధన్వంతరి కాలేజ్ ప్రిన్సిపల్ యశోద, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అవినాష్ హాజరయ్యారు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నేను పోటీ చేయడం ఖాయం

- ఎమ్మెల్యేపై యువకులు పోస్టులు పెట్టారని పోలీసులు వేధిస్తున్నారు
- ధరణి, రెవెన్యూ బీఆర్ఎస్ నాయకులకు కల్పవృక్షం
- భూమి మార్పిడిపై కలెక్టర్‌పై ఫిర్యాదు చేస్తాం
- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి



నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయడం ఖాయమని కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం నాగం స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పొలిటికల్ కామెంట్స్, ఇష్టాగోష్టి సమావేశంలో నాగం మాట్లాడారు. పాత మిత్రులు కలుస్తున్నారా అని పరోక్షంగా ఎమ్మెల్యే కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మీరు కలుస్తున్నారని ప్రచారం జరుగుతుందని ఇది వాస్తవమేనా అని నాగంను విలేకరులు ప్రస్తావించారు. దానికి ఆయన సమాధానమిస్తూ రాజకీయాల్లో ఏదైన జరగవచ్చు కలువవచ్చు అని ఆయన లెజిస్ట్రేటివ్ పదవిలో ఉన్నారని నేను కూడా లెజిస్ట్రేటివ్ పదవిలో ఉండేందుకు అవకాశం ఇవ్వాలి కదా అని భావిస్తున్నానని చెప్పారు. ఇద్దరు కలిస్తే గెలుస్తారని జనంలో టాక్ నడుస్తుందని ప్రస్తావించగా నేను ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయమని నాగం తేల్చి చెప్పారు. కాంగ్రెస్ జోడో యాత్రకు గ్రామాల లో విశేష స్పందన వస్తుందని టీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి ఏం లేదని కొద్దిగా మాత్రమే రోడ్లు వేశారని చెబుతున్నారని ఇప్పటి వరకు నా హయాంలో జరిగిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని నాగం చెప్పారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేపై వాట్సప్‌లో పోస్టులు పెట్టారని యువకులను వేదిస్తున్నారని శ్రీపురం గ్రామానికి చెందిన హమీద్ అనే అబ్బాయి వాట్సప్‌లో పెళ్లిళ్లపై వచ్చిన కామెంట్స్‌ను ఫార్వర్డ్ చేస్తే నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌కు పోలీసులు పిలిపించి ఇబ్బంది పెడుతున్నారని ఇదేం పద్ధతి అని నాగం ప్రశ్నించారు. ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పోలీసులను రాజకీయంలో ఆయుధంగా వాడుకుంటున్నాడని పోలీసులు లేకపోతే ఎమ్మెల్యే ఏ గ్రామంలో తిరగలేని పరిస్థితి ఉందని తప్పుడు కేసులు గ్రామాన పెట్టించాడని నాగం ఆరోపించాడు. పోలీసులు చట్ట ప్రకారం చేయాలి కానీ నోటీసులు లేకుండా పోలీస్టేషన్‌కు పిలిపించి భయభ్రాంతులకు గురి చేయడం సరైంది కాదని అన్నారు. పెళ్లిళ్ల విషయాన్ని ప్రస్తావిస్తూ తనపై అనవసరంగా ఏదో విధంగా బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఇది సరైంది కాదనీ సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని 50 సంవత్సరాలు డాక్టర్‌గా వైద్య సేవలు అందిస్తూ రాజకీయంగా ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈ ప్రాంత ప్రజలకు సహాయ సహకారాలు అందించానని, ఇదే విధంగా ఇప్పుడు చేస్తానని నాగం తెలిపారు. తన సొంత భూముల విషయంలో నాగనూలు శివారులోని 113,114,116,117 సర్వే నెంబర్లలో ఉన్న 8 ఎకరాల పై చిలుకు భూమిని వేరే వారి పేరు మీద ఆధారాలు లేకున్న పట్టా మార్పిడి చేశానని రాజకీయ జోక్యంతో జరిగిందని భావిస్తున్నానని నాగం అన్నారు. ట్రస్ట్ వ్యవహారంపై తాను ఫిర్యాదు చేసిన కాగితాన్ని పరిశీలించకుండా మార్పిడి చేశారని దీనిపై జిల్లా కలెక్టర్‌పై ఫిర్యాదు చేస్తానని నాగం తెలిపారు. ధరణి పోర్టల్ వల్ల వ్యవస్థ అంత కుప్పకూలిపోయిందని రెవెన్యూ, టీఆర్ఎస్ నాయకులకు కల్పవృక్షంగా మార్చిందని, రైతులను భూముల విషయంలో ఈ ధరణి వల్ల అనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాగం వివరించారు.గ్రామాలలో అభివృద్ధి చేసినవి ఏమి లేదని కేవలం వైకుంఠదామాలు, రైతు వేదికలు, మినిట్యాంక్‌బండ్‌లు ఇవే నిర్మించారు తప్పా అభివృద్ధి చేసిందేమి లేదని అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరుగుతుందని హాత్ సే హాత్ జోడో యాత్రలో కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అర్థం రవి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నారాయణ గౌడ్, బిజినపల్లి మండల కార్యదర్శి రాములు, సింగిల్‌విండోచైర్మన్ పాండు, తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ లావాదేవీలు ఎంతో సులభతరం
### డీఆర్‌డీఏ నరసింహులు




వనపర్తి, ఫిబ్రవరి 16, మనం ప్రతినిధి: డిజిటల్ లావాదేవీలు ఎంతో సులభతరం, సురక్షితమని, కాగా వాటి నిర్వహణలో జాగరూకత పాటించాలని డి ఆర్ డి ఏ నరసింహులు అన్నారు. అందులో భాగంగా గురువరం పాలిటెక్నిక్ కాలేజ్ నుండి నిర్వహించిన 2కే రన్‌ను ప్రారంబించారు. గో డిజిటల్ గో సెక్యూర్ అనే అంశంతో 2020–2025 నాటికి దేశమంతటా ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కలిగించి నగదు రహిత డిజిటల్ లావాదేవీలు నిర్వహించాలన్న సంకల్పంతో భారతీయ రిజర్వు బ్యాంక్ ఈ నెల 13 నుండి 17 వరకు సరైన ఆర్థిక వ్యవహారమే మిమ్మల్ని కాపాడుతుందన్న అంశంతో ఫైనాన్సియల్ లిటరసీ వారోత్సవాలు నిర్వహిస్తున్నదని అన్నారు. ఈ ర్యాలీలో లీడ్ బ్యాంక్ మేనేజర్ అమూల్ పవర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి ఆర్ డి ఏ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రజలను ఆర్థిక అక్షరాస్యత వైపు నడిపించాలని వ్యూహంతో రిజర్వు బ్యాంకు ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఇప్పుడు మీ చేతి వేళ్ళ ద్వారా డిజిటల్ బ్యాంకింగ్‌ను 365 రోజులు 24 గంటలు నెఫ్ట్/ ఆర్.టి.జి.ఎస్./ ఐ.ఏం.పి. స్.,/యు.పి .ఐ.ల ద్వారా నగదు రహిత లావాదేవీలు నిర్వహించుకోవచ్చని అన్నారు. అయితే సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మన బ్యాంక్ ఓ.టి.పిలు కాని, పిన్ నెంబర్లు కానీ గోప్యంగా ఉంచాలని, ఉచితంగా వచ్చే డబ్బులకు ఆశపడి వివిధ లింకులను తెరిచి మోసపోవద్దని అన్నారు. మోసపోయినట్లు భావిస్తే 1930, 14448 టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.ప్రతి ఒక్కరు తమ కుటుంబ అవసరాలకనుగుణంగా కావలసిన డబ్బు పై బడ్జెట్ అంచనా వేసుకొని, ముందు భవిష్యత్తు కోసం కొంత డబ్బును పొదుపు చేసే అలవాటు చేసుకోవాలని, ఆర్థిక క్రమశిక్షణ ద్వారా కుటుంబం సంతోషంగా ఉంటుందని అన్నారు. ర్యాలీల అన్ని బ్యాంకర్లు యుబీఐ, ఎస్‌బీఐ ఏపీజీవీబీ, కెనరా బ్యాంక్, యుసీవో, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఆక్సిస్ డీసీసీబీ, ఏడీఆర్‌డీవో శ్రీమతి రేణుక, డీపీఎం, ఏపీఎం, డీఆర్‌డీఏ బృందం, ఈపీఎంఏ బృందం, సీఎఫ్ఎల్ ఆత్మకూర్, కొత్తకోట మరియు పానగల్ బృందం కూడా పాల్గొన్నారు.

## దళితబంధు బుడుగ జంగాలకు ఇవ్వాలి
### ప్రభుత్వ పథకాలు నోచుకోని బుడుగజంగాలు
### కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న డిమాండ్



నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాగర్ కర్నూల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న దళిత బంధు నిధులు విడుదల చేయాలని దళిత బంధు అందరికీ దళితులతోపాటు బుడుగజంగాలు కూడా దళిత బంధు ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని నాగర్ కర్నూలు జిల్లా అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి ఆ సంఘం జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న మాట్లాడుతూ దళితులుతో పాటు బుడుగ జంగాలకు కూడా దళిత బంద్ ఇవ్వాలని కేటాయించిన దళిత బంధు 17700 నిధులను వెంటనే విడుదల చేసి రెండో విడత ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు నియోజకవర్గానికి 1500 యూనిట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. దళిత బంధు అర్ధరాత్రి చీకటి ఒప్పందాల ద్వారా వారి అనుయాయులకు పళ్ళెం లో పలహారం లాగా పంచుకుంటున్నారని, తక్షణమే కలెక్టర్ ద్వారా పారదర్శకంగా ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర దళిత బంధు 2021 జులై27న రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలోని 18లక్షల దళిత కుటుంబాలకు దళిత బంధు ఇస్తామని ప్రకటించాడని, నియోజవర్గానికి మొదటి విడత స్థాయిలో 100మందికి ఇవ్వడంతో అవికూడా రహస్యంగా ఎమ్మెల్యేలు మంత్రులు రహస్యంగా అధికార పార్టీ కార్యకర్తలకు పంచి పెడుతున్నారని విమర్శించారు ఎంపిక బాధ్యత జిల్లా కలెక్టర్ అధికారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఒక గ్రామములో ఒక్కరికి మాత్రమే దళిత బంధు రావడంతో మిగిలిన పేదలందరికి రాకపోవడంతో ఘర్షణలు జరుగుచున్నాయని విమర్శించారు 17700 కోట్ల రూపాయలతో దళితులందరికి ఎలా ఇస్తారని విమర్శించారు. మూడెకరాల భూమి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాలు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అటుకెక్కించిన ప్రభుత్వం దళిత బంధును కూడా వాగ్దానాల కె పరిమితం చేస్తాడనే అనుమానాలున్నాయని చెప్పారు. దళితులందరికీ రాజకీయాల కతీతంగా దళిత బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బి ఆర్ అధికారంలోకి వచ్చి8 ఏండ్లు కావొస్తున్న దళితులకు ఏ రాష్ట్ర ఈ ఇస్తానన్న డబ్బులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు మహేష్, హరికృష్ణ, శేఖర్, వెంకట్ రాములు, శివకృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కార మార్గంలో ప్రజలకు దగ్గరగా బీజేపీ
### - బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి



వనపర్తి, ఫిబ్రవరి 16, మనం ప్రతినిధి: వనపర్తి జిల్లా కేంద్రంలోని 33వ వార్డులోగురువారం శక్తి కేంద్ర ఇంచార్జ్ జ్ఞానేశ్వర్ అధ్యక్షతన శక్తి కేంద్ర కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, న్యాయవాది,రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క కుటుంబానికి చేరే విధంగా చూడాలని నరేంద్ర మోడీ పరిపాలన ప్రపంచ దేశాల్లోనే నెంబర్ వన్ గా ఉన్నదని వార్డులో ఏ వచ్చినా బిజెపి ముందు ఉంటుందని అన్నారు. సమస్య ల పట్ల బిజెపి పరిష్కార మార్గంలో ప్రజలకు దగ్గరగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం దురదృష్టకరమని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, వ్యవసాయదారులకు ఏకకాలంలో రుణమాఫీ చేయకపోవడం,57 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కెసిఆర్ ప్రభుత్వం పై ప్రజలు విసిగి పోయారని విమర్శించారు. దళితులకు దళిత బంధు ఇంతవరకు ఏ గ్రామంలో ఇచ్చారో చెప్పాలని దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వలేదని డబల్ బెడ్ రూమ్ ఇంతవరకు ఇవ్వలేదని రాష్ట్రంలో ప్రజలు అల్లాడిపోతున్న పట్టించుకునే పరిస్థితి మంత్రులకు ఎమ్మెల్యేలకు లేకుండా పోయిందని అవినీతి లో కూరుకుపోయారని తెలంగాణ రాష్ట్ర ప్రజలు కెసిఆర్ ను నమ్మే పరిస్థితి లేదని పెట్రోల్ పై పన్ను 36 రూపాయలు తీసుకుంటుందని సిలిండర్ పై 280 రూపాయలు తీసుకుంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లో ప్రజలు చైతన్వంతులు అయ్యారని నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవసాయదారులకి సబ్సిడీ కింద ఎరువులు ఇవ్వడం జరుగుతోందని అని రంగాల్లో వ్యవసాయదారులకు పంటల పై రేట్లు పెంచిందని కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం చెందిన వారి కుటుంబ సభ్యులందరికీ ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయలు చొప్పున ఆయుష్మాన్ భారత్ ఇస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 116 బూత్ అధ్యక్షులు బాలయ్య, 117 ఉప, పట్టణ బిజెపి అధ్యక్షులు బి రామ్మోహన్, పరుశురాం, జిల్లా ఉపాధ్యక్షురాలు సుమిత్రమ్మ,కార్యదర్శి పద్మమ్మ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కల్పన, అసెంబ్లీ కో కన్వీనర్ దాసరాజు ప్రవీణ్, వనపర్తి ఫుల్ టైమర్ అరవిందు బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి రాయన్న, మంగమ్మ,కవిత,సరోజ, వార్డు ప్రజలు యువకులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్
### గద్వాల-కల్వకుర్తి

## బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు
### - సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి వి.రజిని



వనపర్తి, ఫిబ్రవరి 16, మనం ప్రతినిధి: బాల్య వివాహాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి వి. రజిని హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలో బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్లో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు బాలురకు 21 సంవత్సరాలు నిండకుండానే వివాహాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే మైనర్‌లు కూడా వాహనాలను నడపరాదని వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి న్యాయస్థానంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉంటుందని అన్నారు. మహిళలు పిల్లలు ఎస్సీ ఎస్టీ ఆర్థికంగా వెనుకబడిన విపత్తులకు గురైన వారిని ఉచిత న్యాయ సేవలను ద్వారా అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంతోష్ కుమార్, వెంకటేష్, పరుశురాం, దయానంద్, నితిన్, రాఘవేందర్ అశోక్ బాలకృష్ణ కిషన్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ఇటుక బట్టీల్లో నలిగిపోతున్న వలస కార్మికులను ఆదుకోవాలి
### - సిఐటియు డిమాండ్



జడ్చర్ల, ఫిబ్రవరి 16, మనం న్యూస్: బ్రతుకు తెరువు కోసం వచ్చి ఇటుక బట్టీల్లో అలిగిపోతున్న వరుస కార్మికులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్యలు డిమాండ్ చేశారు. గురువారం జడ్చర్ల మండల పరిసర ప్రాంతాల్లో గల పలు ఇటుక బట్టీలను సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను పిలిపించి ఇటుక బట్టీల్లో 12 గంటల పాటు పని చేస్తున్నారని, వారి పిల్లలకు చదువు కానీ ఆరోగ్య సంబంధ టీకాలుగాని ఏ ఒక్కటి అందడం లేదని, ఇటుక బట్టీల వద్ద నివసించే వలస కార్మికులకు ఇటుక బట్టి యజమానులు కనీసం వసతులు కూడా ఏర్పాటు చేయడం లేదని, ఇకనైనా రెవెన్యూ అధికారులు, కార్మిక శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని కార్మికులకు వారి పనికి తగ్గ వేతనం, వైద్యం, విద్య, ప్రమాద బీమా తదితర వసతులు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మానవ సేవే మాధవ సేవ
### పెబ్బేరు షిరిడి సాయి బాబా ఆలయ కమిటీ లక్ష్యం

పెబ్బేరు, ఫిబ్రవరి 16, మనం న్యూస్: పెబ్బేరు పట్టణంలో శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానం నందు ప్రతి గురువారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం రోజు అన్నదాత గా బక్కోళ్ల అభిరాం సాగర్ జన్మదిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులు భక్కోళ్ల చంద్రశేఖర్ ధర్మపత్ని కవిత దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అన్నదాన కార్యక్రమంలో ఈ అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున మాలధారణ శివ స్వాములు అదే విధంగా పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రతి గురువారం బాబా ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో చెప్పారు. అదేవిధంగా ప్రతి గురువారం రాత్రి ఏడు గంటల నుంచి బాబా పల్లకి సేవ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు ఉంటాయని పేర్కొన్నారు పెద్ద ఎత్తున ప్రతి గురువారం భక్తాదులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని శిరిడి సాయి ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## యువత సేవలు అభినందనీయం
### ముగిసిన శివ స్వాముల వైద్య శిబిరం

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 16, మనం న్యూస్: శివ స్వాములకు ముస్లీం యువకులు సేవలందించడం అభినందనీయమని, మత సామరస్యానికి నిదర్శనమని నాగర్‌కర్నూల్ సబ్ జైలు సూపరింటెండెంట్ బీ.నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో సవేరా మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం ముగిసిన సందర్భంగా నిర్వహించిన సభలో అయన మాట్లాడారు. శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కాలి నడకన వెళ్లే శివ స్వాములకు జిల్లా కేంద్రంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి వారికి నొప్పులు, కాళ్ల బుగ్గలు, నొప్పులకు స్వతహాగా సేవలందించడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరాలు ప్రథమ చికిత్స అందిస్తున్న ఈ సంఘం సభ్యులను అభినందించారు. శిబిరంలో సేవలందించిన వైద్యసిబ్బంది, సంఘం యువకులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అరబ్బీ పాఠశాల కార్యదర్శి సయ్యద్ రఫియొద్దీన్, లాయన్స్ క్లబ్ సభ్యులు శ్రీధర్, సామజిక కార్యకర్త రాజశేఖర శర్మ, సంఘం కోశాధికారి షర్ఫుద్దీన్, సభ్యులు అష్రఫ్, గౌస్ పాషా, మహమూద్, ముంతాజ్, ఇమ్రాన్, ముస్లిం హక్కుల సాధన సమితి అధ్యక్షులు ఎం.డి. నిజాం పాల్గొన్నారు.

## పల్లీలు, ఉల్వాలతో కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు




వనపర్తి, ఫిబ్రవరి 16, మనం న్యూస్: ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను వినూత్నంగా నిర్వహించేందుకు వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు సిద్ధమయింది. మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు బాంధవుడికి జన్మదిన శుభాకాంక్షలు పేరుతో 25 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పు కేసీఆర్ చిత్రపటాన్ని వేరుశెనగ, ఉల్వాలు, ఉప్పు, రంగులతో రూపొందించారు. వనపర్తి మార్కెట్ యార్డులో రైతులతో పెద్ద ఎత్తున జన్మదిన వేడుకలు నిర్వహించనున్నారు.

### పోలీస్ అధికారులు, సిబ్బంది

# తమ ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

- **భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ డాక్టర్ వినీత్.జి**
- **జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో పోలీసుల మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎస్పీ**

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 16, (మనం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా పోలీసు శాఖలో పని చేసే అధికారులు, సిబ్బంది కొరకు గురువారం ప్రత్యేక మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు జిల్లాలోని పోలీసులందరికి వైద్య పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.జి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులలో నిమగ్నమై ఉంటున్న పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా వారికోసం ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా పోలీసు శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుండె, ఊపిరితిత్తులు, ఎముకలు, న్యూరాలజీ, కంటి చికిత్సలు మరియు ఇతర ఆరోగ్య సంబంధిత చికిత్సల కొరకు నిపుణులైన వైద్యులను పిలిపించి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అన్ని రకాలుగా కృషి చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు.ఇక్కడ వైద్య పరీక్షలలో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు నిర్ధారించబడిన అనంతరం, వారిని పోలీసు శాఖ తరపున మెరుగైన చికిత్స చేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన వైద్య బృందానికి,పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నూతనంగా నిర్మితమవుతున్న పోలీస్ అతిధి గృహం నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరలోనే అన్ని రకాల క్రీడలకు సంబంధించిన సౌకర్యాలను అందిస్తామని కూడా ఈ సందర్భంగా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, ఏఆర్ డిఎస్పీ విజయ్ బాబు, భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్, కొత్తగూడెం డిఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ వెంకటేష్, ఇల్లందు డిఎస్పీ రమణ మూర్తి మరియు సిఐలు, ఆర్ఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



# డోర్నకల్ మండలంలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన

డోర్నకల్, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): డోర్నకల్ మండలం తోడేళ్ళగూడెం గ్రామంలో గత స్వయంభుగా వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం నియోజకవర్గ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ 50 లక్షల నిధులు కేటాయిస్తామని అన్నారు. గ్రామ సర్పంచ్ పగడాల అంజయ్య, గ్రామ ప్రజల కోరిక మేరకు ఆలయ పరిసరాలను పరిశీలించి నిధులు కేటాయిస్తామని అన్నారు. అనంతరం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా సాధారణ మరణం పొందిన బొడ్డు వెంకన్న పాలసీ చేసినందుకు కంపెనీ ద్వారా వచ్చిన బీమా చెక్కును భార్య బొడ్డు కల్పనకు నియోజకవర్గ ఎమ్మెల్యే రెడ్యానాయక్ చేతుల మీదుగా4,15,500 రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నున్న రమణ,మున్సిపల్ చైర్మన్ వీరన్న,జడ్పిటిసి కమల రామనాథం,సత్తిరెడ్డి, కో ఆప్షన్ లాల్ మియా, గ్రామం బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**నూతన పాఠశాలను ప్రారంభించిన రెడ్యా నాయక్**

డోర్నకల్ మండలం వెన్నారం గ్రామంలో మన ఊరు మన బడి ప్రారంభోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ పాల్గొన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కోసం టాయిలెట్లు, వంటగది తరగతి గదులు మరమ్మత్తులు నూతనంగా ఏర్పాటుచేసిన విద్యార్థులు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేయడంపై సర్పంచ్ బోయినపల్లి వెంకన్నను అభినందించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలను ఆదర్శ పాఠశాలలు గా తీర్చే విధంగా మన ఊరు మనబడిని ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణ తరగతిని పరిశీలించిన రెడ్యా నాయక్ గదిలో టీచర్ గా బోర్డుపై రాస్తూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి 18.65 లక్షలు ఖర్చు చేశామని రాబోయే రోజులలో పాఠశాలకు తరగతి గదులు పెంచడానికి నావంతు సహాయం చేస్తానని, ఇంతకుముందు పాఠశాలలో చాలా మార్పులు కనిపించాయని, పాఠశాల సుందరంగా ఉన్న పాఠశాల ఉపాధ్యాయుల బృందాన్ని, గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని రెడ్యా నాయక్ అభినందించారు , పాఠశాల అనంతరం ఉపాధ్యాయులు రెడ్యా నాయక్ ని శాలువాతో సన్మానించారు. నున్న రమణ,ఎంపీపీ బాలు నాయక్, మున్సిపల్ చైర్మన్ వీరన్న,జడ్పీటీసీ కమలా రామనాథం, గార్ల సత్తిరెడ్డి, ఎమ్మెల్సీ అపర్ణ, ఎంపీడీవో స్వాతి బిందు, రామ తండ గ్రామ సర్పంచ్ బద్రు నాయక్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సత్తిరెడ్డి,శెట్టి వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాసర్ల శ్రీను,స్కూల్ వైస్ చైర్మన్ భట్లు వీరన్న పాఠశాల ఉపాధ్యాయులు నాయకులు,పార్టీ కార్యకర్తలు ఉన్నారు.





## వరిగడ్డి దగ్ధం



వైరాటౌన్, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): మండల పరిధిలోని పాలడుగు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర ట్రాక్టర్ పై వెళ్తున్న వరిగడ్డి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధమైంది.ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి గన్నవరం గ్రామానికి చెందిన కోరే వెంకటేశ్వర్లు అనే రైతు తన సొంత ట్రాక్టర్ పై వరిగడ్డి లోడ్ చేసుకుని పాలడుగు గ్రామం జిల్లా పరిషత్ పాఠశాల వద్దకు రావడంతో విద్యుత్ వైర్ తగిలి వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. సంఘటన స్థలంలో ట్రైనీ కలెక్టర్ రాధిక గుప్త ప్రత్యేక చొరవ తీసుకొని పాఠశాల విద్యార్థులకు ఎటువంటి హాని సంభవించకుండా మంటలను ఆర్పడానికి వెంటనే పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. పంచాయతీ సిబ్బంది అప్రమత్తమై ట్యాంకర్ తో నీళ్ళు తీసుకొచ్చి మంటలను ఆర్పి వేశారు. దగ్ధమైన వరిగడ్డి విలువ సుమారు 15000 ఉంటుందని అంచనావేసారు.ఈ ఘటనలో ఎటువంటి ప్రాణం నష్టం జరగలేదు. సంఘటన స్థలంలో మండల ఎంపీఓ జోస్నా దేవి, సర్పంచ్ శీలం రమాదేవి, కార్యదర్శి గరికపాటి కుమార్,అగన్వాడి టీచర్ రేణుక పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## ఎక్కడ త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

- **మున్సిపల్ కమిషనర్ డాక్టర్ రమణాచారి**




నల్లగొండ, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి): వేసవి సమీపిస్తున్న తరుణంలో త్రాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కేవీ రమణాచారి సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు.గురువారం మున్సిపల్ శాఖ ఇంజనీర్ లు, ఫిట్టర్, లైన్మెన్ల తో మున్సిపల్ సమావేశ మందిరంలో రివ్యూ సమావేశం ఏర్పాటు చేసి నల్లగొండ పట్టణంలో నీటి సప్లై పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ల కెపాసిటీ ఆధారంగా నల్లగొండ పట్టణంలో రోజు విడిచి రోజు నీటిని సప్లై చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిరోజు ఒక వ్యక్తికి 135 లీటర్ల నీటిని అందించాల్సి ఉండగా రెండు రోజులకోసారి 270 లీటర్లకు పైనే నిటిని అందిస్తున్నామని తెలిపారు.జనాభాను బట్టి ప్రతిరోజు 30 ఎమ్ ఏల్ డి నీటిని డ్రా చేయాలని ఉన్నప్పటికీ 35ఎం ఏల్ డి(3.50 కోట్లు) నీటిని డ్రా చేసి పట్టణంలోని సుమారు 40 వేలకు పైగా గృహాలకు నీటిని సప్లై చేస్తున్నామని వివరించారు. నీరు లేని ప్రాంతాలు, కొత్తగా వెలసిన కాలనీలు ఐదు శాతం ఉంటాయని అక్కడ నీటిని సప్లై చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పవర్ బోర్ లు 200 కు పైనే ఉన్నాయని, 400కు పైగా ఉన్న చేతి పంపులను వెంటనే రిపేర్ చేయించాలని సిబ్బందికి సూచించారు. నల్లగొండ టౌన్ లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులతో పాటు, ట్యాంక్ పరిసర ప్రాంతాలను కూడా శుభ్రం చేయాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పట్టణ ప్రజలు నీటిని వృధా చేయకుండా కుళాయిలను వెంటనే కట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. నల్ల బిల్లుల బకాయిలు పెండింగ్లో ఉన్నవారు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ ఈఈ రాములు, డిఇ వెంకన్న, ఏఈ దిలీప్, మున్సిపల్ శాఖ పిట్టర్లు, లైన్మెన్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆదా చేద్దాం.. ఆటో స్టాటర్లు తొలగిద్దాం

- **విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ రెడ్డి**



కరకగూడెం, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): మండలంలో నాణ్యమైన నిరంతర విద్యుత్తు అందించడంలో మాకు సహాయ సహకారాలు అందించాలని రైతులు తక్షణమే ఆటో స్టాటర్లు తొలగించాలని విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ రెడ్డి రైతులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విద్యుత్ అవసరాల కొరకు ప్రభుత్వం విద్యుత్ సంస్థల నుండి ఒక యూనిట్ 10 రూపాయల దగ్గర నుండి 14 రూపాయలు ఖర్చుపెట్టి విద్యుత్ కొనడం జరుగుతుందని నెలకు సరాసరి 1500 కోట్ల రూపాయలను విద్యుత్ సంస్థ చెల్లిస్తుందని ఆయన తెలిపారు. రైతులకు నిరంతరంగా విద్యుత్ అందిస్తున్నామని, రైతులు విద్యుత్ ఆటో స్టాటర్లు వాడటం వల్ల ఒకవైపు నీరు మరొకవైపు విద్యుత్ వృధాగా ఖర్చు అవుతుందని ఆయన అన్నారు. వేసవిలో రైతులకు విద్యుత్ అందించడం కోసం విద్యుత్ సంస్థ రైతులకు విన్నపం చేస్తుందని, ఆటో స్టాటర్లు తీసివేసి ఆన్ ఆఫ్ స్టార్టర్లు వాడుకోవాలని కోరింది నిరంతరం అవసరం లేకున్నా వినియోగించడం వలన మార్చి నెలలో నీటి నిల్వలు తగ్గి పంటలు ఎండిపోయే అవకాశం ఉందని ఆయన తెలిపారు. విద్యుత్ సంస్థకు రైతులకు చెడ్డ పేరు రాకుండా రైతులు తమ పంటలను పండించుకోవడానికి కరెంటు వృధా తగ్గించుకోవడానికి తక్షణమే ఆటో స్టాటర్లను తొలగించాలని ఆయన వేడుకున్నారు.

### రూరల్‌లో వైయస్సార్ తెలంగాణ పార్టీ

# కార్యాలయాన్ని ప్రారంభించిన వైయస్ విజయమ్మ





ఖమ్మం, ఫిబ్రవరి 16, (మనం బ్యూరో): ఖమ్మం రూరల్ ప్రాంతం సాయి గణేష్ నగర్ లో గురువారం వైయస్సార్ తెలంగాణ పార్టీ కార్యాలయాన్ని వైయస్ విజయమ్మ ప్రారంభించి మాట్లాడారు తాత్కాలిక కార్యాలయాన్ని పాలేరులో ప్రారంభించుకున్నాం అని జూన్ 8న మన సొంత కార్యాలయం ప్రారంభించుకుందాం అన్నారు . వైయస్సార్ ప్రతి క్షణం పేదల గురించే ఆలోచించే వారు రాజన్న కుటుంబం అంటే జగమంత కుటుంబం అని తన జీవితంలో మాట తప్పని , మడమ తిప్పని వైయస్సార్ . ఆయన అడుగుజాడల్లో నడుస్తున్న షర్మిల కూడా మాట ఇస్తే ఎందాకైనా వెళ్తారు అని అన్నారు . చిత్తశుద్ధితో రాజకీయాలు చేయాలనే షర్మిల ప్రజాప్రస్థానం అని, ఎన్ని అవమానాలు చేసినా అన్నింటా నుందుకే అడుగేస్తుందని అన్నారు. ప్రజాప్రస్థానం 4వేల కిమీ , అంతకు ముందు 3వేల కిమీ షర్మిల నడక వైయస్సార్ బంగారు పాలన కోసమే అని పేర్కొన్నారు . షర్మిల అడ్రస్ ఎక్కడా అంటే పాలేరు అనే చెప్తున్నాం . రానున్న రాజకీయాలకు షర్మిల పాలేరు నిర్ణయం గుమ్మం అవుతుందన్నారు. ప్రతి కుటుంబంలో షర్మిల ను గుండెలలో పెట్టుకుంటారు .షర్మిల 4కోట్ల తెలంగాణ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. వైయస్సార్ ప్రేమా , మానవత్వం షర్మిల ప్రజలకు పంచుతోంది. పాలేరు నుండే తెలంగాణను పరిపాలిస్తుంద న్నారు. మంచి నాయకులుంటే మంచి పరిపాలన రాష్ట్రంలో ఉంటుందన్నారు. వైయస్సార్ కు పాలేరుకు రూణానుబంధం ఉంది . ఎల్లప్పుడూ ఖమ్మం జిల్లా మాకు అండగానే నిలిచిందన్నారు. ఎప్పుడో వైయస్సార్ పాలనలో మొదలెట్టిన ప్రాజెక్టులు ఇప్పటిదాకా పూర్తి చేయలేక పోయారు. షర్మిల చేతి మీదుగానే అవి ప్రారంభ మౌతాయనుకుంటా అని అన్నారు. ఆంధ్రాలో పులివెందుల ఎలానో, తెలంగాణ లో పాలేరు అలానే అని అన్నారు . ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టిపి నాయకులు పాల్గొన్నారు.

# శివరాత్రి జాతరకు ముస్తాబైన కురవి పుణ్యక్షేత్రం

- **18న భద్రకాళి సమేత వీరభద్రుని కళ్యాణ మహోత్సవం**
- **జాతరకు వచ్చే భక్తజనానికి భారీగా ఏర్పాట్లు**





కురవి, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ జిల్లా లోని కురవి మండల కేంద్రంలో శ్రీ శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం ముస్తాబయింది. కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా అశేష గిరిజన ఆరాధ్యదైవంగా ఆపదలో ఉన్నవారు పిలిస్తే పలికే దైవం గా సంతాన సాఫల్యం వరాలిచ్చే కలియుగ కల్పతరువుగా గిరిజన ఆరాధ్యదైవమైన కురవి వీరభద్ర స్వామి కళ్యాణం శివరాత్రి రోజు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు పోటెత్తిన భక్త జనంతో కురవి మహాక్షేత్రం కిటకిటలాడుతుంది

**జాతరకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు : ఆలయ ఈవో సత్యనారాయణ**

జాతరకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏ సత్యనారాయణ తెలిపారు భక్తులకు వసతి గృహాలు ఏర్పాట్లు పోలీసు బందోబస్తు స్వామివారి దర్శనానిక్షి సౌకర్యం భక్తులకు ఉచిత వైద్య సౌకర్యం మహబూబాద్ ఖమ్మం సూర్యాపేట ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సు సౌకర్యం కూడా ఉన్నట్లు ఫిర్యాదులపై విచారణ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈ ఓ సత్యనారాయణ తెలిపారు. ఈ ఉత్సవాలకు మంత్రులు డీఎస్ రెడ్యానాయక్, మంత్రి సత్యవతి రాథోడ్ రానున్నారు వీఐపీల తాకిడితో కురవి మహాక్షేత్రం వెలుగు జిలుగుల మధ్య దేదీప్యమానంగా వెలుగొందుతుంది

**ఆలయ చరిత్ర**

రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రాలలో పేరుపొందిన కురవి మహా క్షేత్రం 850 సంవత్సరాల క్రితం చాళుక్యులకు సామంత రాజైన భీమరాజు కొరివి రాజధానిగా చేసుకుని పాలించిన కాలంలో ఈ క్షేత్రం నిర్మించినట్లు చరిత్రాత్మక ఘట్టాలు చెపుతున్నాయి చరిత్ర కలిగిన శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం వేంగి చాళుక్యుల అనంతరం కాకతీయ తొలి స్వతంత్ర హాజరైన ఒకటవ బేతరాజు జీర్ణోద్ధరణ చేయగా రెండవ బేతరాజు కురివి కి అనుకోని ఉన్న పెద్ద చెరువు సంభవించినట్లు అదో ఘట్టం కురవి అనగా గోరింటాకు లేదా ఎరుపు అని అర్థం రాణి రుద్రమదేవి వీరభద్ర స్వామిని దర్శించుకొని ఆశీస్సులు పొందునట్లు మార్కోపోలో రాతలతో తెలుస్తుంది వరాల ప్రదాత సకల శక్తి సంపన్నుడు వీరభద్ర స్వామి వారు ఈ క్షేత్రంలో పడమటి ముఖస్తుడై, దశహస్తుడై, త్రినేత్రుడై, రౌద్ర రూపంలో దర్శనమిస్తాడు. దక్షణ హస్తంలో ఖడ్గం రెండో హస్తంలో త్రిశూలం, మూడవ హస్తం లో పుష్పం, నాలుగవ లో హస్తంలో బాణము ఐదవ ఐదోవ హస్తంలో మృదంగము ధరించి భక్తుల పాలిటి కల్పతరువుగా వెలుగొందుతున్నాడు స్వామిని తరించిన వారికి తలచిన వారికి సమస్త భూత, ప్రేత, పిశాచ, గణాలు, శాకిని, డాకిని, కామిని , వంటి ప్రమాద గణ పిశాచాలు స్వామివారి ఆదినం వీరభద్ర స్వామిని దర్శించుకున్న వారికి పిశాచ బాధలు సర్వదోషాలు క్షుద్ర శక్తులు దరికి చేరవు స్వామివారి పాదముల కింద అ నందీశ్వరుడు స్వామివారి వాహనముగా వెలసియున్నాడు స్వామివారికి ఎడమవైపు చతుర్భుజములు కలిగి భద్రకాళి అమ్మవారు దర్శనమిస్తారు దేశంలో పలు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఈ క్షేత్ర సందర్శనకు విచ్చేస్తుంటారు దక్షిణాదిలో విశిష్ట స్థానం కలిగి నా కొరివి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో నిత్యం పూజలు జరుగుతూనే ఉంటాయి మహబూబాద్ జిల్లాలోని గిరిజనలు వీరభద్ర స్వామి మరింత ప్రీతిగా ప్రతి ఏడాది మహాశివరాత్రి రోజు నా ఇక్కడ మహా జాతర ప్రారంభమవుతుంది మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని స్వామివారి కళ్యాణం ఆలయ నిర్వాహకులు ఆలయ ధర్మకర్త మండలి అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు జాతరకు వచ్చే భక్తజనానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తారు తాగునీరు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు స్వామివారి కళ్యాణం రోజున పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తారు.

## ఖమ్మం కొత్తగూడెం

### బాలాజీ ఎస్టేట్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ



ఖమ్మం, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): బాలాజీ ఎస్టేట్ ఆధ్వర్యంలో ముత్తగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు, ఉచితంగా పరీక్ష ప్యాడ్లు అందజేశారు. పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థిని విద్యార్థులకు ఇంపాక్ట్ ఫౌండేషన్ మోటివేషనల్ స్పీకర్ పంజాల ఐలయ్యతో విద్యార్థులకు అవసరమైన స్టడీ స్కిల్స్, మెమరీ టెక్నిక్స్, గోల్ సెట్టింగ్స్,టైం మేనేజ్మెంట్ మొదలైన అంశాలపై బోధించి, విద్యార్థులకు మంచి మార్కులు సాధించుట మరియు పలు సూచనలు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకదుర్గ తెలిపారు. ఇటువంటి మోటివేషనల్ తరగతులు ఈ పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు తెలిపారు. మోటివేషన్ తరగతి అనంతరం శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ఖమ్మం ఎం.డి వత్సవాయి రవి అందించిన పరీక్ష ప్యాడ్ లను విద్యార్థులకు అందజేసినారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అంశాలను, పరీక్ష ప్యాడ్ లను అందించిన స్పీకర్ కి, వత్సవాయి రవికి పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో సీనియర్ మార్కెటింగ్ డైరెక్టర్ కాసాని శ్రీశైలం, మార్కెటింగ్ మేనేజర్ ఓరుగంటి నరసింహా రావు, కొత్త చంద్రన్న గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కళ్యాణలక్ష్మి చెక్కులు, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



ములకలపల్లి, ఫిబ్రవరి 16, (మనం న్యూస్): అశ్వారావుపేట శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావు గురువారం మండలంలో విస్తృతంగా పర్యటించారు.పలు పబ్లిక్,ప్రైవేట్ కార్యక్రమాలతో బిజీ బిజీగా గడిపారు.ముందుగా జగన్నాధపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మంగపేటలో రూ 1.56 కోట్లతో నిర్మించనున్న ప్రైమరి హెల్త్ సెంటర్ కి భూమి పూజ చేశారు.మంగపేట హాస్పిటల్లో గర్భిణీ స్త్రీలకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను అందజేశారు.తర్వాత స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణి లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి 19 మంది లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని పలు ప్రైవేట్ కార్యక్రమాలలో పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మోరాంపూడి అప్పారావు, ఎంపీటీసీ మెహర,సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



మంథని, ఫిబ్రవరి 16, మనం న్యూస్: మంథని మున్సిపల్ పరిధిలోని ఐదవవార్డు కూచిరాజుపల్లి ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా చైర్మన్ పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ గురువారం ప్రారంభించారు. ప్రజలకు వైద్యులచే కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐదవవార్డు కౌన్సిలర్ నక్క నాగేంద్ర-శంకర్,నాలుగవ వార్డ్ కౌన్సిలర్ కుర్ర లింగయ్య, టిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు బుద్దార్తి రాణి, మున్సిపల్ కమిషనర్ శారధ, వైద్యులు శంకర మ్మ, సతీష్, కుమార్, ఏఎన్ఎం లలిత, సునీత, డిసిఓ సతీష్, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# నిర్దేశించిన ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి
- కంటి వెలుగు ప్రిస్క్రిప్షన్ కళ్ళద్దాల పంపిణీ త్వరగా పూర్తి చేయాలి
- ఫిబ్రవరి 26 నాటికి పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయాలి
- పోడు పట్టాల పంపిణీ కొరకు పాస్ పుస్తకాల ముద్రణ ప్రారంభించాలి
- జీఓ 58 అర్హులకు భూ క్రమబద్ధీకరణ పత్రాల పంపిణీ ప్రారంభించాలి




వనపర్తి, ఫిబ్రవరి 16, మనం ప్రతినిధి: నిర్దేశించిన ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే దిశగా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి కంటి వెలుగు, పోడు భూములు, 58, 59, 76, 118 ప్రభుత్వ జి.ఓ. ల ప్రకారం చేయవలసిన క్రమబద్దీకరణ, తెలంగాణకు హరితహారం, రెండు పడక గదుల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుండి పాల్గొన్నారు. సి.ఎస్. మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు శిబిరాల నిర్వహణ పట్ల శ్రద్ద వహించాలని, రానున్న వేసవి దృష్టిలో ఉంచుకొని శిబిరాల వద్ద అవసరమైన చల్లని నీరు, ఓఆర్ఎస్ ను అందుబాటులో ఉంచడం వంటి ముందు జాగ్రత్త ఏర్పాట్లు చేయాలని సీఎస్ అన్నారు. జిల్లాలకు కంటి వెలుగు ప్రిస్క్రిప్షన్ కళ్ళద్దాల పంపిణీ జరుగుతుందని, వాటిని సదరు లబ్దిదారులకు అందించిన తరువాత లబ్దిదారుని ఫోటో వెబ్ సైట్‌లో అప్ లోడ్ చేయాలని సూచించారు. రాష్ట్రంలో జీహెచ్ఎంసీ మినహాయించి పట్టణ ప్రాంతాలలో నిర్మించిన 42 వేలకు పైగా రెండు పడక గదుల ఇండ్ల లబ్దిదారులను కేటాయింపు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 6 వేల 620 మాత్రమే జరిగిందని, ఫిబ్రవరి 26 నాటికి పెండింగ్‌లో ఉన్న ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి చేసి వివరాలు ఆన్ లైన్‌లో అప్ లోడ్ చేయాలని సీఎస్ అన్నారు. ప్రభుత్వం అందించిన ప్రోఫార్మా 1 ప్రకారం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమాచారం త్వరితగతిన అందించాలని, అధికారులు వారి దగ్గర ఉన్న సమాచారం మేరకు నివేదిక తయారు చేయాలని సీఎస్ తెలిపారు. పోడు భూముల పట్టాల పంపిణీ కొరకు జిల్లా స్థాయి కమిటీ వద్ద పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు త్వరగా ఆమోదించాలని సీఎస్ సూచించారు. జిల్లాలో ఆమోదించిన దరఖాస్తులో పట్టాదారు ఫోటో, ఇతర వివరాలు పాలిగాన్ చెక్ చేసి, సరిగ్గా ఉన్న దరఖాస్తులు వెంటనే పట్టా పాస్ పుస్తకాల ముద్రణకు పంపాలని సీఎస్ అన్నారు. తెలంగాణకు హరితహారం క్రింద వచ్చే సంవత్సరంలో అవసరమైన మొక్కల పెంపకం నర్సరీలో పూర్తి చేయాలని సీఎస్ అన్నారు. జిల్లాలో మొక్కలు నాటే స్థలాల గుర్తింపు, రిజిస్ట్రేషన్ వంటి అంశాలు పక్కాగా జరిగేలా ప్రణాళిక సిద్ధం చేయాలని, వేసవిని దృష్టిలో పెట్టుకొని మొక్కల సంరక్షణ అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా జీఓ 58 ప్రకారం ఆమోదించిన దరఖాస్తుదారుల పట్టాలను స్థానిక మంత్రి, ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో పంపిణీ పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల ధృవీకరణ పూర్తి చేయాలని, ఫీల్డ్ వెరిఫికేషన్ వంద శాతం పూర్తి కావాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ అధికారులకు ,మున్సిపల్ కమిషనర్లు, యం.ఆర్.ఓ లకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కంటి వెలుగు కింద ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు ఎప్పటి కప్పుడు అందించాలని, జిల్లాకు వచ్చిన ప్రిస్క్రిప్షన్ కళ్ళద్దాలను ఏ.ఎన్.ఎం. ల వారీగా విభజించి లబ్దిదారులకు పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ జీవో 58 59 పై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో పద్మావతి, డీఎంహెచ్వో రవిశంకర్, డి ఎఫ్ ఓ రామకృష్ణ, డి టి డి ఏ శ్రీనివాస్, పి ఆర్ ఈ ఈ మల్లయ్య, డీఆర్డీఏ నరసింహులు డిపిఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**26 నాటికి పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూంల లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయాలి**

ఈ నెల 26వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి కంటి వెలుగు, పోడు భూములు, ప్రభుత్వ జిఓల ప్రకారం చేయవలసిన క్రమబద్దీకరణ, తెలంగాణకు హరితహారం, రెండు పడక గదుల నిర్మాణాలపై ఆమె జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు శిబిరాల నిర్వహణ పట్ల శ్రద్ధ వహించాలని, రానున్న వేసవి దృష్టిలో ఉంచుకొని శిబిరాల వద్ద అవసరమైన చల్లని నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచడం వంటి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలకు కంటి వెలుగు ప్రిస్క్రిప్షన్ కళ్ళద్దాల పంపిణీ జరుగుతుందని, వాటిని సదరు లబ్దిదారులకు అందించిన తరువాత లబ్దిదారుని ఫోటో



సూచించారు. జిల్లాలో ఆమోదించిన దరఖాస్తులో పట్టాదారు ఫోటో, ఇతర వివరాలు పాలిగాన్ చెక్ చేసి, సరిగ్గా ఉన్న దరఖాస్తులు వెంటనే పట్టా పాస్ పుస్తకాల ముద్రణకు పంపాలని అన్నారు. తెలంగాణకు హరితహారం క్రింద వచ్చే సంవత్సరంలో అవసరమైన మొక్కల పెంపకం నర్సరీలో పూర్తి చేయాలని సీఎస్ అన్నారు. జిల్లాలో మొక్కలు నాటే స్థలాల గుర్తింపు, రిజిస్ట్రేషన్ వంటి అంశాలు పక్కాగా జరిగేలా ప్రణాళిక




వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయాలని సూచించారు. రాష్ట్రంలో జీహెచ్ఎంసీ మినహాయించి పట్టణ ప్రాంతాలలో నిర్మించిన 42 వేలకు పైగా రెండు పడక గదులను లబ్దిదారులను కేటాయించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 6 వేల 620 మాత్రమే కేటాయించినట్లు వివరించారు. ఈ నెల 26వ తేదీ నాటికి పెండింగ్ లో ఉన్న ఇండ్లకు సంబంధించి లబ్దిదారుల ఎంపిక పూర్తి చేసి వివరాలు ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలని శాంతికుమారి సూచించారు. ప్రభుత్వం అందించిన ప్రోఫార్మా 1 ప్రకారం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమాచారం త్వరితగతిన అందించాలని, అధికారులు వారి దగ్గర ఉన్న సమాచారం మేరకు నివేదిక తయారు చేయాలని తెలిపారు. పోడు భూముల పట్టాల పంపిణీ కొరకు జిల్లా స్థాయి కమిటీ వద్ద పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు త్వరగా ఆమోదించాలని సీఎస్ సిద్ధం చేయాలని, వేసవిని దృష్టిలో పెట్టుకొని మొక్కల సంరక్షణ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా జీఓ 58 ప్రకారం ఆమోదించిన దరఖాస్తుదారుల పట్టాలను స్థానిక మంత్రి, ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో పంపిణీ పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల ధృవీకరణ పూర్తి చేయాలని, క్షేత్ర స్థాయి పరిశీలన వంద శాతం పూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్వి.కర్ణన్, అదనపు కలెక్టర్లు గరిమ అగర్వాల్, జివి.శ్యాంప్రసాద్ లాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టోప్పో, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జువేరియా, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాల, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూలోక వైకుంఠంగా యాదాద్రి నిర్మాణం : మంత్రి హరీష్‌రావు



యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి హరీష్‌రావు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంత్రి హరీష్‌రావు దంపతులకు ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి



వేదాశీర్వాదం చేశారు. అనంతరం అర్చకులు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ సంధర్బంగా మంత్రి మాట్లాడుతూ యాదాద్రి క్షేత్రాన్ని భూలోక వైకుంఠంగా కృష్ణ శిలలతో నిర్మించడం జరిగిందని, దేశంలోనే ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేటపట్టని ఆలయ నిర్మాణాన్ని సీఎం కేసిఆర్ చేపట్టడం జరిగిందని అన్నారు. యాదాద్రి దేశంలోనే ప్రసిద్ద పుణ్యక్షేత్రంగా వెలుగొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే గొంగిడి సునితా, డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**కరీంనగర్ కలెక్టర్ కర్ణన్**



కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): కంటి వెలుగు శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్వి.కర్ణన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్ర కారాగారం ఆవరణలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిషాత్మకంగా ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాల్లో అందరూ కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ సందర్బంగా కారాగారంలో నిర్వహించిన శిబిరంలో ఖైదీలు, సిబ్బందిని పరీక్షించి కంటి అద్దాలు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం కారాగారంలోని లైబ్రరీ ని సందర్శించి ఖైదీల కోసం మంచి పుస్తకాలను అందుబాటులో ఉంచాలని జైలు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జువేరియా, జైలు సూపరింటెండెంట్ సమ్మయ్య, జైలర్ బి.రమేష్, మెడికల్ ఆఫీసర్ జి.రమేష్, డిప్యూటీ జైలర్లు ఎల్.రమేష్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి నరసింహునికి వైభవంగా లక్ష పుష్పార్చన



యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గురువారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని లక్ష పుష్పార్చన పూజలు వైభవంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతంతో స్వయంభువులను మేల్కొలిపి ఆచార్యులు నిజాభిషేకం నిత్య సహస్రనామార్చన నిర్వహించారు. ముందుగా ప్రతిష్ట అలంకార మూర్తులను 108 సువర్ణ పుష్పాలతో అలంకరించారు. ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, ముత్యాలు, వజ్రాభరణములతో అలంకరించి వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ అష్టభుజి ప్రాకార మండపవలో సుదర్శన హోమం,నిత్యతిరుక ల్యాణంసాంప్రదాయ రీతిలోకొనసాగాయి. రామలింగేశ్వర స్వామి ఆలయంలో ధ్వజారోహణ బేరి పూజలు... అనుబంధ ఆలయమైన శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజారోహణ బేరిపూజ, దేవతా ఆహ్వానం, అగ్ని ప్రతిష్ట కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ బి నరసింహ మూర్తి, పర్యవేక్షకులు శంకర్‌నాయక్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**స్వామివారి బ్రహోత్సవ ఆహ్వానపత్రిక అందజేత...**

స్వామివారి బ్రహోత్సవాల సంధర్బంగా మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, విప్ గొంగిడి సునితా మహేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ కమీషనర్‌కు స్వామి వారి బ్రహోత్సవాల ఆహ్వానపత్రిని ఈవో రామకృష్ణారావు అందజేయడం జరిగింది.

**స్వామివారి నిత్యరాబడి...**

స్వామివారికి వివిధ శాఖల నుండి రూ.19,99,735 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



# కంటి వెలుగు లక్ష్యాలను సాధిస్తాం...

**- కలెక్టర్ శశాంక**



మహబూబాబాద్, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి): ప్రభుత్వం నిర్దేశించిన విధంగా కంటి వెలుగు లక్ష్యాలను తప్పనిసరిగా సాధిస్తామని జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు.గురువారం ఐడిఓసి లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి కంటి వెలుగు, తెలంగాణకు హరితహారం, రెండు పడక గదుల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ లతో ప్రగతిని సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ శశాంక నివేదిస్తూ... జిల్లాలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు కార్యక్రమంలో ఒక లక్ష 28 వేల747 మందికి కంటి పరీక్ష లు నిర్వహించగా 19వేల 826 మందికి రీడింగ్ కళ్ళజోళ్ళు అందజేయడం జరిగిందని, 8 వేల 857మందికి ప్రిస్క్రిప్షన్ కళ్ళజోళ్ళు ఆర్డర్ ఇవ్వగా 805 మందికి పంపిణీ చేయడం జరిగిందని వివరించారు. కంటి వెలుగు పరీక్షలు 96 ఊర్లలో పూర్తయ్యాయని 32 ఊర్లలో నిర్వహించడం జరుగుతుందన్నారు.అలాగే 24 వార్డులలో పూర్తికాగా ఆరు వార్డులలో నిర్వహించడం జరుగుతున్నది అన్నారు.ఈ సందర్బంగా రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి మాట్లాడుతూ... కంటి వెలుగు కార్యక్రమం మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రిస్క్రిప్షన్ కళ్ళద్దాల పంపిణీ త్వరగా పూర్తి చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్దిదారుల ఎంపిక త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో కంటి వెలుగు శిబిరాల నిర్వహణ పట్లశ్రద్ద వహించాలని,రానున్న వేసవిదృష్టిలో ఉంచు కొని శిబిరాల వద్ద అవసరమైన చల్లని నీరు, ఓఆర్ ఎస్‌ను అందుబాటులో ఉంచడం వంటి ముందు జాగ్రత్త ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రంలో జీహెచ్ఎంసీ మినహాయించి పట్టణ ప్రాంతాలలో నిర్మించిన 42 వేలకు పైగా రెండు పడక గదుల ఇండ్లు నిర్మించడం జరుగుతున్నదని పెండింగ్ లో ఉన్న ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయాల న్నారు.తెలంగాణకు హరితహారం క్రింద వచ్చే సంవత్సరంలో అవసరమైన మొక్కల పెంపకం నర్సరీలో చేపట్టాలని అన్నారు. జిల్లాలో మొక్క లు నాటే స్థలాల గుర్తింపు, ప్రణాళిక సిద్ధం చేయాల ని, వేసవిని దృష్టిలో పెట్టుకొని మొక్కల సంరక్షణ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచిం చారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లుఅభిలాష అభినవ్, డేవిడ్, మహబూబా బాద్, తొర్రూర్ ఆర్డీవో లు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్, ఉప వైద్యాధికారులు అంబరీష్, ఉమా గౌరి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సత్యనారాయణ, డి.ఆర్.డి.ఓ. సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి జిల్లాలో మంచి స్పందన

- ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి
- జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్



ఖమ్మం, ఫిబ్రవరి 16 (మనం బ్యూరో) : రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ వివి. పాలెం ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిస్కిప్షన్ కళ్ళద్దాలు ఎన్ని వచ్చాయి, ఎన్ని పంపిణీ చేశారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ స్వయంగా వివి. పాలెం లోని గుగులోతు కృష్ణ ఇంటికి వెళ్లి, వారి ఇంట్లో కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు చేసుకొని ప్రిస్కిప్షన్ కళ్ళద్దాలు పొందిన వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుగులోతు కృష్ణ కు, గుగులోతు కావేరి కి ప్రిస్కిప్షన్ కళ్ళద్దాలు అందినట్లు, వీటితో కంటి చూపు చాలా మెరుగైనట్లు, ఇప్పుడు చక్కగా కనిపిస్తున్నట్లు ఆనందం వెలిబుచ్చారు. పరీక్షలు ఉచితంగా నిర్వహించి, ఉచితంగా మందులు, కళ్ళద్దాలు అందించడం చాలా గొప్ప విషయమని వారు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి జిల్లాలో మంచి స్పందన వస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి రీడింగ్ కళ్ళద్దాలు వెంటనే ఇవ్వడం జరుగుతున్నట్లు, ప్రిస్కిప్షన్ కళ్ళద్దాలు అవసరమైనవారికి సరఫరా



కోసం ఇండెంట్ చేసి, వారి వారి ఇండ్ల వద్దకే అందించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాకు 1888 ప్రిస్కిప్షన్ కళ్ళద్దాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేరగా, ఇప్పటికే 1305 కళ్ళద్దాలు లబ్ధిదారులకు అందజేసినట్లు ఆయన అన్నారు. జనవరి 18 న ప్రారంభమయిన కంటి వెలుగు కార్యక్రమం 100 పనిదినాల పాటు కొనసాగుతుందని, 55 బృందాల ద్వారా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి డా. బి. మాలతి, వైద్యాధికారిని డా. సంధ్యారాణి, సిబ్బంది తదితరులు ఉన్నారు.



# దేశానికి ఆశా కిరణం కేసీఆర్

- కేసీఆర్‌కు వెన్నుదన్నుగా తెలంగాణ సమాజం
- కేసీఆర్ కలకాలం జీవించాలి
- సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ నామ



ఖమ్మం, ఫిబ్రవరి 16 (మనం బ్యూరో) : అబ్ కీ బార్ సర్కార్ నినాద ప్రదాత, తెలంగాణ విధాత, భావి భారత నిర్మాత, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరావుకు హార్ధిక జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పార్టీ లోక్ సభ నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని ఆకాంక్షించారు. రేపటి నవీన భారతాన్ని నిర్మించేందుకు ముందుకు సాగుతున్న కేసీఆర్ కు యావత్ తెలంగాణ సమాజం వెన్నుదన్నుగా నిలుస్తుందని నామ పేర్కొన్నారు. ఆయన సమర్ధ నాయకత్వానికి దేశమంతా మద్దతు లభిస్తుందని, నేడు అన్ని రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్న దేశ్కీ నేత, అలుపెరుగని నాయకుడు కేసీఆర్ అన్నారు. దేశ ప్రజలకు ఆయన ఆశాకిరణంలా కనిపిస్తున్నారని చెప్పారు. భారత్ ను అగ్ర దేశంగా నిలిపే వ్యూహాత్మక ప్రణాళికలు కేసీఆర్ సొంతమన్నారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అంటూ వారంతా ఆశగా, ఆనందంగా ఆయనను స్వాగతిస్తున్నారని అన్నారు. 8 ఏండ్లలో తెలంగాణ గతిని మార్చి, దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో టాప్ గా నిలిపిన ఘనత ఒక్క కేసీఆర్ కు మాత్రమే దక్కు తుందన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచిగా చేశారని అన్నారు. కేసీఆర్ సమర్ధవంతమైన పాలనను దేశ ప్రజలు స్వాగతిస్తున్నారని, తెలంగాణ పథకాలు దేశమంతా అమలు జరపాలని కోరుకుంటూ బీఆర్ఎస్ ను విశ్వసిస్తూ, ఆదరిస్తూ, అక్కున చేర్చుకుంటున్నారని అన్నారు. తెలంగాణ ప్రగతి కాంతులను దేశం నలుమూలలా వెదజల్లేందుకు కేసీఆర్ ప్రగతికాముక దేశాల స్ఫూర్తితో, ఆత్మ విశ్వాసంతో దేశ ప్రగతి కోసం ముందుకు సాగుతున్న ఆయనకు మనమంతా కొండంత అండగా నిలవాలన్నారు. కేవలం 8 ఏండ్లలో దేశంలో అత్యధిక వృద్ధిరేటు సాధించిన 4వ రాష్ట్రంగా, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న రాష్ట్రంగా, పారిశ్రామిక, ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణాను తీర్చిదిద్దారని అన్నారు. హైదరాబాద్ ను విశ్వ నగరంగా, గ్రీన్ సిటీగా, ప్రశాంతతకు నిలయంగా తీర్చిదిద్దిన కేసీఆర్ ఆచరణకు, జ్ఞాన శక్తికి ముగ్ధులై, ప్రజా నేత కేసీఆర్ భారత్ ను కూడా ప్రగతి పథాన పరుగెత్తించగలడన్న సంపూర్ణ విశ్వాసంతోనే యావత్ దేశం ఆయన నాయకత్వాన్ని కోరుకుం టున్నదని నామ పేర్కొన్నారు. ఈనెల 17న శుక్రవారం సీఎం కేసీఆర్ జన్మ దిన వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యారని నామ చెప్పారు.

# బీఆర్ఎస్ పాలన వద్దు.. బీజేపీ పాలన ముద్దు

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదగాని సోమయ్య



పెద్దవంగర, ఫిబ్రవరి 16 (మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పాలన వద్దు బిజెపి పాలనే ముద్దు అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదగాని సోమయ్య అన్నారు, గురువారం రోజున మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజాగోష బిజెపి భరోసా పేరుతో కార్నర్ మీటింగ్ కు శక్తి కేంద్ర ఇన్చార్జ్ జలగం ఆనంద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పెదగాని సోమయ్య, జిల్లా అధ్యక్షులు ఒద్దిరాజు రామచంద్రరావు మాట్లాడుతూ తెలంగాణలో రాచరికపు పాలన కొనసాగుతుందని హామీలను పక్కనపెట్టి ప్రజలందరికీ అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తూ నిరుపేద ప్రజలకు ఏ ఒక్క సంక్షేమ పథకం కూడా అందకుండా చేసినటువంటి దౌర్భాగ్యపు ప్రభుత్వం మనకు అవసరం లేదని, ఉద్యమం పేరుతో గద్దెనెక్కి ఉద్యమకారులందరినీ అనగదొక్కినటువంటి అహంకార పూరితమైన రాచరికపు కుటుంబ పాలనతో కూడిన దొంగ కేసీఆర్ ను మనం తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని సూచించారు, రాష్ట్రంలో ఉన్నటువంటి బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు ఎలాంటి ఉపయోగకరమైన పనులను చేశాడా అని ప్రశ్నించారు, ఇక చాలు తెలంగాణ ఉద్యమంలో మోసపూరితమైన ఉద్యమకారుడిగా తెలంగాణను ఒక్కడివే సాధించినట్టు నటించి రెండు పర్యాయాలు గద్దెనెక్కి సంపాదించుకున్నది చాలు ఇక తరిమికొట్టడమే, మిగతాది ప్రజలారా గుర్తుంచుకోండి ఒక్క పెన్షన్ ఇచ్చి మిమ్మల్ని బానిసలుగా ఉపయోగించు కుంటున్నాడు, ఒక్కసారి ఆలోచించండి అని ప్రజలందరికీ హితబోధ చేశారు, ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బొమ్మరబోయిన సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాము గౌడ్, ఎంపీటీసీ సాయిని ఝాన్సీ రవి, తలారి సోమయ్య, బిక్షపతి, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి మణి జనరల్ హాస్పిటల్ యాజమాన్యం చేయూత



బయ్యారం, ఫిబ్రవరి 16 (మనం న్యూస్) : బయ్యారం మండలా లోని స్థానిక అంబేద్కర్ నగర్ లో నిరుపేద కుటుంబానికి చెందిన తుడుం వెంకన్న గత కొన్ని రోజులుగా ఆనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. కుటుంబ పెద్దని కోల్పోయి నిరాశ్రయులైన వారి కుటుంబ సభ్యులను గురువారం ఇల్లందు కు చెందిన మణి జనరల్ హాస్పిటల్ యజమాని బచ్చులకూరి కర్ణాకర్ వారిని పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందజేయడం జరిగింది.... ఈ సందర్భంగా కుల పెద్దమనిషి మందుల గణేష్ మాట్లాడుతూ బచ్చులకూరి కర్ణాకర్ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుపేద కుటుంబాలకు తనవంతు బాధ్యతగా సహాయ సహకారాలు అందిస్తూ ఎంతో మందికి అండగా నిలుస్తున్నాడని అందులో భాగమే ఈ రోజు తుడుం వెంకన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు,ఇతర పార్టీ నాయకులు, స్పందించి నిరుపేద కుటుంబమైనా తుడుం వెంకన్న కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.... ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ , 1 వ, వార్డ్ మెంబర్ జనక రేణుక లక్ష్మణ్, తుడుం వీరభద్రం, గంట శ్రీనివాస్, హెచ్ రమేష్, కందిపాటి వెంకన్న, పోతురాజు రాజశేఖర్, తుడుం రాజేష్, మరికంటి నరేష్, కొమిరె జనార్ధన్, బాల్యం రవి, తుడుం రవి, గుండెపాక సిద్ధు, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## రేప్ కేసు నిందితుడు అరెస్ట్

గార్ల, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి): మండల వ్యాప్తంగా కేసులలో ఉన్న వ్యక్తులు కోర్టు వాయిదాలకు తప్పనిసరిగా హాజరుకావాలని లేనిచో అరెస్టు చేసి జైలుకు తరలించడం జరుగుతుందని గార్ల ఎస్ఐ భానోత్ వెంకన్న హెచ్చరించారు.గార్ల మండల పరిధిలోని గుడిసె తండా గ్రామానికి చెందిన భూక్యా నరేష్ (తండ్రి) మిటియా 2017 వ సంవత్సరంలో రేప్ కేసు లో అరెస్టు చేయడం జరిగిందని గార్ల ఎస్ఐ బానోత్ వెంకన్న పేర్కొన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం రేపు కేసులో నిందితుడిగా ఉన్న భూక్యా నరేష్ కోర్టుకు హాజరు కాకపోవడంతో అతనిపై మహబూబాబాద్ కోర్టు మెజిస్ట్రేట్ నాన్బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నరేష్ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు పంపించడం జరిగిందని ఆయన తెలిపారు. మండల వ్యాప్తంగా పలు కేసులు నమోదైన వ్యక్తులు కోర్టు వాయిదాలకు హాజరుకావాలని లేనిచో అరెస్టు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉమెన్స్ కబడ్డీ పోటీలకు పీఈటీ

### - విజేతను అభినందించిన ఎమ్మెల్యే రెడ్యానాయక్



మరిపెడ, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలంలోని గిరిపురం క్రాస్ కేజీబివి నుండి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉమెన్స్ కబడ్డీ పోటీలకు ఎంపికైన మరిపెడ పీఈ టి భూక్య విజేతను గురువారం స్థానిక ఎమ్మెల్యే రెడ్యానాయక్ అభినందించారు. ఈ నెల 17న డెహ్రాడూన్, ఉత్తరాఖండ్ లో జరిగే టోర్నమెంట్స్ కు తెలంగాణ తరుపున 14 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. అందులో భాగంగా మన కేజీబివి మరిపెడ నుండి ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, గిరిపురం గ్రామ పెద్దలు పివిఅరెన్ శాశ్రీ, సీనియర్ నాయకులు కాలు నాయక్, గ్రామ సర్పంచ్ పెద్దబోయిన జనార్ధన్, గ్రామ భారసా పార్టీ అధ్యక్షులు పట్ల మల్లయ్య, పి ఏ టి రాంబాబు గారు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలను సందర్శించిన తక్కెళ్లపల్లి



మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 16 (మనం న్యూస్) : మహబూబాబాద్ జిల్లా మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డులో కస్తూర్బా పాఠశాలను సందర్శించి మౌళిక సదుపాయాలు వసతులను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను ఆడిగి తెలుసుకున్న ఎమ్మెల్సీ శ్రీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు .రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ విద్యా ప్రమాణాలు పెంచి మెరుగైన వసతులు కల్పించి గురుకులాలను బలోపేతం చేసిందని ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్ రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్సీ సందర్శించి వసతి గృహంలో సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకుని ఉపాధ్యాయులకు సలహాలు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యలో చదువు మానేసిన విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కస్తూర్బా గాంధీ విద్యాలయాలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఈ విద్యాలయాల్లో విద్యాబోధన సాగుతుందని, నాణ్యమైన విద్యతోపాటు పోషకాలతో కూడిన భోజనం అందిస్తున్నామన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి కవితలకు ఆహ్వానం

### - జిల్లా అధ్యక్షులు ఇమ్మడి రాంబాబు

### - తెలంగాణా సామాజిక రచయితల సంఘం

తొర్రూర్ టౌన్, ఫిబ్రవరి 16 (మనం న్యూస్) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కుని తెలంగాణ సామాజిక రచయితల సంఘం ఆధ్వర్యం లో మార్చ్ 5వ తేదీన కవి సమ్మేళనం నిర్వహించడం జరుగుతందని తెలంగాణా సామాజిక రచయితల సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజేశం,జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి రాంబాబు లు తెలిపారు . మహిళల జీవితాల్లోని సుఖదుఃఖాల గూర్చి 20 లైన్లకు మించకుండా కవితలను ,ఈనెల 25వ తేదీలోగా కవితలు పంపాలని తెలిపారు. ఎంపిక చేసిన కవిత లతో కవితా సంకలనమును రూపొందిస్తున్నామని చెప్పారు .కవితలని 9848811424 కి పంపాలని అన్నారు.116 మంది కవులకు మాత్రమే అవకాశము అని ,మార్చి 5న కరీంనగర్ లో కవి సమ్మేళనము నిర్వహించబడుతుందని,.అదే సభలో ప్రముఖుల చేత మేమెంటో ,రెండు పుస్తకాలు ఇస్తామని కామిడి సతీష్ రెడ్డి రావుల రాజేశం ఇమ్మడి రాంబాబులు తెలిపారు.

## నాలుగవ తరగతి విద్యార్థులకు గురుకుల ప్రవేశ పరీక్షలకు సంబంధించిన బుక్స్ మెటీరియల్స్ ఉచిత పంపిణీ

మాడుగులపల్లి, ఫిబ్రవరి 16 (మనం న్యూస్) : గురువారం మాడుగులపల్లి మండలం కల్వలపాలెం ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న 16 మంది విద్యార్థులకు తన సొంత గ్రామంలో తల్లిదండ్రులు చేతుల మీదుగా ఐదవ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షలు సంబంధించిన. 3500 రూపాయలు విలువగల మెటీరియల్ ఉచితంగా చిట్యాల గోపాల్ పంపిణీ చేయడం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న, మాడుగులపల్లి సలహాదారుడు పోకల రాజు, గ్రామ సర్పంచ్ గడ్డమీద సైదులు మాట్లాడుతూ గ్రామంలో ఇలాంటి సేవ చేయడం చాలా సంతోషంగా ఉందని అలాగే గ్రామంలో చాలా మంది విద్యావంతులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల పల్లి ఎంపీపీ సలహాదారుడు పోకల రాజు, గ్రామ సర్పంచ్ గడ్డమీది సైదులు , ఆల్ ఇండియా సమత సైనిక దళ్ దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు చిట్యాల గోపాల్,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ నిఘాతో ఇసుక అక్రమ రవాణా బంద్

### - ఫలించిన నేనుసైతం పోరాటం

### - ఏడాదిగా రాకొండలో కనిపించని ఇసుక మాఫియా

### - ఇసుక మాఫియాపై ఎస్పీ ఉక్కుపాదం

నారాయణపేట, ఫిబ్రవరి 16, మనం న్యూస్: నారాయణపేట జిల్లా మరికల్ మండలం రాకుండా గ్రామ శివారులో గల ఊకచెట్టు వాగులో ఇసుక మాఫియా ఆగడాలను చెక్ పెట్టి, ఇసుక అక్రమ రవాణాన్ని అడ్డుకొని నేటితో ఏడాది పూర్తవుతుందని, ఇసుక మాఫియాపై నిరంతరం నిఘా పెట్టి ఉక్కుపాదం మోపిన నారాయణపేట జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు కృషి మరువలేనిదని సామాజిక కార్యకర్త, నేనుసైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దిడ్డి ప్రవీణ్ కుమార్అన్నారు. గురువారం నేనుసైతం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణపేట జిల్లా మరికల్ మండలం రాకుండలో రెచ్చిపోయిన ఇసుక మాఫియాను అరికట్టాలని గత ఏడాది ఫిబ్రవరి 14న జిల్లా ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లుకు నేనుసైతం స్వచ్ఛంద సంస్థ ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.దీనిపై స్పందించిన ఎస్పీ ఇసుక అక్రమ రవాణా అరికడతానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈనేపథ్యంలోనే తమ ఫిర్యాదుపై వెంటనే స్పందించిన ఎస్పీ,15 ఫిబ్రవరి 2022న ఆకస్మికంగా మరికల్ మండలం రాకొండ గ్రామాన్ని సందర్శించి అక్కడున్నటువంటి ఇసుక రీచ్ లను, నిబంధనలు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న విషయాన్ని స్వయంగా ఆయన పరిశీలించారు. ఎస్పీ ఆకస్మిక పర్యటనలో రాకొండ గ్రామంతో పాటు శివారులో గల ఊకచెట్టు వాగు నుండి పెద్ద ఎత్తున ఇసుక మేటలు ఎస్పీకి దర్శనం ఇచ్చాయి. ఎస్పీ వెంకటేశ్వర్లు ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు ప్రత్యేక టాస్కోఫోర్స్ ఏర్పాటు చేయడంతో రాకొండలో ఇసుక ఆగడాలు చెక్ పడింది. దీంతో ఇసుక అక్రమ రవాణాన్ని అడ్డుకునేందుకు నేనుసైతం చేసిన పోరాటం ఫలించింది. గత 12 ఏళ్లుగా ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పోరాటం చేస్తున్న తాము ఎన్నో విలువైన ఇసుక రీచ్ లను కాపాడడం జరిగిందని, కోట్లాది రూపాయల విలువైన ప్రజా సంపాదన లూటీ కాకుండా పరిరక్షించామని సామాజిక కార్యకర్త ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా నారాయణపేట ఎస్పీ వెంకటేశ్వర్లుకు నేనుసైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వనికి, పోలీసలకు సవాల్ విసిరిన ఇసుక మాఫియాను రాకొండ నుంచి తరిమికొట్టిన నారాయణపేట ఎస్పీ వెంకటేశ్వర్లుకు ఋణపడి వుంటాంమని ప్రవీణ్ తెలిపారు. అంతేకాకుండా ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకునే వరకు, ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపేవరకు నేనుసైతం పోరాటం కొనసాగిస్తూనే ఉంటుందని సామాజిక కార్యకర్త, నేనుసైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దిడ్డి ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## ఉద్యమాన్ని తలపించేలా మహాధర్నా

### ఫార్మా కంపెనీ అనుమతులను వెంటనే రద్దు చేయాలి

### అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన



మునుగోడు, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): ఉద్యమాన్ని తలపించేలా ప్రజలకు హాని కలిగించే రసాయనిక పరిశ్రమ అనుమతులను వెంటనే రద్దు చేయాలని అఖిలపక్షాల ఆధ్వర్యంలో గురువారం మునుగోడు మండల కేంద్రంలోనీ అంబేద్కర్ చౌరస్తాలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ఫార్మా కంపెనీల ఏర్పాటు వలన భూగర్భ జలాలు పసుపు ఎరుపు రంగుగా మారి వ్యవసాయానికి పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు రసాయన పరిశ్రమలు విడుదల చేసే విషవాయువుల వలన మానవులు పసుపక్షాదుల మనుగడకే ప్రమాదం పొంచి ఉందన్నారు కంపెనీ ఏర్పాటు వల్ల చుట్టుపక్కల 30 కిలోమీటర్ల వరకు వ్యవసాయ భూములు ఎడారిగా మారనున్నాయని దీంతో ఇక్కడి ప్రజల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు దాపురిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అనంతరం అఖిలపక్ష నాయకులు ర్యాలీగా తరలి వెళ్లి తహసిల్దార్ మాలి కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, ఏఐసిసి సభ్యురాలు పాల్వాయి స్రవంతి రెడ్డి, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు పున్న కైలాష్ నేత, చలమల్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్ ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు, నాయకులు పోలగోని సత్యం గౌడ్, జాజుల అంజయ్య, మారగోని అంజయ్య గౌడ్, చెరుకు కృష్ణయ్య, చాపల మారయ్య, మిర్యాల వెంకటేశ్వర్లు, పోలగోని సైదులు, బొజ్జ శ్రీను, ఎండి రఫీక్, తాటికొండ సైదులు, అనంత లింగస్వామి, బోలుగూరి నరసింహ,దుబ్బ వెంకన్న, మేడి చంద్ర స్వామి, పందుల అశోక్, ఈద శరత్ బాబు, సురిగి నర్సింహ గౌడ్,మేకల శ్రీనివాస్ రెడ్డి, తీర్పారి వెంకటేశ్వర్లు, ఈదులకంటి కైలాసం,పందుల పాపయ్య, రడం వెంకన్న,ఆనగంటి కృష్ణ, జీడిమడ్ల సునీల్ సులేమాన్, పులకరం ఆంజనేయులు వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట

## కంటి వెలుగు తెలంగాణ ప్రభుత్వ సంకల్పం

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు



మరిపెడ, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): ప్రతి ఒక్కరికి కంటి లోపాలను తొలగించడం కోసం కంటి వెలుగు ను తెలంగాణ రాష్ట ప్రభుత్వం సంకల్పించిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు అన్నారు. మండలంలోని లునావత్ గ్రామపంచాయతీ పరిధిలోని రెండో విడత ఉచిత కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వ లోపం ఉన్న వారికి గుర్తించి ఉచితంగా కంటి అద్దాలు ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా సాగుతున్న ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లూనావత్ వీరమల్లు, చిర్రబోయిన ప్రభాకర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గూగులోత్ రవినాయక్, పంచాయతీ కార్యదర్శి దివ్య మధుకర్, పద్మ, తులసి, అంగన్వాడి టీచర్లు జ్యోతి ,ఉమా, ఆశా కార్యకర్తలు శ్రీలత, కవిత, రేణుక, సునీత, రమాదేవి, బద్రు, ఇళందర్, సురేష్, బొజ్జ,, అమర్ సింగ్ తదితరులు ఉన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



గార్ల, ఫిబ్రవరి 16 (మనం ప్రతినిధి): పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండల పరిధిలోని కొత్త పోచారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ భానోత్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం గార్ల మండల పరిధిలోని కొత్త పోచారం గ్రామానికి చెందిన కుక్కల ఎల్లయ్య (52 సం) గత రెండు సంవత్సరాల నుండి పక్షవాతానికి గురై బాధపడుతూ మనోవేదనతో జీవితంపై విరక్తి చెంది బుధవారం పురుగుల మందు తాగగా మెరుగైన చికిత్స నిమిత్తం ఉటావుటిన బంధువులు మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తుండగా గురువారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చికిత్స పొందుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతుని కొడుకు కుక్కల కొండలరావు ఇచ్చిన దరఖాస్తు మేరకు గార్ల ఎస్ఐ బానోతు వెంకన్న కేసు నమోదు చేసి పంచనామా నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.'''

## మూడు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



గార్ల, ఫిబ్రవరి 16 (మనం న్యూస్): గార్ల మండలం సీతంపేట గ్రామపంచాయతీ పరిధిలో మూడు జిల్లాల స్థాయి ఖమ్మం,భద్రాద్రి-కొత్తగూడెం, మహబూబాద్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీ చైర్ పర్సన్ కోరం కనకయ్య గురువారం వచ్చేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తరువాత దేశానికి కావలసిన నైపుణ్యం కలిగిన యువకులు క్రికెట్ పట్ల ఆసక్తి పెరుగుతుంది, అనేకమంది యువకులు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడతోపాటు చదువు పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. దేశం గర్వించె విధంగా ప్రతిభ కనబరుస్తున్నారు క్రీడాకారులుదేశించి మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో గార్ల జడ్పిటిసి ఝాన్సీ లక్ష్మీబాయి, గుండా వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు, సీతంపేట ఎంపీటీసీ నాగమణి, గ్రామ పెద్దలు మోహన్ రెడ్డి, భద్రాజి కృష్ణ, క్రికెట్ టోర్నమెంట్ యూత్ కమిటీ సభ్యులు మాలోత్ నరేష్, మాలోత్ భాస్కర్,నాయకులు మీరా పటాన్, భూక్యరామ్ సింగ్,ఆడపు వెంకటేశ్వర్లు, గోపి వెంకటేశ్వర్లు,శ్రావణ్, కుమార్, కోళ్ల కుమార్ గౌడ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్



కురవి, ఫిబ్రవరి 16 (మనం న్యూస్) : నేడు అనగా ది.17-02-2023 శుక్రవారం ఉదయం 10-30గం, లకు గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 284 వ జయంతి సందర్భంగా ఎంపీపీ పద్మావతి రవినాయక్ అధ్యక్షతన కురవి మండల కేంద్రంలో భోగ్ భండారో కార్యక్రమం కలదు ఇట్టి కార్యక్రమానికి మన గిరిజన జాతి ముద్దుబిడ్డ ఎమ్మెల్యే డి.యస్.రెడ్యానాయక్ ముఖ్య అతిథిగా విచ్చేయుచున్నారు కావున మండలంలోని అన్ని గ్రామాల గిరిజన సర్పంచులు,ఎంపీటీసీలు,అన్ని సంఘాల నాయకులు,మండల ,ముఖ్య,సీనియర్ నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా కోరారు.

# అండర్సన్ హిస్టరీ..
# 21 ఏళ్లుగా వికెట్ల వేటలో!




లండన్: జేమ్స్ అండర్సన్.. ఇంగ్లాండ్ క్రికెట్లోనే కాదు ప్రపంచ క్రికెట్లోనే చరిత్రలో నిలిచిపోయే పేసర్. వయసు పెరుగుతున్నా కొద్దీ ఇతడి పేస్లో పదును పెరుగుతుందే తప్ప తరగడం లేదు. తన బౌలింగ్‌తో ఇప్పటికే ఎన్నో పురస్కారాలు, మరెన్నో రికార్డులు ఖాతాలో వేసుకున్న జిమ్మీ.. తాజాగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న డే అండ్ నైట్ టెస్టులో మరో రికార్డు సొంతం చేసుకున్నాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు పడగొట్టిన అండర్సన్.. గడిచిన 21 ఏళ్లలో ఏడాదికి కనీసం ఒక వికెటైనా తీసిన బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. 2002లో అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగుపెట్టిన 40 ఏళ్ల ఆండర్సన్.. నాటి నుంచి ప్రతి ఏడాది కనీసం ఒక్క వికెట్ అయినా తీశాడు. ప్రస్తుత ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మూడో ర్యాంక్‌లో ఉన్న అండర్సన్ టెస్టు క్రికెట్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇప్పటికే 178 టెస్టుల్లో 677 వికెట్లు తీసి ఓవరాల్ లీడింగ్ వికెట్ టేకర్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్న ఆండర్సన్.. వన్డేల్లో ఇంగ్లాండ్ తరపున అత్యధిక వికెట్లు (194 వన్డేల్లో 269) పడగొట్టిన బౌలర్‌గా రికార్డుల్లో నిలిచాడు. అలాగే టెస్టుల్లో సచిన్ (200) తర్వాత అత్యధిక టెస్టులు ఆడిన క్రికెటర్‌గా, ఇంగ్లాండ్ తరపున అత్యధిక టెస్టులు ఆడిన క్రికెటర్‌గా, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 1000 వికెట్లు పడగొట్టిన 216వ బౌలర్‌గా, ఇంగ్లాండ్ తరపున ఈ ఫీట్ సాధించిన తొలి బౌలర్‌గా పలు రికార్డులు నెలకొల్పాడు.

### వన్డే తరహాలో..

ఇకపోతే, న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. రాకెట్ వేగంతో పరుగులు సాధించింది. పేరుకు టెస్టు మ్యాచ్ అయినా వన్డే బ్యాటింగ్‌తో ఇంగ్లీష్ బ్యాటర్లు రెచ్చిపోయారు. మొదటి రోజు కేవలం 58.2 ఓవర్లే ఆడిన ఇంగ్లాండ్ 325/9 స్కోర్ వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. బెన్ డకెట్ (68 బంతుల్లో 84), హ్యారీ బ్రూక్ (81 బంతుల్లో 89) మెరుపు అర్ధశతకాలు సాధించి తృటిలో సెంచరీలు చేసే అవకాశాన్ని కోల్పోయారు. ఓలీ పోప్ (42), బెన్ ఫోక్స్ (38) కూడా బౌండరీలతో విరుచుకుపడి జట్టు వేగంగా పరుగులు సాధించడానికి దోహదపడ్డారు. కివీస్ బౌలర్లలో వాగ్నర్ 4, సౌథీ, కుగ్గెలెన్ చెరో 2, టిక్నర్ ఓ వికెట్ పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కివీస్.. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 37 పరుగులు చేసింది. కాన్వే (17), వాగ్నర్ (4) క్రీజ్‌లో ఉన్నారు. లాథమ్ (1), విలియమ్సన్ (6), నికోలస్ (4) నిరాశపర్చారు. ఈ మ్యాచ్లో ఇంగ్లాండ్‌కు కావాల్సినంత సమయం ఉండి, చేతిలో వికెట్ ఉన్నప్పటికీ మొదటి రోజే తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది.

## వంద టెస్టులు ఆడతానని అనుకోలేదు..

### -డబ్ల్యూటీసీ ఫైనల్లో గెలవాలన్నదే నా డ్రీమ్ -ఛెతేశ్వర్ పుజారా



న్యూఢిల్లీ: టీమ్ఇండియా టెస్టు స్పెషలిస్టు, నయా వాల్ ఛెతేశ్వర్ పుజారా త్వరలో వంద టెస్టుల క్లబ్‌లో చేరనున్నాడు. ఫిబ్రవరి 17 నుంచి ఢిల్లీ వేదికగా ఆస్ట్రేలియాతో ప్రారంభం కానున్న రెండో టెస్టుతో తన కెరీర్‌లో వందో టెస్టుని ఆడనున్నాడు. తన కెరీర్ ప్రారంభదశం లో భారత్ తరపున వంద టెస్టు మ్యాచ్‌లు ఆడతానని ఎప్పుడూ అనుకోలేదని చెప్పాడు. ఈ సారి ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ట్రోఫీని టీమ్ఇండియా సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. 'నేను క్రికెట్ ఆడటం మొదలుపెట్టి, ఆ తర్వాత నా టెస్ట్ అరంగేట్రం చేసినప్పుడు వంద టెస్టు మ్యాచ్లు ఆడతానని ఎప్పుడూ అనుకోలేదు. నేనెప్పుడూ వర్తమాన విషయాలపైనే దృష్టిపెడతాను. భవిష్యత్ గురించి ఆలోచించను. నేను వందో టెస్టు ఆడబోతున్నానని ఈ సిరీస్ ప్రారంభం అయ్యే ముందు గ్రహించాను. నేను సాధించాల్సింది చాలా ఉంది. ఇప్పటివరకైతే సంతృప్తికరంగా ఉన్నా. వందో టెస్టులో ఆడటం కోసం ఎంతో ఉత్సాహంగా ఉన్నా. మేం చాలా కీలకమైన సిరీస్ ఆడుతున్నాం. మేం ఈ మ్యాచ్ (రెండో టెస్టు)తో పాటు మరో టెస్టులో విజయం సాధించి ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్‌కు అర్హత సాధిస్తామని ఆశిస్తున్నా. భారత్ తరపున డబ్ల్యూటీసీ ఫైనల్లో గెలవాలన్నది నా డ్రీమ్. కిందటిసారి (2021 లో) ఫైనల్లో ఓడిపోయాం. కానీ, ఈ సారి డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించి ఆ ట్రోఫీని సాధిస్తామని ఆశిస్తున్నా' అని పుజారా అన్నాడు. క్రికెటర్లకు కుటుంబసభ్యుల మద్దతు చాలా కీలకమని పేర్కొంటూ తన జీవితంలో మద్దతుగా నిలిచిన స్నేహితులు, కుటుం బసభ్యులు, కోచ్‌లకు పుజారా కృతజ్ఞతలు తెలిపాడు. 2010లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరపున టెస్టుల్లో అరంగే ట్రం చేసిన పుజారా ఇప్పటివరకు 99 మ్యాచ్ లు ఆడాడు. 44.16 సగటుతో 7,021 పరు గులు చేశాడు. డిఫెన్స్ ఆడుతూ ప్రత్యర్థి బౌలర్లకు విసుగు పుట్టిస్తూ నయా వాల్‌గా గుర్తింపు పొందాడు. టెస్టుల్లో 19 సెంచరీలు, 3 డబుల్ సెంచరీలు, 34 అర్ధ సెంచరీలు బాదాడు.

## సెల్ఫీలు నిరాకరించినందుకు పృథ్వీ షాపై దాడి..

### 8 మందిపై కేసు నమోదు



ముంబయి: టీమ్ఇండియా యువ ఆటగాడు పృథ్వీ షా దాడికి గురైన సంఘటన వెలుగులోకి వచ్చింది. తన స్నేహితుడితో కలిసి బుధవారం (ఫిబ్రవరి 15న) ఓ హోటల్‌కు వెళ్లినప్పుడు ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ముంబయిలోని ఓషివారా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. తొలుత సెల్ఫీలను తిరస్కరించినందుకు దాడి చేసినట్లు భావించినప్పటికీ.. డబ్బు ఇవ్వకపోతే తప్పుడు కేసులు పెడతామని బెదిరించినట్లు కూడా ఫిర్యాదులో పృథ్వీ షా స్నేహితుడు ఆశిశ్ సురేంద్ర పేర్కొన్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. సురేంద్రతో కలిసి పృథ్వీ షా శాంతాక్రూజ్‌లోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌కు వెళ్లాడు. నిందితులు సెల్ఫీ కోసం పృథ్వీ షా వద్దకు వచ్చారు. అయితే ఇద్దరితో మాత్రమే సెల్ఫీ దిగేందుకు షా ఆసక్తి చూపగా.. గ్రూప్‌లోని మిగతావారు కూడా వచ్చి సెల్ఫీ ఇవ్వాలన్నారు. తాను స్నేహితులతో కలిసి భోజనానికి వచ్చానని, ఇప్పుడు అందరితో సెల్ఫీ ఇవ్వడం కుదరదని పృథ్వీ షా వారికి సమాధానం ఇచ్చాడు. అప్పటికీ ఇవ్వాల్సిందేనని పట్టుబట్టడంతో షా స్నేహితుడు వెంటనే హోటల్ మేనేజర్‌ను పిలిచి ఫిర్యాదు చేశారు. హోటల్ నుంచి వెళ్లిపోవాలని నిందితులను మేనేజర్ అడగడంతో అదంతా మనసులో పెట్టుకొని.. హోటల్ నుంచి బయటకు వచ్చిన పృథ్వీ షా, అతడి స్నేహితుడి కారుపై బేస్‌బాల్ బ్యాట్లతో దాడికి పాల్పడ్డారు. బీఎండబ్ల్యూ కారు వెనుక, ముందర భాగంలోని కిటికీలు ధ్వంసమైనట్లు పోలీసులు తెలిపారు.సంఘటన సమయంలో కారులోనే పృథ్వీ షా ఉన్నాడని.. అయితే దీనిని వివాదం చేయకూడదనే ఉద్దేశంతో అతడిని వేరే కారులో సురక్షితంగా ఇంటికి పంపించినట్లు సురేంద్ర తెలిపారు. అయితే ఓ మహిళ తన కారును వెంబడించి మరీ జోగేశ్వరి లోటస్ పెట్రోల్ పంప్ దగ్గర ఆపేసిందని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసిందని, లేకపోతే తప్పుడు కేసులు పెడతామని బెదిరించారని వెల్లడించారు. ఫిర్యాదు అందుకొన్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. పృథ్వీ షాను సెల్ఫీలను అడిగిన వివరాలను హోటల్ సిబ్బంది నుంచి రాబట్టిన పోలీసులు నిందితుల్లో ఇద్దరిని గుర్తించారు. సనా అలియాస్ సప్నా గిల్, శోభిత్ ఠాకూర్ను అదుపులోకి తీసుకొన్నారు. ఎనిమిది మందిపై ఐపీసీ సెక్షన్స్ 143, 148, 149, 384, 437, 504, 506 కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## దీప్తి శర్మ, మునీబా సూపర్ రికార్డులు



న్యూఢిల్లీ: మహిళల టీ20 ప్రపంచకప్ (2023) రసవ త్తరం గా సాగుతోంది. దాయాది దేశా లైన భారత్, పాకిస్థాన్ ప్లేయర్లు రికార్డులు సృష్టించారు. ఒకరేమో బౌలింగ్‌లో కాగా.. మరొకరు బ్యాటింగ్‌లో అదరగొట్టడం విశేషం. ఇంతకీ ఆ ఇద్దరు ఎవరనేగా మీ డౌటు? టీమ్ ఇండియా క్రీడాకారిణి దీప్తి శర్మ, పాక్ బ్యాటర్ మునీబా అలీ.

### వంద వికెట్ల క్లబ్‌లో..

టీమ్ఇండియా ఆల్రౌండర్ దీప్తి శర్మ భారత్ తరపున టీ20ల్లో వంద వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించింది. విండీస్‌పై మూడు వికెట్లు తీయడంతో ఈ ఘనతను అందుకొంది. దీంతో 89 మ్యాచుల్లో 100 వికెట్లు తీసిన తొలి భారతీయ బౌలర్‌గా రికార్డుకెక్కింది. అంతర్జాతీయంగా తొమ్మిదో బౌలర్ కావడం విశేషం. దీప్తి వెనుకనే పూనమ్ యాదవ్ (98 వికెట్లు) మాత్రమే ఉండగా.. రాధా యాదవ్ (67), రాజేశ్వరి గైక్వాడ్ (58), ఝులన్ గోస్వామి (56), ఏక్తా బిస్త్ (53) మాత్రమే 50 కంటే ఎక్కువ వికెట్లు తీసిన భారత బౌలర్లు. ఇక అంతర్జాతీయంగా విండీస్ క్రికెటర్ అనిసా మహమ్మద్ 117 మ్యాచుల్లో 125 వికెట్లతో అగ్రస్థానంలో ఉంది. నాలుగు మ్యాచుల్లో రెండు విజయాలతో భారత్ సెమీస్ వైపుగా దూసుకెళ్తోంది.

### పాక్ నుంచి ఏకైక బ్యాటర్..

మహిళల టీ20 క్రికెట్లో ఇప్పటి వరకు 38 సెంచరీలు నమోదు కాగా.. అందులో పాక్ నుంచి ఒకే ఒక్క బ్యాటర్ మునీబా అలీ మాత్రమే ఉంది. తాజాగా ఐర్లాండ్ మీద తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో మునీబా అద్భుతమైన సెంచరీ సాధించింది. 66 బంతుల్లో శతకం నమోదు చేసిన మునీబా.. తొలి పాకిస్థాన్ క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది. తొలి అర్ధశతకం కోసం 40 బంతులను తీసుకొన్న మునీబా తర్వాత చెలరేగిపోయింది. గతంలో టీ20ల్లో మునీబా అత్యధిక వ్యక్తిగత స్కోరు 43 పరుగులే కావడం గమనార్హం. ఆడిన రెండు మ్యాచుల్లో విజయం, ఓటమితో కొనసాగుతున్న పాక్.. మిగతా రెండు మ్యాచుల్లోనూ విజయం సాధిస్తేనే సెమీస్ బెర్తుపై ఆశలు నిలుస్తాయి.

## బీసీసీఐని కాదని ఐసీసీ ఏం చేయలేదు

### పాక్ మాజీ కెప్టెన్ షాహిన్ అఫ్రిది



ఇస్లామాబాద్: ఆసియా కప్ 2023 వ్యవహారం కొలిక్కి వచ్చేందుకు ఇంకాస్త సమయం పట్టే అవకాశం ఉంది. ఫిబ్రవరి 4న ఆసియా క్రికెట్ కౌన్సిల్ భేటీ జరిగింది. ఏసీసీ అధ్యక్షుడు, బీసీసీఐ కార్యదర్శి జైషాతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ నజమ్ సేథీ సమావేశమైన విషయం తెలిసిందే. అయితే, మరోసారి మార్చిలో ఏసీసీ భేటీ తర్వాతనే ఆసియా కప్ నిర్వహణపై సందిగ్ధత తొలగనుంది. మరోవైపు ఈ టోర్నమెంట్ యూఏఈ వేదికగా జరిగే అవకాశాలు ఉన్నట్లు క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు. పాక్‌లో నిర్వహిస్తే భారత్ ఆడేది లేదని మరోసారి జైషా స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో నజమ్ సేథీ కూడా భారత్ వేదికగా జరిగే ప్రపంచ కప్‌లో పాక్ ఆడటంపై తమ వైఖరిని ఘాటుగానే తెలియజేశాడని వార్తలు వచ్చాయి. తాజాగా పాక్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది కూడా ఆసియా కప్ నిర్వహణకు సంబంధించి పీసీబీ నిర్ణయం, అశ్విన్ వ్యాఖ్యలపై ఓ టీవీ ఛానెల్‌లో స్పందించాడు. ''ఎవరైనా సరే తమ కాళ్ల మీద పటిష్ఠంగా నిలబడలేకపోతే.. నిర్ణయాలను కూడా బలంగా తీసుకోవడం కష్టంగానే ఉంటుంది. ఇలాంటివారు చాలా అంశాలను పరిశీలించి నిర్ణయానికి రావాల్సి ఉంటుంది. అదే భారత్‌ను చూస్తే తమ వైఖరి గట్టిగా చెప్పడానికి కార ణాలు చాలా ఉన్నాయి. వారు ఆర్థికంగానూ, ఆటపరంగానూ బలంగా మారిపో యారు. లేకపోతే ఆ ధైర్యం వారికి రాదు. బీసీసీఐ చాలా స్ట్రాంగ్. అందుకే నిర్ణయా లను తీసుకోగల స్థాయిలో ఉంది. ఇక ఆసియా కప్ కోసం పాక్‌లో భారత్ పర్యటిస్తుందని నేను అనుకోవడం లేదు. భారత్‌లో జరిగే వన్డే ప్రపంచ కప్‌ను పాక్ బాయ్‌కాట్ చేస్తుందనే ఆలోచనా లేదు. అయితే, కచ్చితంగా మనం ఒక పాయింట్‌కు కట్టుబడి ఉండాలి. ఇలాంటి సమయంలోనే ఐసీసీ పాత్ర చాలా కీలకం. వారే ముందుకొచ్చి సమస్యను పరిష్కరించాలి. కానీ, బీసీసీఐ ఎదుట ఐసీసీ కూడా ఏమి చేయలేదనేదినా భావన. ఇక వ్యక్తిగ తంగా పాక్ వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనేది నా ఉద్దేశం. ఇలాంటి నిర్ణయాలన్నీ ఉన్నతస్థాయిలోనే జరగాల్సి ఉంది. ఇక మన బోర్డు ఆర్థిక పరిస్థితిని బట్టి ప్రణాళికలను తయారు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే భావోద్వేగంతో నిర్ణయాలు తీసుకోకూడదు'' అని అఫ్రిది వ్యాఖ్యానించాడు.

## ఆసీస్ ప్లేయర్లు జాగ్రత్త..

### కుంబ్లే పది వికెట్ల ప్రదర్శన చేసిందక్కడే: అజయ్ జడేజా



న్యూఢిల్లీ: బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్ - ఆసీస్ జట్ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ శుక్రవారం నుంచి ఢిల్లీ వేదికగా ప్రారం భం కానుంది. తొలి టెస్టులో ఘన విజయం సాధించిన టీమ్ఇండియా అదే ఊపును కొనసాగించాలని భావిస్తోంది. మరోవైపు ఘోర పరాభవంతో సిరీస్‌ను ప్రారంభించిన ఆసీస్ కూడా ప్రతీకారేచ్ఛతో రగిలిపోతోంది. కానీ, ఢిల్లీ వేదికపై భారత్‌ను అడ్డుకోవడం ఆసీస్‌కు ఆషామాషీ వ్యవహారం కాదని మాజీ క్రికెటర్ అజయ్ జడేజా వ్యాఖ్యానించాడు. ఢిల్లీ మైదానంలోనే స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే పది వికెట్ల ప్రదర్శన చేశాడని, ఆసీస్ గుర్తు పెట్టుకోవాల్సిన అతి ముఖ్యమైన అంశమని పేర్కొన్నాడు. భారత స్పిన్నర్లు అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ బౌలింగ్‌లో జాగ్రత్తగా ఆడాలని ఆసీస్‌కు సూచించాడు.''ఢిల్లీ పిచ్‌లో బౌన్స్ తక్కువగా ఉంటుంది. కాస్త పచ్చిక ఉంచితే మాత్రం బ్యాటింగ్‌కు అనుకూలంగా మారే అవకాశం ఉంది. పాక్‌పై అనిల్ కుంబ్లే పది వికెట్లు తీసి చరిత్ర సృష్టించింది ఈ మైదానంలోనే. ఆసీస్ అప్రమత్తంగా ఉండాల్సిందే. ప్రస్తుతం పిచ్‌ను సిద్ధం చేసే పనిలో సిబ్బంది నిమగ్నమై ఉన్నారు. కాబట్టి, ఇవాళే పిచ్ ఎలా ఉందనేది తెలిసిపోతుంది. ఇక భారత్ గత టెస్టులో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగాలి'' అని అజయ్ జడేజా తెలిపాడు.స్పిన్‌కు అనుకూ లంగా మారిన నాగ్‌పూర్ పిచ్‌పై భారత్ బ్యాటర్లు ఆకట్టుకోగా.. ఆసీస్ ఆట గాళ్లు మాత్రం చేతులెత్తేశారు. దీంతో రెండో టెస్టులో మార్పులు చేసే అవకా శం లేకపోలేదు. మిచెల్ స్టార్క్ ఫిట్‌నెస్ సాధించడంతో తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ట్రావిస్ హెడ్‌కు జట్టులో స్థానం కల్పించాలనే డిమాండ్లూ వస్తున్నాయి. ''తొలి టెస్టులో విఫలమైనా డేవిడ్ అతడి స్థానానికి ప్రమాద మేమీ లేదు. ఆసీస్‌కు మంచి ఆరంభం కావాలి'' అని జడేజా పేర్కొన్నాడు.

## ఈ సౌత్ ఫిల్మ్ కోసం సౌత్ ఆఫ్రికన్ మ్యూజిక్ కంపోజర్!



మలయాళ దిగ్గజ నటుడు మోహన్‌లాల్ గత కొంతకాలంగా సరైన హిట్ ను సాధించలేకపోయారు. ఇటీవల ఆయన నటించిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఇప్పుడు స్టార్ హీరో, బరోజ్ గార్డియన్ ఆఫ్ డి గామాస్ ట్రెజర్ చిత్రంతో దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. దక్షిణాఫ్రికా సంగీత స్వరకర్త మార్క్ కిలియన్ ఇప్పుడు ఈ చిత్రం కోసం బోర్డులోకి వచ్చారు. ఇదే విషయాన్ని మోహన్లాల్ తన సోషల్ ప్రొఫైల్లో వెల్లడించారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులకు సంబంధించి యూనిట్కి మార్క్ కిలియన్ సహాయం చేయనున్నారు. ఇది ఫాంటసీ చిత్రం, అదే పేరుతో ఉన్న నవల ఆధారంగా తెరకెక్కనుంది. ఆశీర్వాద్ సినిమాస్ పతాకంపై ఆంటోని ప్రీంబావూర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మాయ, తుహిన్ మీనన్, గురు సోమసుందరం, సీజర్ లోరెంటే రాటన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## సార్ టీమ్‌కి నితిన్ బెస్ట్ విషెస్!




కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా టాలెంటెడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం లో తెరకెక్కిన చిత్రం సార్. తమిళంలో వాతి పేరిట రిలీజ్ కానుంది. ఈ చిత్రం ను నేడు వరల్డ్ వైడ్ గా థియేటర్ల లో విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తుంది. ఇప్పటికే ఈ చిత్రం నుండి విడుదల అయిన ప్రచార చిత్రాలకి ప్రేక్షకుల నుండి, అభిమానుల నుండి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం కి టాలీవుడ్ హీరో నితిన్ సోషల్ మీడియా ద్వారా బెస్ట్ విషెస్ తెలిపారు. నేటి నుండి సార్ సినిమా థియేటర్ల లో. ఈ చిత్రం గురించి, ఇప్పటికే చాలా గొప్ప విషయాలు విన్నాను. వెంకీ అట్లూరి గారికి కంగ్రాట్స్, అంతేకాక ధనుష్ కి గ్రాండ్ వెల్ కమ్ అంటూ చెప్పుకొచ్చారు. అంతేకాక నిర్మాత వంశీ కి, చిత్ర యూనిట్ కి బెస్ట్ విషెస్ అంటూ చెప్పుకొచ్చారు. ఈ చిత్రం లో సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటించగా,జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

మనం సినిమా

## బాక్సాఫీస్ వద్ద సమంతతో ఢీకొట్టనున్న యంగ్ హీరో?




కార్తికేయ2తో బ్లాక్బస్టర్ విజయాన్ని సాధించిన తర్వాత, నిఖిల్ 18 పేజెస్ చిత్రం తో ప్రేక్షకులను అలరించాడు. ఇప్పుడు, ప్రామిసింగ్ హీరో నిఖిల్ తదుపరి పాన్ ఇండియన్ చిత్రం స్పై లో కనిపించనున్నారు. ప్రముఖ ఎడిటర్ గ్యారీ బిహెచ్ దర్శకత్వం వహించిన ఈ భారీ బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్ మరోసారి వార్తల్లో నిలిచింది. తాజా సంచలనం ఏమిటంటే, నిఖిల్ యొక్క స్పై ఏప్రిల్ 14, 2023న థియేటర్ల లో విడుదలకి ఫిక్స్ అయ్యింది. ఇటీవల, సమంత యొక్క పౌరాణిక నాటకం శాకుంతలం కూడా అదే తేదీన విడుదల చేయడానికి ధృవీకరించబడింది. అయితే, విడుదల తేదీపై మేకర్స్ ఇంకా అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. శ్రీచరణ్ పాకాల ఈ చిత్రానికి సంగీతం అందించారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ మరియు మలయాళంలో విడుదల ఈ స్పై మూవీ గ్రాండ్ గా రిలీజ్ కానుంది.

## రావణాసుర ప్యార్ లోన పాగల్ సాంగ్ ప్రోమో రిలీజ్!




మాస్ మహారాజా రవితేజ హీరోగా డైరెక్టర్ సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం రావణాసుర. ఈ చిత్రం లో యంగ్ హీరో సుశాంత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఏప్రిల్ 7, 2023 న థియేటర్ల లో విడుదల చేయనున్న ఈ చిత్రం పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం కి సంబంధించిన ప్రచార చిత్రాలు విడుదలై ప్రేక్షకులను, అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ఈ చిత్రం నుండి ప్యార్ లోన పాగల్ సాంగ్ కి సంబంధించిన ప్రోమో ను చిత్ర యూనిట్ విడుదల చేయడం జరిగింది. ఈ ప్రోమో ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇంట్రెస్టింగ్ గా ఉన్న ఈ ప్రోమో కి సంబంధించిన పూర్తి పాట ఫిబ్రవరి 18 న విడుదల కానుంది. అను ఇమ్మాన్యుయేల్, ఫరియా అబ్దుల్లా, మేఘా ఆకాష్ లేడీ లీడ్ రోల్స్ లో నటించిన ఈ చిత్రానికి హర్ష వర్ధన్ రామేశ్వర్ మరియు భీమ్స్ సిసిరోలియో లు సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## 'ప్రాజెక్ట్ – కే' రిలీజ్‌పై ఇంట్రస్టింగ్ బజ్




టాలీవుడ్ స్టార్ హీరోల్లో ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఒకింత వేగంగా సినిమాలు ఎంచుకుంటూ దూసుకెళ్తున్నారు. ఇప్పటికే ఆయన నటించిన మైథలాజికల్ మూవీ ఆదిపురుష్ జూన్ లో రిలీజ్ కి రెడీ అవుతుండగా దాని అంతరం ప్రశాంత్ నీల్ తో చేస్తున్న భారీ మాస్ యాక్షన్ మూవీ సలార్ సెప్టెంబర్ చివర్లో ఆడియన్స్ ముందుకి రానుంది. ఇక వీటితో పాటు మారుతీ తో ఒక మూవీ అలానే నాగ అశ్విన్ తో ప్రాజక్ట్ కె సినిమాలు కూడా చేస్తున్నారు ప్రభాస్. అయితే విషయం ఏమిటంటే, ప్రభాస్ నటిస్తున్న ప్రాజక్ట్ కె మూవీ పై అందరిలో విపరీతమైన అంచనాలు ఉన్నాయి. భారీ సైన్స్ ఫిక్షన్ జానర్ లో రూపొందుతున్న ఈ మూవీ వైజయంతి మూవీస్ బ్యానర్ పై అత్యంత భారీ వ్యయంతో ప్రతిష్టాత్మకంగా రూపొందుతుండడమే దీనికి కారణం. ఇక ఈ మూవీకి సంబంధించి ప్రస్తుతం ఒక ఇంట్రస్టింగ్ న్యూస్ ప్రచారం అవుతోంది. అదేమిటంటే, రానున్న శివరాత్రి తరువాత ఈ మూవీ యొక్క రిలీజ్ డేట్ ని యూనిట్ పక్కాగా అనౌన్స్ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అలానే ఈ మూవీని రెండు భాగాలుగా తీస్తారా అనే దానిపై కూడా యూనిట్ క్లారిటీ ఇవ్వనుందట. ఇక ఈ మూవీ వచ్చే ఏడాది సంక్రాంతి లేదా సమ్మర్ కు రిలీజ్ అయ్యే అవకాశం ఉందట. మొత్తంగా ప్రాజక్ట్ కె మూవీ రిలీజ్ కి సంబంధించి పక్కాగా క్లారిటీ రావాలి అంటే మరికొద్దిరోజుల వరకు ఆగాల్సిందే.

## మరోసారి చరణ్ సినిమాకి అదే ఇబ్బంది?



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం తన కెరీర్ లో 15వ సినిమాని అయితే మావెరిక్ దర్శకుడు శంకర్ తో ప్లాన్ చేసి నటిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే దీని తర్వాత అయితే చరణ్ 16వ సినిమాగా మొదట టాలెంటెడ్ దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తో ఓ భారీ పాన్ ఇండియా సినిమా ప్లాన్ చేసాడు కానీ అది అనూహ్యంగా ఆగిపోయింది. దీనితో శంకర్ సినిమా తర్వాత ఇమీడియెట్ ప్రాజెక్ట్ గా బుచ్చిబాబు తో సినిమా లైన్ లోకి వచ్చింది. మరి గౌతమ్ ని రీప్లేస్ చేస్తూ చరణ్ మరియు యూవీ క్రియేషన్స్ బ్యానర్ లో కన్నడ దర్శకుడు నర్తన్ తో అయితే సినిమాని లాక్ చేశారు. మరి ఈ సినిమా కూడా ఫిక్స్ అయ్యినట్టే అని టాక్ వచ్చింది. కానీ మళ్ళీ అప్పుడు గౌతమ్ కి ఏదైతే అయ్యిందో ఈ సినిమాకి అలాగే అయ్యిన ట్టుగా తెలు స్తుంది. సినిమా స్క్రిప్ట్ ఫైనల్ నరేషన్ విషయంలో చరణ్ సహా మేకర్స్ అంత పాజిటివ్‌గా లేరని అందుకే మళ్ళీ కథ మొదటికి వచ్చినట్టుగా టాక్. దీనితో నర్తన్ మళ్ళీ స్క్రిప్ట్ ని బెటర్ చేస్తున్నారని తెలుస్తుంది. మరి దీనిపై మరింత సమాచారం రావాల్సి ఉంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500 037.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.